www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 8-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 | సంచిక (Issue) : 354

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథి: అమావాస్య రా. 11.53 తదుపరి పాడ్యమి, నక్షత్రం: ఉత్తరాభాద్ర ఉ. 10.13 తదుపరి రేవతి, వర్జ్యం: రా.8.53-10.18, దుర్ముహూర్తం: మ.12.42-1.31, మ.3.10-3.59, అమృతఘడియలు: తె.ఉ.7.23 వరకు, తె. 5.25 మొదలు, రాహుకాలం: ఉ.7.30-9.00, సూర్యోదయం: 6.08, సూర్యాస్తమయం: 6.27

హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

హ్యాట్రిక్‌తో మెరిసింది

లఖ్‌నవూ ఘనవిజయం

బ్యాటింగ్‌లో తడబడిన లఖ్‌నవూ చేసిందే 163 పరుగులు. అయినా ఆ జట్టు బౌలర్లు చూపిన తెగువ వహ్వా.. అనిపించకమానదు. పేసర్ యష్ ఠాకూర్, స్పిన్నర్ క్రునాల్ పాండ్యా పరుగులను కట్టడి చేయడమే కాదు.. కీలక వికెట్లతో గుజరాత్‌ను దెబ్బతీశారు. దీంతో 54/0 నుంచి 80/5కు పడిపోయిన ఆ జట్టు మరిక కోలుకోలేకపోయింది. అటు జెయింట్స్ హ్యాట్రిక్ విజయంతో సంబరాలు చేసుకుంది.

- పేసర్ యశ్‌కు ఐదు వికెట్లు
- కట్టడి చేసిన స్పిన్నర్ క్రునాల్
- గుజరాత్ చిత్తు



యష్ ఠాకూర్ (5/30)

లఖ్‌నవూ: ఐపీఎల్‌లో ఇప్పటిదాకా గుజరాత్ టైటాన్స్‌పై గెలవని లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఆ కొరత తీర్చేసుకుంది. పేసర్ యశ్ ఠాకూర్ (5/30), స్పిన్నర్ క్రునాల్ పాండ్యా (3/11) తమ మ్యాజిక్ బంతులతో టైటాన్స్‌కు అనూహ్య షాక్‌ను ఇచ్చారు. దీంతో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో లఖ్‌నవూ 33 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. రాహుల్ సేనకిది హ్యాట్రిక్ విజయం కాగా.. పట్టికలోనూ మూడో స్థానానికి చేరింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ 20 ఓవర్లలో 5 వికెట్లకు 163 పరుగులు చేసింది. స్టొయినిస్ (43 బంతుల్లో 58), రాహుల్ (33), పూరన్ (22 బంతుల్లో 32 నాటౌట్) రాణించారు. నల్కండే, ఉమేశ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో గుజరాత్ 18.5 ఓవర్లలో 130 పరుగులకే కుప్పకూలింది. సాయి సుదర్శన్ (23 బంతుల్లో 31), తెవాటియా (25 బంతుల్లో 30) ఆకట్టుకున్నారు. లఖ్‌నవూ స్పీడ్‌గన్ మయాంక్ యాదవ్ ఒక్క ఓవర్ వేసి పక్కటెముకల నొప్పితో వైదొలిగాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా యశ్ ఠాకూర్ నిలిచాడు.

వణికించిన యశ్, క్రునాల్: ఓ మాదిరి ఛేదనను సులువుగా పూర్తి చేస్తుందనుకున్న గుజరాత్ జెయింట్స్ అనూహ్యంగా తడబడింది. లఖ్‌నవూ బౌలర్లు కట్టుదిట్టమైన బంతులతో పాటు వరుస విరామాల్లో వికెట్లు నేలకూలుస్తూ మ్యాచ్‌ను లాగేశారు. స్పిన్నర్ క్రునాల్, పేసర్ యశ్ ఠాకూర్ కీలక వికెట్లతో దెబ్బతీశారు. ఓపెనర్లు సాయిసుదర్శన్, గిల్ తొలి వికెట్‌కు అందించిన 54 పరుగుల భాగస్వామ్యం తప్ప టైటాన్స్ ఇన్నింగ్స్‌లో చెప్పుకోవడానికేమీ లేకపోయింది. పవర్‌ప్లేలో 54 పరుగులతో పటిష్టంగానే కనిపించినా గిల్ వికెట్‌ను యష్ తీశాడు. ఇక ఆ తర్వాత గుజరాత్‌ను లఖ్‌నవూ బౌలర్లు అల్లాడించారు. విలియమ్సన్ (1)ను స్పిన్నర్ బిష్ణోయ్ ఒంటిచేత్తో అందుకున్న రిటర్న్ క్యాచ్‌తో పెవిలియన్ బాట పట్టించగా.. తొమ్మిదో ఓవర్‌లో సాయి, శరత్ (2)లను క్రునాల్ పాండ్యా దెబ్బతీశాడు. దీనికి తోడు 7-11 ఓవర్ల మధ్య కనీసం ఓ ఫోర్ కూడా రాబట్టలేకపోయింది. విజయ్ శంకర్ (17), నల్కండే (12)లను స్పిన్నర్లు తెగ ఇబ్బందిపెట్టారు. 12వ ఓవర్‌లో సిక్సర్ బాదిన నల్కండేను క్రునాల్.. కాసేపటికే విజయ్, రషీద్ (0)లను యశ్ మెయిడిన్ డబుల్ వికెట్‌గా అవుట్ చేయడంతో టైటాన్స్ 93 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయి విజయంపై ఆశలు వదులుకుంది. అప్పటికీ ఛేదన మరీ కష్టంగా లేకున్నా చేతిలో వికెట్లు లేకపోవడం దెబ్బతీసింది. చివర్లో తెవాటియా మెరుపులు ఓటమి తేడాను తగ్గించాయి. 19వ ఓవర్‌లో తెవాటియా, నూర్ (4)ల వికెట్లను తీసిన యశ్ మ్యాచ్‌ను ముగించాడు.

సాదాసీదాగా..: టాస్ గెలవగానే లఖ్‌నవూ కెప్టెన్ రాహుల్ బ్యాటింగ్‌కు మొగ్గు చూపినా.. బరిలోకి దిగాక బ్యాటర్లు పరుగుల కోసం తెగ కష్టపడ్డారు. చివర్లో పూరన్, బదోని (20) కాస్త బ్యాట్ ఝుళిపించడంతో స్కోరు 160 దాటగలిగింది. అంతకుముందు తొలి ఓవర్‌లోనే జట్టుకు షాక్ తగిలింది. ఫామ్‌లో ఉన్న ఓపెనర్ డికాక్ (6) నాలుగో బంతికే వెనుదిరగ్గా.. దేవ్‌దత్ పడిక్కళ్ (7) తన పేలవ ఫామ్‌ను వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ కొనసాగించాడు. ఈ ఇద్దరినీ పేసర్ ఉమేశ్ యాదవ్ పెవిలియన్‌కు చేర్చాడు. ఈ దశలో మరో ఓపెనర్ రాహుల్, స్టొయినిస్ క్రీజులో నిలిచి జట్టును ఆదుకున్నారు. కానీ వీరు ఆచితూచి ఆడడం జట్టు భారీ స్కోరుపై ప్రభావం పడింది. అనంతరం స్పిన్నర్లు నూర్ అహ్మద్, రషీద్ ఖాన్ మెరుగ్గా బౌలింగ్ వేయడంతో ఈ జోడీ భారీ షాట్లు ఆడలేకపోయింది. అయితే వికెట్‌ను కాపాడుకుంటూ చక్కగా కుదురుకున్న ఈ ఇద్దరినీ పేసర్ నల్కండే దెబ్బతీసి జట్టుకు రిలీఫ్‌నిచ్చాడు. ముందుగా 13వ ఓవర్‌లో రాహుల్‌ను అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 73 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. తన తర్వాతి ఓవర్‌లో స్టొయినిస్ రెండు సిక్సర్లు బాది అర్ధసెంచరీ పూర్తి చేసినా ఐదో బంతికి క్యాచ్ అవుటయ్యాడు. అటు ఈ దశలో క్రీజులో పూరన్ ఉన్నా బ్యాట్ ఝుళిపించలేకపోవడంతో 17 ఓవర్లలో స్కోరు 126/4గానే ఉంది. అయితే 18వ ఓవర్‌లో పూరన్ సిక్సర్, బదోని రెండు ఫోర్లతో 17 రన్స్ రాబట్టి లఖ్‌నవూ శిబిరంలో కాస్త జోష్ తెచ్చారు. కానీ ఈ సంతోషాన్ని ఆవిరి చేస్తూ బదోనిని రషీద్ అవుట్ చేయగా, చివరి ఓవర్‌లో పేసర్ జాన్సన్ 8 పరుగులే ఇచ్చి కట్టడి చేశాడు.

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు) 	 చాహల్ (రాజస్థాన్)
316 పరుగులు	8 వికెట్లు

నేటి మ్యాచ్

చెన్నై X కోల్‌కతా

వేదిక: చెన్నై-రా.7.30 గం.

స్కోరుబోర్డు

లఖ్‌నవూ: డికాక్ (సి) నూర్ (బి) ఉమేశ్ 6, రాహుల్ (సి) తెవాటియా (బి) నల్కండే 33, పడిక్కళ్(సి) విజయ్ శంకర్ (బి) ఉమేశ్ 7, స్టొయినిస్ (సి) శరత్ (బి) నల్కండే 58, పూరన్ (నాటౌట్) 32, బదోనీ (సి) ఉమేశ్ (బి) రషీద్ 20, క్రునాల్ (నాటౌట్) 2 : **ఎక్స్‌ట్రాలు : 5 : మొత్తం (20 ఓవర్లలో) 163/5 ; వికెట్లపతనం :** 1/6, 2-18, 3-91, 4-112, 5-143 ; **బౌలింగ్ :** ఉమేశ్ 3-0-22-2, స్పెన్సర్ జాన్సన్ 4-0-32-0, రషీద్ 4-0-28-1, మోహిత్ 3-0-34-0, నూర్ అహ్మద్ 4-0-22-0, దర్శన్ నల్కండే 2-0-21-2

గుజరాత్: సాయి సుదర్శన్ (సి) బిష్ణోయ్ (బి) క్రునాల్ 31, గిల్ (బి) యశ్ ఠాకూర్ 19, విలియమ్సన్ (సి) అండ్ (బీ) బిష్ణోయ్ 1, శరత్ (సి) బదోనీ (బి) క్రునాల్ 2, విజయ్ శంకర్ (సి) రాహుల్ (బి) యశ్ ఠాకూర్ 17, నల్కండే (సి) యశ్ ఠాకూర్ (బి) క్రునాల్ 12, తెవాటియా (సి) పూరన్ (బి) యశ్ ఠాకూర్ 30, రషీద్ (సి) సబ్ హుడా (బి) యశ్ ఠాకూర్ 0, ఉమేశ్ (సి) డికాక్ (బి) నవీన్ 2, జాన్సన్ (నాటౌట్) 0, నూర్ (సి) డికాక్ (బి) యశ్ ఠాకూర్ 4 : **ఎక్స్‌ట్రాలు : 12 : (మొత్తం 18.5 ఓవర్లలో) 130 ఆలౌట్ ; వికెట్లపతనం :** 1-54, 2-56, 3-58, 4-61, 5-80, 6-93, 7-93, 8-102, 9-126 **బౌలింగ్:** మణిమారన్ సిద్ధార్థ్ 4-0-29-0, నవీన్ ఉల్ హక్ 4-0-37-1, మయాంక్ యాదవ్ 1-0-13-0, యశ్ ఠాకూర్ 3.5-1-30-5, క్రునాల్ 4-0-11-3, బిష్ణోయ్ 2-0-8-1.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	4	4	0	0	8	1.120
కోల్‌కతా	3	3	0	0	6	2.518
లఖ్‌నవూ	4	3	1	0	6	0.775
చెన్నై	4	2	2	0	4	0.517
హైదరాబాద్	4	2	2	0	4	0.409
పంజాబ్	4	2	2	0	4	-0.220
గుజరాత్	5	2	3	0	4	-0.797
ముంబై	4	1	3	0	2	-0.704
బెంగళూరు	5	1	4	0	2	-0.843
ఢిల్లీ	5	1	4	0	2	-1.370

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

ముంబై గెలిచింది

అదరగొట్టిన రోహిత్, షెఫర్డ్, డేవిడ్

29 పరుగులతో ఓడిన ఢిల్లీ

● కొట్జీకి 4 వికెట్లు ● స్టబ్స్, షా పోరాటం వృథా



షెఫర్డ్ (10 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 39 నాటౌట్)

6 బంతులు, 32 పరుగులు

సీజన్‌లో రెండో మ్యాచ్ ఆడుతున్న ముంబై బ్యాటర్ రొమారియో షెఫర్డ్ విధ్వంసమే సృష్టించాడు. ముంబై ఇన్నింగ్స్‌లో చివరి 13 బంతులు మిగిలి ఉన్నపుడు క్రీజులోకి అడుగుపెట్టిన తను ఆఖరి ఓవర్‌లో ఢిల్లీకి పట్టపగలే చుక్కలు చూపించాడు. పేసర్ నోకియా వేసిన ఈ ఓవర్‌లో అతను వరుసగా 4,6,6,6,4,6తో ఏకంగా 32 పరుగులు రాబట్టి స్కోరును 234కి చేర్చాడు. గతేడాది లఖ్‌నవూ నుంచి ట్రేడింగ్ ద్వారా ముంబై ఈ విండీస్ ఆల్‌రౌండర్‌ను తీసుకుంది.

ముంబై: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ముంబై హార్దిక్ పాండ్యా కెప్టెన్సీలో ఎట్టకేలకు బోణీ కొట్టింది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' రొమారియో షెఫర్డ్ (10 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 39 నాటౌట్) ఊచకోతతో.. ఐపీఎల్‌లో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ 29 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. ఢిల్లీ కూడా తుదికంటా పోరాడినా.. షెఫర్డ్ చివరి ఓవర్ విధ్వంసమే రెండు జట్ల మధ్య తేడా చూపించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 234 పరుగులు చేసింది. వాంఖడేలో ముంబైకిదే అత్యధిక స్కోరు. రోహిత్ శర్మ (27 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 49), టిమ్ డేవిడ్ (21 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 45 నాటౌట్), ఇషాన్ కిషన్ (23 బంతుల్లో 42), హార్దిక్ (39) రాణించారు. అక్షర్ పటేల్, నోకియా రెండేసి వికెట్లు పడగొట్టారు. ఛేదనలో ఢిల్లీ ఓవర్లన్నీ ఆడి 205/8 స్కోరు మాత్రమే చేసింది. స్టబ్స్ (25 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్సర్లతో 71 నాటౌట్), పృథ్వీ షా (40 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 66), అభిషేక్ పోరెల్ (41) పోరాటాలు వృథా అయ్యాయి. కొట్జీ 4, బుమ్రా 2 వికెట్లు పడగొట్టారు. వరుసగా మూడు మ్యాచ్‌ల ఓటమి తర్వాత ముంబైకిది తొలి గెలుపుకాగా.. ఆడిన 5 మ్యాచ్‌ల్లో నాలుగు ఓడిన ఢిల్లీ పాయింట్ల పట్టికలో ఆఖరి స్థానానికి దిగజారింది.

జోరు తగ్గిన పవర్‌ప్లే..: భారీ లక్ష్యం కోసం బరిలోకి దిగిన ఢిల్లీ.. పవర్‌ప్లేలో ఆశించినంత వేగంగా పరుగులు చేయలేకపోవడం ఒకరకంగా ఓటమికి కారణమైంది. ఓపెనర్ వార్నర్ (10) స్వల్ప స్కోరుకే వెనుదిరిగినా.. మరో ఓపెనర్ షా, అభిషేక్ రెండో వికెట్‌కు 88 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశాడు. 10 ఓవర్లు ముగిసే సరికి ఢిల్లీ 94/1తో పోటీ ఇచ్చేలా కనిపించింది. కానీ, షాను బుమ్రా బౌల్డ్ చేసి బ్రేక్ ఇచ్చాడు. ఈ దశలో పోరెల్‌తో కలసి మూడో వికెట్‌కు 34 పరుగులు జోడించిన స్టబ్స్.. తుది వరకూ ఒంటరి పోరాటాన్ని కొనసాగించాడు. అభిషేక్‌ను బుమ్రా.. పంత్ (1)ను కొట్జీ అవుట్ చేయడంతో ఢిల్లీ ఆశలు వదిలేసుకొంది. 19వ ఓవర్‌లో అక్షర్ పటేల్ (8) రనౌట్ అయినా.. స్టబ్స్ మూడు సిక్సర్లు బాదడంతో ఢిల్లీ 201/5తో నిలిచింది. చివరి ఓవర్‌లో క్యాపిటల్స్ విజయానికి 35 పరుగులు కావాల్సి ఉండగా.. లలిత్ (3), కుశాగ్ర (0), రిచర్డ్‌సన్ (2)ను అవుట్ చేసిన కొట్జీ.. 4 రన్స్ మాత్రమే ఇచ్చాడు.

దుమ్మురేపిన రోహిత్..: ఆరంభంలో రోహిత్ శర్మ.. ఆఖర్లో షెఫర్డ్ వీరహారంతో ముంబై భారీ స్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబైకి ఓపెనర్లు ఇషాన్, రోహిత్ అదిరే ఆరంభాన్నిచ్చారు. అయితే, రోహిత్‌ను బౌల్డ్ చేసిన అక్షర్.. 80 పరుగుల భాగస్వామ్యాన్ని బ్రేక్ చేశాడు. ఈ సీజన్‌లో తొలిసారి బరిలోకి దిగిన సూర్యకుమార్ (0)ను నోకియా డకౌట్ చేశాడు. 11వ ఓవర్లో ఇషాన్‌ను అక్షర్ అవుట్ చేయగా.. తిలక్ వర్మ (6) ఎక్కువసేపు క్రీజులో నిలవలేక పోయాడు.

ఎగతాళిని 'కట్టడి' చేశారు!

తొలి మూడు మ్యాచ్‌ల్లో కెప్టెన్ హార్దిక్‌కు ముంబై అభిమానుల నుంచి ఎదురైన ఎగతాళి, హేళన ఈసారి అంతగా కనిపించలేదు. వ్యతిరేకతను తగ్గించేందుకు ముంబై ఫ్రాంచైజీ ఆదివారం నాటి మ్యాచ్‌కు ఏకంగా 18 వేల టిక్కెట్లను పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసింది. 'అందరికీ విద్య, క్రీడల దినోత్సవం'లో భాగంగా రిలయన్స్ ఫౌండేషన్ వీరిని రప్పించింది. మరోవైపు టాస్ సమయంలోనూ హార్దిక్‌ను గేలి చేస్తున్నట్టుగా టీవీల్లో ఎలాంటి శబ్దం వినిపించలేదు. దీంతో కావాలనే సౌండ్‌ను బ్లాక్ చేశారని ఫ్యాన్స్ ఆరోపిస్తున్నారు.

స్కోరుబోర్డు

ముంబై: రోహిత్ (బి) అక్షర్ 49, ఇషాన్ (సి అండ్ బి) అక్షర్ 42, సూర్యకుమార్ (సి/సబ్) ఫ్రేజర్ (బి) నోకియా 0, హార్దిక్ (సి/సబ్) ఫ్రేజర్ (బి) నోకియా 39, తిలక్ (సి) అక్షర్ (బి) ఖలీల్ 6, డేవిడ్ (నాటౌట్) 45, షెఫర్డ్ (నాటౌట్) 39; **ఎక్స్‌ట్రాలు: 14; మొత్తం: 20 ఓవర్లలో 234/5; వికెట్ల పతనం:** 1-80, 2-81, 3-111, 4-121, 5-181; **బౌలింగ్:** ఖలీల్ 4-0-39-1, ఇషాంత్ 3-0-40-0, రిచర్డ్‌సన్ 4-0-40-0, అక్షర్ 4-0-35-2, లలిత్ 1-0-15-0, నోకియా 4-0-65-2.

ఢిల్లీ: పృథ్వీ షా (బి) బుమ్రా 66, వార్నర్ (సి) హార్దిక్ (బి)షెఫర్డ్ 10, అభిషేక్ (సి) డేవిడ్ (బి) బుమ్రా 41, స్టబ్స్ (నాటౌట్) 71, పంత్ (సి) హార్దిక్ (బి) కొట్జీ 1, అక్షర్ (రనౌట్) 8, లలిత్ (సి) ఇషాన్ (బి) కొట్జీ 3, కుశాగ్ర (సి) తిలక్ (బి) కొట్జీ 0, రిచర్డ్‌సన్ (సి) రోహిత్ (బి) కొట్జీ 2; **ఎక్స్‌టాలు: 3; మొత్తం: 20 ఓవర్లలో 205/8; వికెట్ల పతనం:** 1-22, 2-110, 3-144, 4-153, 5-194, 6-203, 7-203, 8-205; **బౌలింగ్:** కొట్జీ 4-0-34-4, బుమ్రా 4-0-22-2, ఆకాశ్ 4-0-45-0, షెఫర్డ్ 4-0-54-1, నబీ 2-0-17-0, చావ్లా 2-0-32-0.

అర్జున్ కెరీర్ బెస్ట్ ర్యాంక్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): యువ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేసి అర్జున్ వరల్డ్ చెస్ క్లాసిక్ ర్యాంకింగ్స్‌లో కెరీర్ అత్యుత్తమ ఐదోర్యాంక్‌కు చేరుకున్నాడు. స్పెయిన్‌లో జరుగుతున్న మెనోర్కా ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంట్‌లో అర్జున్ ఈ ఘనత సాధించాడు. ఈ టోర్నీలో అర్జున్ 7.5 పాయింట్లతో విజేతగా నిలవగా, అలెక్సింకో (రష్యా) రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు. ఈనెల 2వ తేదీ నుంచి జరుగుతున్న ఈ పోటీ లు ఆదివారం ముగిశాయి. రష్యా జీఎం ఫెడోసివ్‌తో జరిగిన ఆఖరి రౌండ్‌ను అర్జున్ డ్రాగా ముగించాడు.

రెండో టెస్ట్‌లోనూ ఓడిన భారత్

పెర్త్: ఆస్ట్రేలియా పర్యటనలో భారత హాకీ జట్టుకు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. ఆదివారం జరిగిన రెండో టెస్ట్‌లో భారత్ 2-4తో ఆస్ట్రేలియా చేతిలో పరాజయం పాలైంది. దీంతో ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో టీమిండియా 0-2తో వెనుకబడింది. జుగ్‌రాజ్ సింగ్ (9వ), హర్మన్‌ప్రీత్ సింగ్ (30వ) చెరో పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచారు. ఆసీస్ తరపున జెరెమీ హేవర్డ్ (6వ, 34వ), జాకబ్ అండర్సన్ (42వ), నాథన్ ఎఫ్రామస్ (45వ) గోల్స్ సాధించారు. బుధవారం మూడో మ్యాచ్ జరగనుంది.

అందుకే.. శ్రీశాంత్ తప్పించుకోగలిగాడు !



న్యూఢిల్లీ: భారత క్రీడా రంగంలో అవినీతి నిరోధానికి సంబంధించి సరైన చట్టాలు లేకపోవడంవల్లే స్పాట్ ఫిక్సింగ్ కేసులో పేసర్ శ్రీశాంత్ కఠినమైన శిక్ష పడకుండా తప్పించుకున్నాడని ఢిల్లీ మాజీ పోలీసు కమిషనర్ నీరజ్ కుమార్ తెలిపారు. 2013 ఐపీఎల్ స్పాట్ ఫిక్సింగ్ కుంభకోణంలో శ్రీశాంత్, అతడి రాజస్థాన్ రాయల్స్ సహచరులు అంకిత్ చవాన్, అజిత్ చండీలాను అప్పటి ఢిల్లీ పోలీసు కమిషనర్ నీరజ్ కుమార్ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం అరెస్ట్ చేసిన విషయం విదితమే. ఆ కేసులో శ్రీశాంత్‌పై బీసీసీఐ జీవితకాల నిషేధం విధించింది. అయితే..శ్రీశాంత్‌కు వ్యతిరేకంగా సాక్ష్యం ఉన్నా..అతడిపై విధించిన జీవితకాల నిషేధాన్ని ఎత్తివేసే విషయాన్ని పరిశీలించాలని 2019లో సుప్రీంకోర్టు బీసీసీఐకి సూచించింది. దరిమిలా శ్రీశాంత్‌పై నిషేధాన్ని ఏడు సంవత్సరాలకు బోర్డు కుదించింది. ఆ నిషేధం సెప్టెంబరు 2020లో ముగిసింది. 'దురదృష్టవశాత్తు భారత క్రీడా రంగంలో లేదా క్రికెట్‌లో అవినీతిని అరికట్టేందుకు సరైన చట్టాలు లేవు. అందువల్లే..శ్రీశాంత్‌కు వ్యతిరేకంగా బలమైన సాక్ష్యాలున్నా అతడు తప్పించుకోగలిగాడు' అని నీరజ్ కుమార్ పేర్కొన్నారు.

వాళ్లిద్దరూ పెద్ద మురికిగాళ్లు!



రోహిత్ శర్మ



న్యూఢిల్లీ: శిఖర్ ధవన్, రిషభ్ పంత్‌లతో హోటల్ గదిని పంచుకోవాలంటే ఎవరైనా భయపడతారని భారత కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. కమెడియన్ కపిల్ శర్మ కార్యక్రమంలో పాల్గొన్న తను ఈ విషయం చెప్పాడు. 'రూమ్ షేర్ చేసుకోవాల్సివస్తే ఎవరితో ఉంటారు?' అని అడిగిన ప్రశ్నకు రోహిత్ సమాధానమిస్తూ.. 'ప్రస్తుతం ప్రతీ ఆటగాడికి ఒక్కో గదిని కేటాయిస్తున్నారు. అయితే రూం పంచుకోవాల్సి వస్తే నేను శిఖర్ ధవన్, రిషభ్ పంత్‌లతో కలిసి మాత్రం ఉండలేను. వాళ్లిద్దరూ పెద్ద మురికిగాళ్లు. తమ గదులను శుభ్రంగా ఉంచుకోరు. ప్రాక్టీస్ అయ్యాక మంచంపైనే దుస్తులను పడేస్తుంటారు. అలాగే ఒంటిగంటదాకా నిద్ర లేవరు. పొద్దున్నే రూమ్ క్లీనింగ్ వాళ్లు వస్తారని తలుపులకు డోన్ట్ డిస్టర్బ్ బోర్డును వేలాడదీస్తుంటారు. నేనే కాదు ఎవరూ వారితో ఉండేందుకు ఇష్టపడరు' అని తెలిపాడు. అలాగే వన్డే వరల్డ్‌కప్ ముగిశాక భారత అభిమానులు తమతో స్నేహపూర్వకంగానే వ్యవహరించారని, ఇది తమనెంతో ఆశ్చర్యానికి గురి చేసిందన్నాడు. 'ఫైనల్లో ఓడినందుకు జట్టుపై ఆగ్రహం చూపిస్తారని అనుకున్నా. కానీ ఎంతో బాగా ఆడారని ప్రశంసించారని' రోహిత్ గుర్తుచేసుకున్నాడు.

జాతీయ బాక్సింగ్‌లో అహ్మద్‌కు స్వర్ణం

హైదరాబాద్ : బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఎఫ్ఐ), ఖేలో ఇండియా సంయుక్తంగా నిర్వహించిన జాతీయ బాక్సింగ్ పోటీల్లో హైదరాబాద్ బాక్సర్ అహ్మద్ హష్మి స్వర్ణం సాధించాడు. గుర్‌గావ్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో జూనియర్ కేటగిరీ 33-35 కిలోల విభాగంలో అహ్మద్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో అహ్మద్ 5-0 మెక్కాడెస్ (తమిళనాడు)ను చిత్తు చేశాడు.

హంపి హ్యాట్రిక్ డ్రా



టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్‌లో కోనేరు హంపికి వరుసగా మూడో డ్రా ఎదురైంది. మూడో రౌండ్‌లో టాన్ జోంగి (చైనా) తలపడిన హంపి 24 ఎత్తుల తర్వాత డ్రా చేసుకుంది. యువ జీఎం ప్రజ్ఞానంద 45వ ఎత్తులో సీనియర్ జీఎం విదిత్ గుజరాతిని ఓడించాడు. రష్యా జీఎం నెపోమ్నియాతో ఆడిన గుకేష్ 40వ ఎత్తు తర్వాత డ్రా చేసుకున్నాడు. సాలిమోవా (బల్గేరియా)తో తలపడిన వైశాలి (తమిళనాడు) 33వ ఎత్తులో విజయం సాధించింది. మొత్తంగా 3 రౌండ్లు ముగిసేసరికి మహిళల్లో హంపి 3వ, వైశాలి 4వ స్థానంలో నిలవగా, పురుషుల్లో ఫాబియానో టాప్‌లో, గుకేష్, విదిత్, ప్రజ్ఞానంద 3 నుంచి 5 స్థానాల్లో కొనసాగుతున్నారు.

టేబుల్ ఫ్యాన్ ఏర్పాటుపై వివాదం

అధికారిపై అట్రాసిటీ కేసు

- చివ్వెంల ఏపీవోపై గత డీఆర్డీవో ఆగ్రహం
- అప్పట్లోనే పోలీసులు, ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు
- అప్పట్లో స్పందన కరువు.. తాజాగా మరోసారి ఫిర్యాదు

చివ్వెంల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి(డీఆర్డీవో)గా పనిచేసిన సుందరి కిరణ్‌కుమార్‌పై చివ్వెంల పోలీస్‌స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదైంది. డీఆర్డీవోగా విధులు నిర్వర్తించిన సమయంలో టేబుల్ ఫ్యాన్ ఏర్పాటుపై ఏపీవో(అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్)పై ఆగ్రహం వ్యక్తంచేయడమే ఇందుకు కారణమైంది. చివ్వెంల ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత ఏడాది సెప్టెంబరు 19వ తేదీన చివ్వెంలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ తనిఖీలకు హాజరైన డీఆర్డీవో సుందరి కిరణ్‌కుమార్... తనిఖీల సమయంలో కనీసం టేబుల్‌ఫ్యాన్ కూడా సమకూర్చలేదని ఏపీవో నాగయ్యపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్దేశపూర్వకంగానే కిరణ్‌కుమార్ తనను అందరి ముందు అవమానించారని అదేరోజు చివ్వెంల పోలీ‌స్‌స్టేషన్‌లో నాగయ్య ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో సూర్యాపేట జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ స్పందన లేకపోవడంతో ఎస్సీ, ఎస్టీ జాతీయ కమిషన్‌ను ఆశ్రయించారు. అక్కడి నుంచి కూడా స్పందన లభించలేదు. దీంతో ఏపీవో నాగయ్య శనివారం మరోసారి చివ్వెంల పోలీ‌స్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆదివారం తెలిపారు. సుందరి కిరణ్‌కుమార్ వ్యవసాయశాఖలో ఏడీ స్థాయి అధికారి అయినప్పటికీ, సూర్యాపేట డీఆర్డీవోగా ఎనిమిదేళ్ల బాధ్యతలు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాతృసంస్థలకు వెళ్లాలని ఆదేశించటంతో ప్రస్తుతం నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తిలో విధులు నిర్వర్తిస్తున్నారు.

వైద్య కళాశాలలకు వార్‌రూమ్!

- డీఎంఈ కార్యాలయంలో ఏర్పాటు
- ఎన్ఎంసీపై అవగాహన ఉన్న అధ్యాపకుల నియామకం
- ఎన్ఎంసీకి సమాధానమిచ్చేందుకే..
- కొనసాగుతున్న నియామక ప్రక్రియ
- 1000కి పైగా దరఖాస్తులు
- ప్రైవేటు కాలేజీల నుంచి వారిని రిలీవ్ చేయని వైనం

హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయతలపెట్టిన వైద్య కళాశాలల కోసం ప్రభుత్వం 'వార్‌రూమ్'ను ఏర్పాటు చేసింది. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు డీఎంఈ కార్యాలయంలో దీన్ని ఏర్పాటు చేశారు. ఇందులో పనిచేసేందుకు వివిధ కాలేజీల నుంచి అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లను తీసుకున్నారు. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) నిబంధనలు, సంస్థ కార్యకలాపాలపై మంచి పట్టున్న 7-8 మంది అధ్యాపకులను ఈ వార్‌రూమ్‌లో విధులు నిర్వర్తించేందుకు తీసుకున్నారు. ఎన్ఎంసీ నిత్యం ఆయా రాష్ట్రాలకు, వైద్య విద్య సంచాలకులకు పంపే సూచనలు, ఆదేశాలను గమనించి, వాటికి జవాబులు తయారు చేయడమే ఈ వార్‌రూమ్ లక్ష్యమని ఉన్నతాధికారులు చెబుతున్నారు. అంతేగాక రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేస్తున్న 8 వైద్య కళాశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, బోధనా సిబ్బందితో పాటు ఇతర అంశాలను వార్‌రూమ్ టీమ్ పర్యవేక్షిస్తుంటుంది. అలాగే ఇప్పటికే ఉన్న మెడికల్ కాలేజీలకు సంబంధించిన ఇతరత్రా అంశాల (అటెండెన్స్, సీసీ కెమెరాల పర్యవేక్షణ)ను కూడా పరిశీలిస్తూ ఉంటుంది. ముఖ్యంగా అధ్యాపకుల లోటు, హాజరు శాతం, ఇతర మౌలిక సదుపాయాల లేమిపై ఎన్ఎంసీ షోకాజ్ నోటీసులు పంపుతుంటుంది. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్‌కు సంబంధించి నోటీసులు ఎక్కువగా వస్తుంటాయి. వాటికి వెంటనే సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఎన్ఎంసీ కాలేజీల తనిఖీలకు రావడం దాదాపు నిలిపివేసింది. ఆన్‌లైన్‌లోనే తనిఖీలు చేస్తోంది. బోధనా సిబ్బంది, హాజరు, రోగుల ఓపీ, ఐపీ, విద్యార్థుల తరగతులు లాంటివన్నీ కూడా ఆన్‌లైన్ ద్వారానే చూసుకుంటోంది. నిబంధనల ప్రకారం లేకుంటే నోటీసులు జారీ చేస్తోంది. వాటికి తక్షణమే జవాబు పంపాలి. లేకపోతే సీట్లలో కోత పెట్టే అవకాశం ఉంటుంది. అందుకే ఎన్ఎంసీ నోటీసులు, ఆదేశాలకు యుద్ధప్రాతిపదికన సమాధానమిచ్చేందుకు ఈ వార్ రూమ్‌ను ఏర్పాటు చేశారు.

కొనసాగుతున్న రిక్రూట్‌మెంట్

రాష్ట్రంలోని 26 సర్కారు మెడికల్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు సర్కారు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గత నెల 11న ఆర్థిక శాఖ అందుకు ఆమోదం తెలిపింది. ఇందులో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులున్నాయి. అలాగే సీనియర్ రెసిడెంట్ డాక్టర్స్ కూడా ఉన్నారు. ఈ నియామకాలన్నింటినీ కలెక్టర్ల నేతృత్వంలోని జిల్లా ఎంపిక కమిటీ ద్వారా సత్వరమే చేపట్టాలని ఆదేశించారు. సర్కారు నిర్ణయం తీసుకున్న వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో ఈసీకి లేఖ రాసి, ఈ పోస్టుల భర్తీకి అనుమతి తీసుకున్నారు. ప్రస్తుతం ఏ మెడికల్ కాలేజీకి సంబంధించి ఆ జిల్లా పరిధిలో నోటిఫికేషన్ ఇచ్చారు. ఇప్పటివరకు 1000 దరఖాస్తులొచ్చినట్లు వైద్యవర్గాలు తెలిపాయి. అలాగే సుమారు 300 మంది విధుల్లో చేరినట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఇంకా ఎక్కువ మంది చేరాల్సి ఉన్నా- అందుకు ఇతర కారణాలున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ప్రైవేటు మెడికల్ కాలేజీల అధ్యాపకులను యాజమాన్యాలు రిలీవ్ చేయడం లేదని సమాచారం. అదే సమయంలో ఒక చోట అధ్యాపకులుగా పనిచేసే వారి ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ అటెండెన్స్ (అబాస్) ఆ కాలేజీ నుంచి ఎన్ఎంసీ వెబ్‌సైట్‌కు లింకై ఉంటుంది. అధ్యాపకులు కాలేజీ మారితే ఆ అబాస్‌ను బదిలీ చేయాల్సి ఉంటుంది. అందుకు ప్రైవేటు మెడికల్ కాలేజీలు ససేమిరా అంటున్నాయి. దీంతో అధ్యాపకులు సర్కారీ కళాశాలల్లో చేరలేకపోతున్నారు. మరోవైపు నియామక ప్రక్రియను అన్ని జిల్లాల్లోనూ కొనసాగిస్తూనే ఉన్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి.

భార్య కాపురానికి రావడం లేదని

అత్త ఇంటికి అల్లుడి నిప్పు

- ఆపై ఆత్మహత్యాయత్నం.. మృతి

అచ్చంపేట, ఏప్రిల్ 7: భార్య కాపురానికి రావడం లేదన్న ఆగ్రహంతో ఓ యువకుడు అఘాయిత్యానికి ఒడిగట్టాడు. అత్త ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. తానూ ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పు అంటించుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం రంగాపూర్ గ్రామంలో ఆదివారం జరిగింది. బల్మూరు మండలం గోదల్ గ్రామానికి చెందిన సుభాష్‌రెడ్డికి అచ్చంపేట మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన రోషిత అలియాస్ లోహితలకు గత ఏడాది మే 31న వివాహమైంది. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో యువతి తన తల్లి ఊరైన రంగాపూర్‌కు వచ్చింది. ఆదివారం సుభాష్‌రెడ్డి తన అత్త ఇంటికి వచ్చి తన భార్య ఏదని రోషిత చెల్లెలిని ప్రశ్నించాడు. అమ్మనాన్నలతో కలిసి పని కోసం వేరే ఊరికి వెళ్లిందని ఆమె చెప్పింది. దీంతో ఆగ్రహించిన సుభాష్ రెడ్డి వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఇంట్లో ఉన్న సామాన్లపై చల్లి, తనమీద పోసుకొని నిప్పు అంటించాడు. మంటల్లో ఇల్లు మొత్తం కాలిబూడిదయ్యింది. తీవ్రంగా గాయపడిన సుభాష్‌రెడ్డి ఇంట్లోనుంచి బయటకు పరుగెత్తుకొచ్చాడు. గ్రామస్థులు అతడిని వెంటనే అచ్చంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈమేరకు రోషిత కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, అత్తింటి వారే అల్లుడికి నిప్పుపెట్టి చంపేశారని సుభాష్‌రెడ్డి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 8-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 354 | హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మరో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే

హస్తం గూటికి

సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కారు పార్టీ ఖాళీ

11

మా ఎమ్మెల్యేను ఎలా చేర్చుకున్నారు?

కాంగ్రెస్ రీతి.. నీతి ఇదేనా?

ఫిరాయింపులపై చట్టసవరణ అన్నారు..

జనజాతర సభ కాదు.. హామీల పాతర సభ

న్యాయ్ పేరిట నయా నాటకం: కేటీఆర్



హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): 'కాంగ్రెస్ చేపట్టింది.. జనజాతర సభ కాదు.. హామీల పాతర.. అబద్ధాల జాతర సభ' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శనివారం కాంగ్రెస్ చేపట్టిన జనజాతర సభపై ఆదివారం 'ఎక్స్' వేదికగా ఆయన విమర్శలు గుప్పించారు. నమ్మి ఓటేసిన 4 కోట్ల తెలంగాణ ప్రజలను నాలుగు నెలలుగా కాంగ్రెస్ నయవంచన చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ అసమర్థ పాలనలో సాగునీరు లేక అన్నదాతలు పంట నష్టపోతున్నారని, రుణమాఫీ లేక

మిగతా 11వ పేజీలో...

కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా లాస్య నివేదిత

11

- ఖరారు చేసిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్
- ఎల్లుండి వరంగల్ ఎంపీ అభ్యర్థి ప్రకటన

బీఆర్‌ఎస్ పోటీయే కాదు

అధికారం కోల్పోయాక బలహీనపడింది

కాంగ్రెస్ పథకాలపై ప్రజల్లో సానుకూలత

మైనారిటీల ఓట్లు ఈసారి కాంగ్రెస్ వైపే

సికింద్రాబాద్‌కు కిషన్‌రెడ్డి చేసిందేమీ లేదు

వరంగల్ పార్లమెంటు పరిధిలోని ఎమ్మెల్యేల మెజారిటీలు డబుల్ కావాలి

అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలి: రేవంత్


సికింద్రాబాద్, వరంగల్ ముఖ్యనేతలతో భేటీ

నేడు కొడంగల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్/బంజారాహిల్స్/హనుమకొండ సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బీఆర్‌ఎస్ పోటీయే కాదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అధికారం కోల్పోయాక ఆ పార్టీ పూర్తిగా బలహీనపడిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తోందని, కష్టపడితే రాష్ట్రంలో అత్యధిక ఎంపీ సీట్లను గెలుచుకోవచ్చని అన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సికింద్రాబాద్, వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాల కాంగ్రెస్ నేతలతో సీఎం వేర్వేరుగా సమావేశమయ్యారు. సికింద్రాబాద్ నియోజకవర్గ ముఖ్య నేతలతో

మిగతా 11వ పేజీలో...

మా కార్యకర్తలు పోటెత్తే కెరటాలు.. 'ఎక్స్'లో సీఎం 11



40 మంది మహిళలకు

లైంగిక వేధింపులు

ట్యాపింగ్‌లో ఘరానా కానిస్టేబుల్ నిర్వాకం

కొందరి డేటా సేకరించి వ్యక్తిగత అంశాల్లోకి చొరబాటు.. నల్లగొండలోని హైదరాబాద్ రోడ్డులో వార్ రూం

మిల్లర్లు, స్మగ్లర్లు, పేకాట నిర్వాహకుల నుంచి భారీ వసూళ్లు.. రౌడీ షీటర్లతో చేతులు కలిపి సెటిల్‌మెంట్లు

ఓ పోలీస్ అధికారి 9 ఎకరాల విక్రయంలో సాయం.. మునుగోడు ఉప ఎన్నిక సమయంలోనూ ప్రమేయం

రూ.కోట్లలో అక్రమార్జన.. విచారణలో బయటకు?.. టాస్కులు, ఆపరేషన్ల గుట్టువిప్పుతున్న రాధాకిషన్‌రావు

ఉన్నతాధికారి చెప్పినట్లే చేశానని విచారణలో వెల్లడి!.. కస్టడీ మరో 3 రోజులు.. నాయకుల చుట్టూ ఉచ్చు

కానిస్టేబుల్.. పోలీస్ శాఖలో కిందిస్థాయి ఉద్యోగి. కానీ, ఇతడు మాత్రం ఘరానా కానిస్టేబుల్..! బెదిరింపులు.. వసూళ్లు.. సెటిల్‌మెంట్లు.. దందాలు.. అన్నింట్లోనూ పాత్ర..! ఓ దశలో జిల్లా ఎస్పీకి అతడు ఎంత చెబితే అంత! ఆడిందే ఆట పాడిందే పాటగా పెత్తనం సాగిస్తూ డీఎస్పీలు, సీఐలకే హడల్ పుట్టించాడు. ఇదే క్రమంలో 'ఫోన్ ట్యాపింగ్' టీంలోకి అతడిని తీసుకున్నారు. దీని మాటున చెలరేగిపోయాడు. కొంత మంది మహిళల వ్యక్తిగత విషయాలు సేకరించి వారి జీవితాలతో ఆడుకున్నాడు. 40 మందిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు.



నల్లగొండ, హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇటీవల నల్లగొండ జిల్లాకు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లను వెస్ట్‌జోన్ పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. వెంటనే వారిని హైదరాబాద్ తరలించారు. వీరిలో ఒకరు రౌడీ షీటర్లతో కలిసి సెటిల్‌మెంట్లు, గంజాయి కేసు నిందితులు, పేకాట నిర్వాహకులు, ఇతర నేరస్థులను టార్గెట్ చేసి రూ.కోట్లలో వసూళ్లకు పాల్పడినట్లు విచారణలో తేలింది. ఏడాదిన్నర కిందట ప్రతిష్ఠాత్మకంగా జరిగిన మునుగోడు ఉప ఎన్నిక సమయంలో ప్రతిపక్ష నేతల ఫోన్లను ట్యాపింగ్ చేసినట్లుగానూ గుర్తించారు. ఇంకా అనేక ఆరోపణలున్న నేపథ్యంలో అవి నిజమని తేలితే అరెస్టు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. నల్లగొండ కేంద్రంగా సాగిన ఈ తంతుపై వెలుగులోకి వస్తున్న సమాచారం పోలీసు శాఖ, రాజకీయ వర్గాల్లో కలకలం సృష్టిస్తోంది. ట్యాపింగ్ కేసులో నల్లగొండ జిల్లాలో పనిచేస్తున్న ఒక సీఐని విచారించడంతో మొత్తం వ్యవహారం బయటపడింది. ట్యాపింగ్ కోసం నల్లగొండలోని హైదరాబాద్ రోడ్‌లో

మిగతా 10వ పేజీలో...



ట్యాపింగ్ తొలి బాధితుణ్ని నేనే

దాని వల్లే ఈ పరిస్థితిలో ఉన్నా

భార్యాభర్తల సంభాషణలూ విన్నారు

ట్యాపింగ్ వల్ల కాపురాలు కూలాయి

కేసీఆర్ పీడపోవాలని కాంగ్రెస్‌కు పట్టం.. వాళ్లదీ అదే తరహా పాలన

మీట్ ద ప్రెస్‌లో ఈటల రాజేందర్

12

విచారణకు ఎవరినైనా పిలుస్తాం

ప్రజా ప్రతినిధులనూ ప్రశ్నిస్తాం

పరిజ్ఞానం ఉన్నవారు సమాచారమివ్వొచ్చు

ప్రభుత్వానికి వంద రోజుల్లో నివేదిక ఇస్తాం

జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి ప్రకటన

12

'విద్యుత్తు'పై విచారణ షురూ

యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్లు, ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోలుపైనా..

అధికారులతో భేటీ.. ఫైళ్ల పరిశీలన

ఐపీఎస్‌లకు కాదు..

అయ్యా.. ఎస్‌లకే!

గత ప్రభుత్వంలో రిటైర్డ్, నాన్ కేడర్ వారికే ప్రాధాన్యం

నేరుగా నియమితులైనవారికి పోస్టింగ్స్‌లో అన్యాయం

నిఘా, ఐఎస్‌డబ్ల్యూ, ఎస్ఐబీ, టాస్క్‌ఫోర్స్‌కు ఓఎస్డీలు

జిల్లాల ఎస్పీలుగా అనుభవం లేని నాన్‌కేడర్ ఎస్పీలు

తాము చెప్పింది విని.. చెయ్యమన్నది చేస్తారనే..

ట్యాపింగ్, వసూళ్లతో అప్పటి పోస్టింగ్స్‌పై మళ్లీ చర్చ

ప్రస్తుత కాంగ్రెస్ సర్కారులో మారిన పోలీసింగ్ తీరు

కీలకమైనచోట డైరెక్ట్ రిక్రూటీలకే పెద్దపీట



హైదరాబాద్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఒకటి, రెండు కాదు.. అక్కడ, ఇక్కడ అనే తేడా లేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పోలీస్ శాఖలో తమకు కావాల్సినవారు, మాట వింటారనుకునే వారికి కీలక పోస్టింగ్‌లు ఇచ్చేశారు. చెప్పింది విని, చేయమన్నది చేస్తే చాలు.. మంచి పోస్టింగ్ దక్కినట్టే అనే పరిస్థితి కల్పించారు. సాధారణంగా ఒక అధికారికి బాధ్యతలు అప్పగించే సమయంలో ఎన్నో అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. ట్రాక్ రికార్డు, పని తీరు, ప్రతిభ, అర్హతలను బేరీజు వేసి అర్హులకు పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇవేవీ పట్టించుకోకుండా, నిబంధనలతోనూ సంబంధం లేకుండా ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేల వరకు ఎవరికి నచ్చినవారిని వారికి కావాల్సిన సీట్లో కూర్చోబెట్టుకున్నారు. అత్యంత కీలక విభాగాలనూ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ)ల చేతుల్లో పెట్టారు. డీఎస్పీలు మొదలు జిల్లా ఎస్పీలు, కమిషనర్ల వరకు ఇదే తతంగం సాగింది. సాధారణంగా పోలీసింగ్‌లో నేరుగా నియమితులైన (డైరెక్ట్ రిక్రూటీ) ఐపీఎస్‌లకు పెద్దపీట ఉంటుంది. నిబంధనల ప్రకారం వీరికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. ఎక్కడైనా ఇదే జరుగుతుంది. కానీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్న సమయంలో రాష్ట్రంలో మాత్రం కనీస గుర్తింపు

మిగతా 10వ పేజీలో...

ఇదేందయ్యా.. ఇది?

ఉద్యోగులకు రూ.2, 3 లక్షల సప్లిమెంటరీ బిల్లులకు దిక్కులేదు

ఇద్దరు ఉన్నతాధికార్లకు మాత్రం అడ్డగోలుగా జీతమిచ్చేశారు!

రెండేళ్లకు రూ. 1.25 కోట్లు హడావుడిగా విడుదల చేసేశారు

ఇదంతా ఆర్థిక శాఖ గారడీ అంటున్న ఉద్యోగ నేతలు

పాత ప్రభుత్వ పెద్దల అనుమతితో చెల్లింపులు!!

10



తెలంగాణలో బీజేపీ నంబర్ 1.. లేదా 2

- ఆంధ్రప్రదేశ్‌లో జగన్ మళ్లీ గెలవడం కష్టమే
- ఈసారి బీజేపీకి 300కు పైగా సీట్లొస్తాయి
- కానీ 370 సీట్ల లక్ష్యం సాధించలేకపోవచ్చు
- విపక్షాలు పోరాడాల్సింది ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బిహార్ వంటి హిందీ రాష్ట్రాల్లో!
- కాంగ్రెస్ పర్యటనలేమో మేఘాలయ, మణిపూర్‌లో.. ఇలా అయితే ఎలా గెలుస్తారు?
- అనుకున్న ఫలితాలను సాధించలేకపోతే రాహుల్‌గాంధీ తప్పుకోవాల్సిందే
- పీటీఐ ఇంటర్వ్యూలో ప్రశాంత్ కిశోర్

12

బీజేపీ గెలుపును ఎవరూ అడ్డుకోలేరు



వెంగళరావునగర్‌లో జరిగిన క్షత్రియుల ఆత్మీయ సమ్మేళనంలో కిషన్‌రెడ్డి

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదు

దేశాభివృద్ధి, భద్రత, ధర్మ పరిరక్షణ కోసం మరోసారి మోదీని గెలిపించాలి: కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర/రాంనగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయాన్ని ఏ శక్తులూ అడ్డుకోలేవని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు ప్రజల నుంచి గుణపాఠం తప్పదని స్పష్టం చేశారు. అన్ని వర్గాల వారు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ఆదివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ కమిటీ సమావేశంలో కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని డీడీ కాలనీలో జరిగిన పలు కాలనీ సంఘాల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. దేశాభివృద్ధి, భద్రత, ధర్మ పరిరక్షణ కోసం మరోసారి మోదీని గెలిపించాలని ప్రజలను కోరారు. మోదీ పాలనలో భారతదేశం ప్రపంచంలోనే 5వ ఆర్థిక శక్తిగా ఎదిగిందన్నారు. 2040 నాటికి మూడో స్థానమే లక్ష్యంగా

మిగతా 12వ పేజీలో...



బిహార్‌లోని నవడాలో ఆదివారం జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోదీ కాళ్లు పట్టుకుంటున్న బిహార్ సీఎం నితీశ్‌కుమార్

9

శభాష్..

సమర్థంగా జవాబిచ్చారు!

హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలతకు మోదీ ప్రశంసలు

లక్షన్నర ఓట్ల తేడాతో ఒవైసీ ఓడిపోవడం ఖాయం

బోగస్ ఓట్లే మజ్లిస్ అధ్యక్షుడి విజయ రహస్యం

12

నాకు టికెట్ కేటాయింపే బీజేపీలో పారదర్శకతకు నిదర్శనం

'ఆప్ కీ అదాలత్'లో ఆమె చేసిన వ్యాఖ్యలివి



బీజేపీ ఆఫీసులో ఇచ్చిన ఇఫ్తార్ విందులో ముస్లిం మహిళకు పండు తినిపిస్తున్న మాధవీలత

తెలంగాణ టు కడప

- వైసీపీ నేతల అండతో భారీగా మద్యం రవాణా!
- పంచలింగాల చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న సెబ్ సిబ్బంది
- రూ.14.51 లక్షల సరుకు సీజ్.. ఇద్దరి అరెస్టు
- తప్పించుకున్న సరఫరాదారు రింగుల బాషా
- అతనిపై ఇప్పటికే 104 ఎర్ర చందనం, మద్యం కేసులు

11

ఎన్‌ఐఏ అధికారులపై

లైంగిక వేధింపుల కేసు

నమోదు చేసిన పశ్చిమ బెంగాల్ పోలీసులు

9

అరెస్టయిన నిందితుల కుటుంబసభ్యుల ఫిర్యాదే ఆధారం

భూపతినగర్‌లో రాళ్ల దాడి తర్వాతి పరిణామం

బీజేపీ, టీఎంసీ మాటల యుద్ధం.. నివేదిక కోరిన రాష్ట్ర సీఈవో

రేపు కొంచెం కూల్..!

36-39 డిగ్రీల్లోపే ఉష్ణోగ్రతలు

నేడు అక్కడక్కడ తేలికపాటి వర్షాలు

నిడమనూరు, శాంతినగర్‌లో 44.5

తుంగతుర్తిలో వడదెబ్బతో మహిళ మృతి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో మంగళవారం వాతావరణం కాస్త చల్లబడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆ రోజు పగటి ఉష్ణోగ్రతలు 3 నుంచి 4 డిగ్రీల తగ్గుతాయని, అన్ని జిల్లాల్లోనూ గరిష్ఠ ఉష్ణోగ్రతలు 36 నుంచి 39 డిగ్రీలకు

మిగతా 10వ పేజీలో...

వివిధ

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

రాయసకారులూ బహుపరాక్!

'ఏ ఫేర్ వెల్ టు ఆమ్స్' నవలని ఏకంగా 50సార్లు తిరగ రాసి, కనీసం 47 ముగింపులు మార్చి మార్చి రాసిన ఆ పెద్దాయన్ని చూసి బిత్తరపోయి, 'ది ప్యారిస్ రివ్యూ', "అయ్యా దేనికిదంతా?" అనడగ్గా, "సరైన పదాల దొరక్క!" అన్నాడా పెద్దమనిషి తాపీగా. టాల్‌స్టాయ్ 'వార్ అండ్ పీస్' ఎంత బృహన్నవలో తెలియనివాళ్ళు అరుదే! ఆ మహా పురుషుడు కూడా దాన్ని అనేకసార్లు తిరగ రాశాడు! వంటి చేత్తోనే ఈ పనులు చేసేరు వీళ్ళు! అసలు - ఏ ఫస్ట్ డ్రాఫ్ట్ అయినా ఒక చెత్తే పో - అంటాడు, హెమింగ్వే! మంచి రాయసగాడు కావాలంటే ముందు నువ్వు 'చిన్న వాక్యాలు రాయడం నేర్చుకో' అని హితబోధ చేస్తాడు.

బ్రెవిటీ ఏవిటీ?

ఫ్రీడ్రిక్ నీచే, "నా యాంబిషన్ ఏమిటంటే వేరేవాళ్ళు పుస్తకం మొత్తంలో చెప్పిందాన్ని పదే పది వాక్యాల్లో చెప్పటమే." బ్రెవిటీ గురించి ఇంత గొప్పగా ఇంకెవరూ చెప్పి ఉండకపోవచ్చు. అసలు షేక్స్పియర్‌ను మించినోడు ఎవడూ ఉండే అవకాశమే లేదు అతి స్వల్ప మాటల్లో చెప్పడంలో! "బ్రెవిటీ ఈజ్ ది సోల్ ఆఫ్" విట్ అని ఊరికే అన్నాడా ఆ మహానుభావుడు? ఫ్రాన్సిస్ బేకన్ వ్యాసాలు బ్రెవిటీకి పట్టుగొమ్మలు. రోదసీ యాత్రికుడి క్యాప్సూల్ మీల్‌లా, వేల క్యాలరీల స్టఫ్ అంతా రెండో మూడో పదాల్లో ఇమిడ్చేస్తాడు. చూడండి ఈ కాప్స్యూల్: "Reading maketh a full man; conference a ready man; and writing an exact man."

రాతలో 'మోత' పదాల గురించి!

మోత మోగే యే పదం మీదో మోజు పడి, వెతుక్కుని మరీ బజాయించాలనుకునే వాళ్లకు భలే కముకు దెబ్బలు కొట్టారు!

జేమ్స్ జె. కిల్పాట్రిక్ అనే ఓ పెద్దాయన, - అయ్యా బాబులూ! "చదువుకునే వాడు వెతుక్కోవాల్సి వచ్చే పదాల్ని కాదు వాడాల్సింది, అర్థం చేసుకోగలిగే పరిచిత పదాల్ని వాడండి... అద్భుతమైన అన్యపదమేదో మిమ్మల్ని నిలవనీకుండా గంతులేయిస్తుంటే అది సద్దుమణిగి వెళ్లిపోయేదాకా స్థిమితంగా కాసేపు పడుకోండి" అని సెలవిస్తాడు.



"మీలోని అహంభావపు రచయిత హృదయాన్ని అవి ముక్కలు చేస్తున్నా సరే, ఆ ప్రియాతి ప్రియమైనవాటిని చంపేసేయండి. ఆ ప్రియమైన వాటిని చంపేసేయండి!" అని స్టీఫెన్ కింగ్ ఎంత గౌరవంగా చెప్పేడో కదా!

రాతలో సరళత్వమే సహజత్వం

జీవన గాంభీర్యం అంతా సరళత్వంలోనే ఉందనీ, ...రాత నుంచి పెయింటింగ్ వరకూ సరళత్వమే అసలు రహస్యం అంటాడు బుకోవ్‌స్కీ. అమెరికన్ల రాత గురించి వాపోతూ విలియం జిన్సర్ అనే పెద్దాయన, "మన అమెరికా రాతకు పట్టిన దరిద్రం డొంక తిరుగుళ్ళు, అనవసరపు పదాల్లో చిక్కుకుపోవడం, తిప్పి తిప్పి చెప్పటం, ఆడంబరపు అలంకారాలూ, అసందర్భపు భాషా" అని చిరాకు పడతాడు. "ఏ మూర్ఖుడైనా విషయాల్ని పెద్దగా చేయగలడు, బాగా గొట్టుగా చేయగల్డు, ఇంకా బీభత్సం చేయగల్డు. సరిగ్గా దానికి వ్యతిరేకంగా వెళ్లాలంటే మాత్రం దమ్ము కావాలి, కొంచెం తెలివితేటలు వాడాలి," అంటాడు ఐన్‌స్టీన్! సకల కళా వల్లభుడు లియొనార్డో డా వించీ "Simplicity is the ultimate sophistication!" అనేశాడు. హిపోక్రేట్స్ కూడా- భాషకుండాల్సిన గొప్ప గుణం స్పష్టతేననీ, అపరిచిత పదాల వాడకం కంటే దాన్ని దారి తప్పించేవి ఇంకేవీ లేవంటాడు.

శైలీ, గ్రటా

శైలీ గ్రటా అంటూ కంగారుపడే వాళ్లకు చురక అంటిస్తూ, ఆర్నోల్డ్ "ఏదో ఒకటి చెప్పటానికి ఉండి, దాన్ని ఎంత స్పష్టంగా వీలైతే అంత స్పష్టంగా చెప్పటమే శైలి తాలూకూ రహస్యం" అంటాడు.

> "గురి వైపు ఒక రాయికి బదులు పిడికెడు రాళ్లు విసిరే వాడికంటే, అర్థం కోసం కుప్పల పదాలు కుమ్మరించేవాడు ఏ రకంగానూ మెరుగ్గాడు" అంటాడు శామ్యూల్ జాన్సన్.

డార్విన్ బల్లగుద్ది మరీ చెప్పాడు. "శైలీ గిలీ అంటూ పట్టించుకోను. నా బుర్రకు స్పష్టంగా ఏది తడితే అది, నాకొచ్చిన సరళమైన భాషలో రాసుకుపోతా!"

ఎకానమీ ఆఫ్ వర్డ్స్ లేకపోవడం హీనమేనా?

రాసుడు వ్యాపారంలో మహా ముఖ్యమైన పాఠం ఏంటంటే "రాసిందాంట్లో కొవ్వు తగ్గించుకుంటూ వెళ్లడమే అంటాడు" రాబర్ట్ హిన్లిన్ అనే గొప్ప రాయసగాడు.

థామస్‌మన్ అనే ఇంకో ఆయన, "మూర్ఖత్వాలు చాలా రకాలు, అన్నిటికంటే చండాలం అతి తెలివి! అఫ్‌కోర్స్ రాతలో.", అని చీవాట్లు పెడతాడు.

"చెత్త బుట్టలో చాలా మంచి మంచి రాతలు పడుతున్నాయంటే నువ్వు చాలా బాగా రాస్తున్నట్టేపో" అని భుజం తడతాడు ఎర్నెస్ట్ హెమింగ్వే.

"గురి వైపు ఒక రాయికి బదులు పిడికెడు రాళ్లు విసిరే వాడికంటే, అర్థం కోసం కుప్పల పదాలు కుమ్మరించేవాడు ఏ రకంగానూ మెరుగ్గాడు" అంటాడు శామ్యూల్ జాన్సన్. "రాసింది పదే పదే చదవండి. ఏదైనా ఒక చోట, 'మహ బాగా రాశా సుమా!' అనిపించగానే దాన్ని కొట్టి పారేయండి!" అని కూడా సెలవిచ్చాడు ఈయనే!

"నేను పెన్సిల్ మీద కంటే కత్తెర మీదే ఎక్కువ నమ్మకం పెట్టుకుంటా" అని మహా తెలివిగా చెప్పాడు ట్రూమన్ కెపోటే అనే ఇంకో గడుసు పిండం. ఉంచాల్సిన దాని కంటే తీసేయాల్సిందే ఎక్కువ ఉంటుందని చెప్పడం కోసం.

"అన్నిటికన్నా మహా విలువైన టాలెంటు ఏదైనా ఉందీ అంటే ఒక పదం అవసరమైన చోట రెండు పదాలు వాడకుండా ఉండటమే," అంటాడు థామస్ జఫర్సన్. ఆలోచించుకుందాం రండి మరి!

వి. విజయకుమార్
85558 02596

ఒక



ఒక లేతవేసవి వాకిట నిలబడి
అలసటను గాలితీగపై ఆరబెట్టుకుంటే
చిగురుమేఘమొకటి
చినుకుచుక్కై బుగ్గను పుణుకుతుంది

ఒక వెలుగుదీపపు నీడలో చతికిలబడి
చీకటిగుప్పెట విప్పుకుంటే
నిండైన నక్షత్రమొకటి
కాంతిపుంజమై
నెమ్మదిగా కౌగిలించుకుంటుంది

ఒక గలగలల
సెలయేటి పాదాల వద్ద ముడుచుకుని
గుండెదేహాన్ని తడుముకుంటే
మృదువైన అలలచెలొకటి
పిల్లతెమ్మెరై
మనసును గాలిపటంలా ఎగరేస్తుంది

ఒక మెత్తని మెలకువశయ్య
ఒడిలో కూలబడి
కునుకుపిట్టను నిమురుకుంటే
రంగురంగుల కలలస్వర్గమొకటి
కమ్మగా నిదురజోల పాడుతుంది

ఒక సొగసైన పూలమొక్క
కొమ్మలచేతులలో తలపెట్టి
దిగులుమబ్బును మోస్తుంటే
అందమైన పరిమళమొకటి
ఆత్మీయతై గదినంతా తేలికపరుస్తుంది

ఒక శిఖరమంటి ప్రాణనేస్తపు
కనుల ద్వారబంధానికి
నిత్యతోరణమై వేళ్ళాడితే
సమస్తదుఃఖాలనూ చెరిపేసే
నీలిఆకాశమొకటి
బ్రతుకుముడులను విప్పుతూ
సారాంశాన్ని బోధిస్తుంది
జీవితాన్ని పాదాక్రాంతం చేసి
అర్థవంతంగా మలుస్తుంది

పద్మావతి రాంభక్త
99663 07777

సేవ - అక్షర తోరణం సమాపనోత్సవాలు

2023 మార్చి 22 ఉగాది నుండి 'సేవ' ఆధ్వర్యంలో 'అక్షర తోరణం' కార్యక్రమం ఇంటర్నెట్ వేదికగా 365రోజులపాటు జరిగింది. ఇప్పుడు వరల్డ్ రికార్డ్‌తో ఏప్రిల్ 9 ఉ.9గంటల నుండి ఏప్రిల్ 11 రా.11 గంటల వరకు 3 రోజులు 60 గంటలపాటు నిర్విరామంగా జూమ్ వేదికగా అక్షర తోరణం సమాపనోత్సవాలు ఇంటర్నెట్‌లో నిర్వహిస్తున్నాం. కె. శ్రీనివాస్, పి.ఎస్. రామమోహన్ రావు, కొలకలూరి ఇనాక్, కె. శివారెడ్డి, పి. విజయబాబు, మేడసాని మోహన్, నందిని సిధారెడ్డి... ఇంకా 180 మంది ప్రముఖ సాహితీ వేత్తలు, ప్రవాసీయులు పాల్గొంటారు. వివరాలకు: 94926 66660.

కంచర్ల సుబ్బానాయుడు

'తెలుగు సాహిత్యం - కొత్త కోణాలు'

తానా ప్రచురించిన వెల్చేరు నారాయణ రావు రెండు వ్యాస సంపుటాలు 'తెలుగు సాహిత్యం - కొత్త కోణాలు', 'సంస్కృతి, భాష, చరిత్ర'ల ఆవిష్కరణ సభ ఏప్రిల్ 14 సా.6గంటలకు బాలోత్సవ్ భవన్, రాఘవయ్య పార్క్ దగ్గర, విజయవాడలో జరుగుతుంది. సభలో వెల్చేరు నారాయణరావు, మండలి బుద్ధప్రసాద్, బి. తిరుపతిరావు, చినుకు రాజగోపాల్, కె. రామచంద్రారెడ్డి పాల్గొంటారు.

వాసిరెడ్డి నవీన్

చౌడప్ప శతకంలో చేరని కొత్త పద్యాలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 'ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు' వారు 1982లో 'అధిక్షేప శతకములు' గ్రంథాన్ని ప్రచురించారు. 'అధిక్షేపం' అంతస్సూత్రంగా కలిగి, పూర్వకవులు రచించిన ఆరు శతకముల సంకలనమీ గ్రంథం. అందులో ఒకటి కవి చౌడప్ప రచించిన 'కవి చౌడప్ప శతకము'. క్రీ.శ. 17వ శతాబ్దికి చెందినవాడైన కవి చౌడప్ప తెలుగు శతక కర్తలలో బహుళ ప్రసిద్ధిని పొందినవాడు. ఈ శతకానికి రాసిన పీఠికలో కవి చౌడప్ప శతకము లోనివిగా దాదాపుగా రెండు వందల పద్యాలు లభ్యమౌతున్నాయని, వాటిల్లోంచి పండితులు పరిష్కరించిన నూట వొక్క పద్యాలు అందులో ప్రచురింపబడుతున్నాయని పేర్కొన్నారు. నాకు తెలిసి, 'కవి చౌడప్ప శతకము'గా ప్రచురించబడిన శతకం అధికారికంగా ఇది ఒక్కటే!

చెన్నైలోని 'గవర్నమెంట్ ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీ' తెలుగు విభాగం రికార్డు సంఖ్య 'ఆర్ 01722' తాళపత్ర వ్రాతప్రతిలో 79 పద్యాలతో కూడిన 'కవి చౌడప్ప శతకం' రాత ప్రతి ఒకటి ఉంది. ఏ కాలపుదో, ఎవరిదో తెలియని ఈ రాతప్రతిలో పైన చెప్పిన 'కవి చౌడప్ప శతకము'లో చేరని పద్యాలు కొన్ని ఉన్నాయి. పేరు తెలియని ఈ లేఖకుని దస్తూరీ అంత కుదురైనదిగా లేదు. దానికితోడు తాళపత్రంలో అక్కడక్కడా పడిన మరకల వలన కూడా మాటలలో కొన్ని చోట్ల స్పష్టత కరువైంది. ఇప్పటివరకూ అప్రకటితాలై ఈ తాళపత్ర ప్రతిలో మగ్గుతున్న కవి చౌడప్ప పద్యాలలో భావ స్పష్టత ఉన్న పద్యాలను కొన్నిటిని విడిగా తీసి పరిష్కరించి, స్వల్పమైన వ్యాఖ్యను పద్యం క్రింద చేర్చి ఇక్కడ పొందుపరుస్తున్నాను. ప్రతి పద్యానికి పక్కనున్న సంఖ్య తాళపత్ర వ్రాతప్రతిలోనిది:

కం. రూకేరా సకలానికి
మూకేరా దొరలకెల్ల ముఖ్యము ధరలో
కాకేరా బంగారుకు
కాకోదర కుందవరము కవి చౌడప్పా! (5)

లోకంలో ఏ పని సాధించాలన్నా డబ్బుండాలి. ఆ రోజుల్లో ప్రభువుకు సైన్యం బలమైనదిగా ఉండడం ఎంత ముఖ్యమో ఈ రోజులలో ప్రతి దేశానికి సైనికబలం అంతే ముఖ్యం గనుక ఈ పద్యంలోని చౌడప్ప మాటలు సర్వకాలీనమైనవిగా చెప్పుకోవచ్చు. బంగారానికి ఎంత సెగ తగిలితే అంత వన్నె తేలుతుందన్నది అందరూ ఎరిగిన నిజం.

ఈ తాళపత్ర రాతప్రతిలో లేఖకుడు 'కుందవరము' అనే చాలా పద్యాల్లో వ్రాసుకున్నాడు. 'కుందపురము' అని ఒకటి రెండు పద్యాల్లో కనపడుతుంది. పైన చెప్పబడిన 'అధిక్షేప శతకములు' సంకలనంలోని 'కవి చౌడప్ప పద్యాలలో పేర్కొనబడినట్టుగా 'కుందవరపు' అని ఒక్క పద్యంలో కూడా లేదు.

కం. పేదలకు నెవ్వ డైనను
యీదలచిన వాని చేత యిప్పించ వలెన్
పేదల కీరాదన మే
ల్గాదప్పా కుందవరము కవి చౌడప్పా! (9)

కవి చౌడప్ప శతకంలోని పద్యాలంటే బూతుమాటలమయం అనే అభిప్రాయం జనసామాన్యంలో ప్రసిద్ధమై ఉందన్నది విదితమే! అశ్లీల పదజాలంతో కూడిన పద్యాలను మిగతా శతక కవులెవరూ చెప్పనంత పచ్చిగా కవి చౌడప్ప చెప్పాడనడం కాదనలేని నిజం అయినప్పటికీ, పేదరికం గురించిన పద్యాలను అత్యంత గౌరవ ప్రదమైన మాటలతో చెప్పాడనడం కూడా అంతే నిజం. అందుకు ఒక ఉదాహరణగా నిలిచేదే పై పద్యం!

కం. వాకిట నొకపర దేశియు
ఆకలి గొనియున్నవాని కన్నం బిడకే
తాకుడుచుట దాకుడుచుట
కాకోదర కుందవరము కవి చౌడప్పా! (10)

అభ్యాగతుడు గుమ్మం దగ్గర నిలబడి ఎదురుచూస్తుండగా, గృహస్థుడు ఇంట్లో నింపాదిగా భోజనం చేయడం చాలా తప్పని, అది 'దాకుడుచుట' అనగా 'ఎడమ చేతితో తినడం'తో సమానమైనదని పై పద్యంలో సారాంశం.

కం. నడవడి గలనాడే సా
పడ వలయును పదియునైదు పాశంబులుచా
రెడు నెయి రాజన్నము మీ
గడ పెరుగుతొ కుందవరము కవి చౌడప్పా! (18)

శరీరంలో శక్తి, ఖర్చుపెట్టగల తాహతు, తిన్న తిండిని అరిగించుకోవ డానికి సరిపోయేంత పని సమంగా ఉండడం అన్నదే 'నడవడి' కలిగి ఉండడం అంటే! ఆ స్థితి పుష్కలంగా సాగుతున్న రోజులలో భోజనంలో పదీపదిహేనుకు తక్కువ కాకుండా పాయసాలు అనగా రుచికరమైన పదార్థాలు, చారెడు నెయ్యి, తెల్లని రాజనాల బియ్యపు అన్నము, మీగడ పెరుగుతో సంతృప్తిగా భోజనం చేయాలి అని భావం.

కం. తన విద్య దొరల వద్దను
వినిపించినవాడు లోకవిఖ్యాతుండౌ
వినిపించక తన చాతురి
కనుపించదు కుందవరము కవి చౌడప్పా! (28)

ప్రదర్శించనిదే వ్యక్తిలో దాగివున్న ప్రతిభ బహిర్గతం కాదు, నలుగురికీ తెలియదు. ఎప్పుడో ఒకప్పుడు గుర్తించబడకపోతామా అని ఏ ప్రయత్నం చేయకుండా కూర్చోవడం సరైన పని కాదు. తనలో దాగివున్న విలక్షణమైన విద్యను, అర్థంచేసుకుని ఆదరించే అధికారి ముందు పెట్టడం వలన ఉపయోగమే కాని అపకారం జరగదు అని భావం.

కం. ముండా కొడుకుల సంపద
దండుగలకు గాక దాన ధర్మము గలదా
దండించువాని కిత్తురు
ఖండితముగ కుందవరము కవి చౌడప్పా! (38)

భయపెట్టి, దౌర్జన్యం చేసి లాగేసుకునే వాళ్ళకు చేసేది లేక డబ్బును పోగొట్టుకుంటారుగాని, తమంతతాముగా ధర్మకార్యాలకు ఖర్చుపెట్టడానికి, దానంగా ఇవ్వడానికి మాత్రం మనస్కరించని వ్యక్తుల చిత్తవృత్తిని అధిక్షేపిస్తూ చెప్పిన పద్యం ఇది. చౌడప్ప పద విన్యాసం స్పష్టంగా కనిపిస్తుంది ఈ పద్యంలో!

కం. శాంతమున తనదు కార్యము
ఎంత అసాధ్యమయినను జయింపగ వచ్చున్
కుంతి సుతుండు జయించడె
కాంతాశ్రమలకును వోర్చి కవి చౌడప్పా! (74)

శాంతగుణాన్నే ప్రధానంగా ఆశ్రయించినవారికి ఎప్పటికైనా విజయం సిద్ధిస్తుంది అని తానే కాకుండా తన తమ్ములు, వెంట ఉన్న స్త్రీజనం ఎన్నో కష్టాలు పడుతున్నప్పటికీ చివరి వరకూ శాంత స్వభావాన్ని వీడక మహాభారత సంగ్రామంలో విజయం సాధించిన ధర్మరాజును ఉదాహరణగా చూపి చెప్పిన పద్యం పైది.

ఆం.సా. అకాడమీ వారు 'అధిక్షేప శతకములు' గ్రంథంలో ప్రచురించిన 'కవి చౌడప్ప శతకము'లో లేకుండా పైన చెప్పిన తాళపత్ర రాతప్రతిలో కనపడిన పద్యములలో నా పరిష్కరణకు లొంగిన అర్థవంతమైన పద్యములు ప్రస్తుతానికి ఇవి మాత్రమే! ఛందస్సు పరంగా కందపద్యానికి సరిపోతూ, పరిష్కరణకు లొంగుతున్నా అర్థం సరిగా కుదరనివి, ఈ తర్వాత ఉదాహరించినటువంటి పద్యాలు మరి కొన్ని ఉన్నాయి.

కం. నేరుతునని మాటాడగ
వారిజభవుడైన వాని వశమా తంజా
వూరి రఘునాథనాయలు
గారప్పా కుంద్దపురము కవిచౌడప్పా! (75)

అర్థం బోధపడుతున్నప్పటికీ కందపద్యం ఛందస్సుకు సరిపోని పద్యాలు, ఈ క్రింద ఉదాహరించినట్టివి మరికొన్ని ఉన్నాయి.

వేడుక తోవిన వలెనా
రూఢిక విత్వము నలుగురి లోనన్
ఊడిగ ము శేయు వాడే
గాడిద యయ్యెను గదప్ప కవి చౌడప్పా!

అర్థమూ కుదరక, ఛందస్సుకు అన్ని విధాలా సరిపోతున్నా, పరిష్కరణానికి లొంగకుండా ఉన్న పద్యాలు కొన్ని క్రింద ఇస్తున్నాను.

కం. దొరకైనను పేదకైనను
వెరపకు నిల్లాలికైన వేశ్యకునైనన్
గెరగెరి బాగౌ నుమ్మీ
కరుణాకర కుందవరము కవి చౌడప్పా! (60)

కం. హృదయము పదిలంబైతే
గదికొను సంన్యాసికైన కొంమ్ములు గలవా
యిది యెరుగని చదువయ్యలు
గదవప్పా కుందవరము కవి చౌడప్పా! (62)



ఇవన్నీ పరిశీలించి, పరిష్కరిస్తే ఇప్పుడు లభ్యమయ్యే కవి చౌడప్ప పద్యాలకు కనీసం ఇరవై పద్యాలైనా అదనంగా చేరే అవకాశం ఉంది.

భట్టు వెంకటరావు

గుడ్డి కొంగలు



నువ్వు ఊరికి పోయి
24 గంటలే గడుస్తోంది
నాకు మాత్రం 24 వేల
వత్సరాల కాలంగా తోస్తుంది

ఇంట్లో వుంటే మన్మరాండ్ల
సెలయేరు గల గల
బడికి పోతే వరద తీసిన
యేరులా వెలవెల

పొద్దున నిద్ర లేచి
టీచర్ కోప్పడ్డప్పటిలా మొఖం పెట్టి
అమ్మమ్మ ఎప్పుడొస్తుంది అడుగుతారు

సాయంత్రం వచ్చి వాకిట్లో
నీ చెప్పులు లేక అమ్మమ్మ
ఇంకా రాలేదని నిరాశతో
చిన్నబుచ్చుకుంటారు

పైకి వాళ్లు మాట్లాడుతున్నారు
నేను లోన నీ గురించే సంభాషిస్తున్నాను

పూట పూటకు మాత్రలు?
అని ఎవరు పలకరిస్తారు
బీడుగా మారిన నేల గర్భంలో
తవుటం పెట్టి విత్తనం నాటి
నీళ్లెవరు చిలుకరిస్తారు

ఇక తోవ నడువ
పాదాల తప్పు అడుగుల
చెయ్యి పట్టుకుని
చిన్నపిల్లాడిలా ఎవరు నడిపిస్తారు

జ్ఞాపకాలు కోల్పోయిన
మెదడు కరప్టు అయ్యి
పేరు సెల్ నంబర్ చిరునామా
మెడలో గుర్తింపు కార్డు వేలాడుతూ
తప్పిపోయిన ఆల్జీమర్స్
అతన్ని వెతికి నెవ్వారు
ఇంటికి తీసుకు వస్తారు

పొద్దుపోక చుట్టుపక్కల
ఇంటి తలుపు తడితే
అలల అలికిడి లేని
సముద్ర తీరంగా వుంది

కంగున మోగే రింగు సౌకర్యం
ఉంటే ఎంత బాగుండేది
ముక్కు మీద మక్కువగా వేలాడుతున్న
కండ్ల అద్దాలను దొరుకపట్టి ఎవరు ఇస్తారు

నువ్వు లేకుంటే ఊపిరి ఆడక బతుకు
బిక్క మొక వేసి కుమిలి ఏడ్సుంది
జీవిత ప్రయాణం ట్రాఫిక్ జామ్ లో
చిక్కుకుపోయి గిల గిల్లాడుతుంది

ఎక్కడి వారు అక్కడికి
ఎల్లలు దాటి ఎగిరి పోయాక
ఏ ఇంటిలోనైనా కనిపించే
ఒకే ఒక్క నిశ్చల సచిత్రం
గుడుగుక్కిన జంట గుడ్డికొంగలు
నొసట బస్వాన్ని ధరించిన జంగాలు

జూకంటి జగన్నాథం

శివేగారి దేవమ్మ కథా పురస్కారాలు

ఐదవ శివేగారి దేవమ్మ కథా పురస్కారాలు కోసం 2022, 2023 సంవత్సరాల్లో ప్రచురితమైన కథా సంపుటాలను, బాలల కథా సంపుటాలను ఆహ్వానిస్తున్నాం. ఉత్తమ కథా సంపుటానికి రూ.7వేల నగదు, బాలల కథా సంపుటానికి రూ.3వేల నగదు పురస్కార ప్రదానం జరుగును. మీ సంపుటాలు మూడేసి ప్రతులు ఏప్రిల్ 20 లోపు చిరునామా: కె.వి. మేఘనాథ్ రెడ్డి, ఇం.నెం. 11/21/01, ఎన్జీఓస్ కాలనీ, పుత్తూర్ - 517583, తిరుపతి, ఫోన్: 63003 18230కు పంపాలి.

కె.వి. మేఘనాథ్ రెడ్డి

వి. చంద్రశేఖరరావు జయంతి సభ

వి. చంద్రశేఖర రావు జయంతి సభ ఏప్రిల్ 13 సాయంత్రం 6 గంటలకు గుంటూరు 2/7 బ్రాడీపేట, కొరటాల భవన్‌లో జరుగుతుంది. 'కేరాఫ్ బావర్చీ' కథాసంపుటి రచయిత చరణ్ పరిమి వి. చంద్రశేఖరరావు పురస్కారాన్ని అందుకోబోతున్నారు. సభలో పెనుగొండ లక్ష్మీనారాయణ, పాపినేని శివశంకర్, వాసిరెడ్డి నవీన్, సీతారాం, ఎస్. స్పందన, కందిమళ్ళ శివప్రసాద్, వి. ప్రసూన, కాట్రగడ్డ దయానంద్ పాల్గొంటారు.

వి. ప్రసూన

వర్తన సమావేశం

వర్తన సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో 3వ సమావేశం ఏప్రిల్ 13 ఉ.10.30గంటలకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుది. 'వాక్యం - కవితా వాక్యం' అంశంపై ఏనుగు నరసింహా రెడ్డి ప్రసంగిస్తారు. అధ్యక్షత: చెన్నూరి సీతారాంబాబు.

ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్

తెలుగు సాహితీ వనం కవితా పురస్కారాలు

2024 సంవత్సరానికి ఈ పురస్కారాల కోసం చొక్కర తాతారావు, కె.జి. వేణు, మెట్టు శ్రీనివాస రెడ్డి, తిరువాయిపాటి రాజగోపాల్, కవితలు ఎంపికయ్యాయి. జూలైలో జరిగే తెలుగు సాహితీ వనం ఏడవ వార్షికోత్సవ సభలో పురస్కారాలు

తెలుగు సాహితీ వనం

"మానవ ఉద్వేగాల మాటున అంతఃసూత్రాన్ని ఒడిసిపట్టాలని..."

ధీరజ్ కశ్యప్ వేముగంటి | పలకరింపు

కవిత్వమూ, కథలూ కూడా రాసిన రచయితలు ఉన్నారు కానీ, రెండింటినీ కలిపి ఒకే ప్రచురణగా తెచ్చినవారు తెలుగులో అరుదు. మీ 'క్షణికాలు' పుస్తకంలో ఇలా నాలుగు విభాగాల కూర్పు గురించి చెప్పండి?



రాయడానికి అంటూ రచయిత పూనుకున్నాక అది ఖాళీ కాగితంపై కుట్ర పన్నుతున్నట్టే లెక్క. కానీ ఆ రాత వెనక ఉండే వైవిధ్యమైన మానవ ఉద్వేగాలకి, ఆలోచనలకి ఉండే స్వతంత్రతని, విశృంఖలత్వాన్ని ఒప్పుకుంటూ వాటన్నిటి మాటున కదులుతున్న అంతఃసూత్రం ఉండే ఉంటుందని, దాన్ని ఒడిసిపట్టాలనేదే ఈ పుస్తకం వెనక ఉన్న దృష్టి కావొచ్చు. దీని కోసం నేను చూపిన ప్రత్యేకమైన శ్రద్ధ ఏంటి అంటే వేచి చూడడం. ప్రశ్నల నుంచి శూన్యాల వరకు సాహిత్యం కాగల ప్రతీ అనుభవం కోసం ఎదురు చూడడమే నేను చేసింది.

నూటముప్పై పేజీల ఈ పుస్తకంలో నాలుగు భాగాలున్నాయి. వచనం వైపున రెండు భాగాలు: 1. కొన్ని కథలు 2. కాసిన్ని క్షణాలు. కవిత్వ రూపంలో రెండు భాగాలు: 1. కొన్ని తారలు 2. కాసింత శూన్యం.

కథ, కవిత్వం- ఈ రెండు ప్రక్రియల్లోనూ దేని వైపు మీకు మొగ్గు ఉంది? ఎందుకు?

రచన పరంగా నాలో నేను ఇంకా స్పష్టత సాధన చేస్తున్న రచయితననే చెప్పుకోవాలి. ఇక మనస్సుపై అనుభవాల స్పర్శ కదిలిన ప్రతి క్షణం కవిత్వంలానే తోస్తుంది నాకు. నాలో ఉండే ప్రశ్నల వేదనలకి భరించగలిగే రూపివ్వడంలో కవిత్వము; ఆ ప్రశ్నలని దాటి జీవితాన్ని జీవితంలా ఒప్పుకోవడంలో, ఆ క్షణాలని వాక్యాల్లోకి తర్జుమా చేసుకుంటున్న ప్రతీసారి నాకు వచనం ఊపిరందించగలదు అని ఈ మధ్య అనిపిస్తుంది.

సాహిత్య రచన వైపు మరలేందుకు మిమ్మల్ని ప్రభావితం చేసిన రచనలు లేదా రచయితల గురించి చెప్పండి.

సమూలంగా ఈ రచయితని చదివానని, వీళ్లంటే బాగా ఇష్టమని చెప్పలేను. విశ్వంభర దీర్ఘ కవితలో మొదటి నాలుగు మాటలు ఇప్పటికీ వెంటాడుతాయి. శేషేంద్రశర్మ కవిత్వం ఒంటరి సమయాల్లో ఆలంబనై నిలిచింది. పాలిష్ కవయిత్రి Wislawa Szymborska కవితలు కొన్ని నా రచనా ప్రయాణంలో ఒక విడుదలలాంటి స్వేచ్ఛనిచ్చాయి. ఎర్నెస్ట్ హెమ్మింగ్వే 'ఏ క్లీన్ వెల్ లైటెడ్ ప్లేస్' అనే కథలోని మానవ జీవితాల పార్శ్వాలు, అలా కదిలే కథలని వెతుక్కుంటాను. "జీవితాన్ని ఇంత స్వతంత్రంగా, ఇంత స్పష్టంగా చిత్రించొచ్చా" అనే ఆశ్చర్యం ఇచ్చే రచనలంటే ఇష్టం.

"పూర్తి స్పృహతో చేసే పనికి శోకభారం ఉండదు" అన్న రమణుల మాటల ప్రభావం అర్థమయేలా, మీ రచనల్లో దుఃఖభరిత సందర్భాలు ఉన్నా, అక్కడి వ్యక్తులు ఆ దుఃఖంలో లీనమవడం కనపడదు. వాస్తవం ఎలా ఉన్నా జ్ఞాపకాలే బాటసారి గొంతు తడిపేవి అన్న మీ మాటల వెనుక ఆలోచనలేమిటి?

మాటల వెనక ఉన్న భావం - acceptance. పూర్తి ఒప్పుకోలు. మెటాఫిజికల్ టోన్లో సాగే 'కాసింత శూన్యం' కవితలని కాస్త ఎత్తు నుంచి చూస్తే 'ఈర్ష్య', 'నొప్పి', 'మోహం' లాంటి పదాలు కనపడతాయి. అది ప్రయత్నంతో చేసిందని అనుకోను. దాని వెనక ఉద్దేశం- నాలో నేను వాటితో కుదుర్చుకోవాలనుకునే సంధి లాంటిదేమో. నేను నుంచి అనంతం వరకు పరుచుకున్న ఈ విశ్వానుభవమంతా నాతోనే ముడి వేయబడ్డదనే స్పృహ, అది మోపే బరువు, దాన్ని నాలోకి కలుపుకునే ప్రయాణంలోని మాటలేమో ఇవి.

ఎందుకు రాస్తున్నాను అనే ప్రశ్న కుతూహలంగా నైనా, కలవరంగా అయినా మిమ్మల్ని తాకిన సందర్భాలేవైనా ఉన్నాయా?

మానవ స్పృహ మోయక తప్పని శిలువ అని ఒక మాట రాసాను ఈ పుస్తకంలో. న్యూయార్క్ నగరంలోని వంతెనపై వర్షపు జల్లులో ఓ జంట నడుస్తున్న దృశ్యం నిండైన మోహన రాగమై వినిపించిందని కూడా రాసాను. ఒక వైపు మనల్ని శాసించే మానవావస్థలు (హ్యూమన్ కండిషన్), మరో వైపు అకస్మాత్తుగా దాడి చేసే అందమైన అనుభవాలు ఏకకాలంలో ఉండే జిందగీ తత్వాన్ని గమనించడంలోంచి ఈ పుస్తకం పుట్టిందేమో. అలా అని ఆనందాల్ని వెంబడిస్తూ, వాటి కోసమే వెంపర్లాడుతూ, గొప్ప క్షణాలని మాత్రమే కంటూ వెళ్లడంపై నాకు చాలా అనుమానాలున్నాయి. నాకే కాదు వేల ఏళ్లుగా మానవ జాతి తత్వ చింతన మూలాలన్నీ అక్కడివే అనిపిస్తుంది.



పుస్తకంలో ఎన్నో చోట్ల, ఎన్నో రకాలుగా హైదరాబాద్ నగరపు ఉనికి కనపడుతుంది. ఇది ఒట్టి వివరంలా వ్యక్తమైనది కాదని, మీ మొదటి పుట, 'To Hyderaabaad' చెబుతుంది. నగరం మీద ఎందుకంత ప్రేమ?

హైదరాబాద్ గురించి రాయాలని, ఈ నగరానికి నా పుస్తకంలో చోటివ్వాలని ప్రయత్నించకపోవడంలోనే నేను నోస్టాల్జియాని దాటానని అనుకుంటాను. ఈ పుస్తకంలో హైదరాబాద్ కొన్ని క్షణాలై వెలిగి బతుకుతుంది. ఎందుకంటే హైదరాబాద్ అంటే నాకు యవ్వనం. యవ్వనం అంటే నా లెక్కలో beautifully wasted glory (కాలాన్ని అందంగా తగలెట్టగలిగిన గొప్ప అదృష్టం.) వేల మైళ్ళ దూరాలు దాటినా హైదరాబాద్ నాలో ప్రవహించే నిజం. అందుకే అకస్మాత్తుగా, తన ఇష్టానుసారంగా కథల్లో, కవితల్లో మెరుస్తుంది తప్ప నాకంటూ స్థూలంగా అంత చోటివ్వమని అడగలేదు. అందుకే నేను దానికి మొదటి పేజీని తీసుకోమన్నానేమో.

ఇంటర్వ్యూ **మానస చామర్తి**

ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.7 కనిష్ఠం 27.7

సన్ డే స్ట్రోక్



స్విమ్మింగ్ పూల్‌లో సందడి

జలకాలాట



చిన్నారులకు చల్లదనం కోసం..



దాహం తీర్చుకుంటూ..

భానుడు ఉగ్రరూపం దాల్చుతుండడంతో నగరం వేడెక్కింది. ఉదయం 11 గంటలు దాటిందంటే ఇళ్ల నుంచి ప్రజలు బయటకు రావడం లేదు. దీంతో చాలా రహదారులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. కొందరు చల్లదనం కోసం స్విమ్మింగ్ పూల్‌కు పరుగులు పెడుతున్నారు. ఇంకొందరు ఇంట్లోనే నీటిలో గడిపేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వస్తే స్కార్ఫ్, వాటర్‌బాటిల్‌ను వెంట తీసుకెళ్తున్నారు.

రోడ్డు ఖాళీ



మధ్యాహ్నం వేళ ఖాళీగా దర్శనమిస్తున్న కొత్తపేట నుంచి ఎల్‌బీనగర్ వెళ్లే రహదారి

చల్లదనం కోసం బైక్ మీద నీళ్లు చల్లుతూ..



పూల పాన్పు

ఎండ వేడికి తట్టుకోలేక వెంగళరావునగర్‌లోని ఓ చెట్టు నీడన పూలపై పడుకున్న వృద్ధుడు

రత్నదీప్ సూపర్ మార్కెట్‌లో అగ్నిప్రమాదం

- భారీగా ఎగిసిపడిన మంటలు
- నగర శివారులో ఘటన

5

ఎంఐఎం ఉక్కిరిబిక్కిరి

- హైదరాబాద్ ఎంపీ స్థానం గెలుపు కోసం తీవ్ర కసరత్తు
- బీజేపీ నుంచి బలమైన అభ్యర్థి

మారిన రాజకీయ పరిస్థితులతో ఎంఐఎం ఈ సారి గడ్డుపరిస్థితులు ఎదుర్కొంటోంది. హైదరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీజేపీ బలమైన అభ్యర్థిని రంగంలోకి దించడంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. కాంగ్రెస్ కూడా మైనార్టీ వర్గానికి చెందిన వ్యక్తికి టికెట్ కేటాయిస్తే గెలుపు కష్టం కానుంది.


6

Shaan-e Ramazan
షాన్-ఎ రమజాన్

ఇఫ్తార్: 6:36 (సోమవారం సాయంత్రం)
సహర్: 4:42 (మంగళవారం ఉదయం)

ఒక్కొక్కటిగా.. హస్తగతం..!

పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా పావులు



- శివారు కార్పొరేషన్లు, మునిసిపాల్టీలను 'చే'జిక్కించుకుంటున్న కాంగ్రెస్
- అధికార పార్టీలోకి బోడుప్పల్, పీర్జాదిగూడ కార్పొరేటర్లు
- బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి చేరిన 17మంది
- బోడుప్పల్ మేయర్ హస్తగతమేనా..?
- అవిశ్వాసం పెడితే దక్కే అవకాశం
- పీర్జాదిగూడలో మారుతున్న పరిణామాలు



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఈశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ పద్మారెడ్డి

అధికార పార్టీ ఆపరేషన్ ఆకర్ష్‌కు ఆయా ప్రాంతాల్లో బీఆర్ఎస్ ఖాళీ అవుతోంది. మహానగరం చుట్టూ ఉన్న మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాల్టీలు ఒక్కొక్కటిగా హస్తగతమవుతున్నాయి. మొన్నటి వరకు శివారు కార్పొరేషన్లలో నామ్ కే వాస్తేగా ఉన్న కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల బలం క్రమేణా పెరుగుతోంది. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ నేతలు పావులు కదుపుతున్నారు.

హైదరాబాద్ సిటీ/ఉప్పల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే జవహర్‌నగర్, ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం, బండ్లగూడ జాగీర్, నిజాంపేట కార్పొరేషన్లు అధికార పార్టీ కైవసం కాగా.. తాజాగా బోడుప్పల్, పీర్జాదిగూడ కార్పొరేషన్లను 'చే'జిక్కించుకునే దిశగా అడుగులు పడుతున్నాయి. ఆదివారం రెండు కార్పొరేషన్ల పరిధిలోని బీఆర్ఎస్ కార్పొరేటర్లు పెద్ద ఎత్తున కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వారంతా పార్టీ వీడకుండా మాజీ మంత్రి మల్లారెడ్డి చివరి వరకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్ చేరికల్లో కీలకంగా వ్యవహరించారు. పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో డిప్యూటీ మేయర్‌తోపాటు 11 మంది కార్పొరేటర్లు, బోడుప్పల్ నుంచి ఐదుగురు కార్పొరేటర్లు హస్తం గూటికి చేరారు. సీఎం రేవంత్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో ఇక్కడ

మిగతా 6వ పేజీలో..

టార్గెట్.. కుత్బుల్లాపూర్..!

- గులాబీ కోటలో పాగా వేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి స్కెచ్
- ఆపరేషన్ ఆకర్ష్‌లో భాగంగా బీఆర్ఎస్ నేతలకు గాలం
- ఇప్పటికే నిజాంపేట్ మేయర్‌తోపాటు 9 మంది కార్పొరేటర్లు పార్టీలో చేరిక
- తాజాగా బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్‌కు హస్తం కండువా

6

మెట్రో.. రాయితీ నో!

- ఏప్రిల్ 1 నుంచి రూ.59 హాలీడే కార్డు రద్దు
- స్మార్ట్‌కార్డు, కాంటాక్ట్ లెస్ కార్డులపై 10 శాతం రాయితీ తొలగింపు
- సంస్థ తీరుపై ప్రయాణికుల అసహనం
- వేసవిలో అధిక ఆదాయం పొందేందుకేనని ఆగ్రహం

మెట్రో రైళ్లలో రాయితీలకు అధికారులు మంగళం పాడారు. నష్టాల ఊబి నుంచి బయటపడి నిర్విరామంగా రాకపోకలను అందిస్తున్న ఎల్అండ్‌టీ సంస్థ అదును చూసి దెబ్బకొట్టింది. మండుతున్న ఎండలు, పెరిగిన రద్దీ సమయంలో రాయితీలను ఎత్తివేయడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న ప్రయాణికులను ఆకట్టుకునేందుకు ఎల్అండ్‌టీ సంస్థ గతంలో వినూత్న ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. తొలుత స్మార్ట్‌కార్డును అమల్లోకి తెచ్చింది. ఇందులో మొదట ప్రయాణికుడు రూ.100తో స్మార్ట్‌కార్డును కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఆపై ఎంతైనా రీచార్జి చేసుకోవచ్చు. ఈ కార్డుపై ప్రతీ ప్రయాణంలో 10 శాతం రాయితీ పొందే అవకాశం కల్పించారు. అలాగే, 2023 సెప్టెంబర్ 23న సూపర్ సేవర్

మిగతా 6వ పేజీలో..

గ్రేటర్‌లో విషాదం



నీటి సంపులో పడి మృతిచెందిన చిన్నారి

- ఇద్దరు చిన్నారుల మృతి
- నీటి సంపులో పడి ఒకరు..
- ఆడుకుంటూ భవనం పై నుంచి పడి మరొకరు..

6

మిస్ ఫైరా..? ఆత్మహత్యా..?

- ఆర్ఎస్ఐ బాలేశ్వర్ మృతి
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు
- హుసేనీఆలం పోలీస్ ఔట్‌పోస్ట్‌లో గన్ మిస్ ఫైర్..?
- ఈ ఏడాదిలో ఇది రెండో ఘటన

మదీన, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): హుసేనీఆలం పోలీస్ ఔట్‌పోస్ట్‌లో తుపాకీ మిస్ ఫైర్ అయ్యిందా..? లేక ఆర్ఎస్సై ఆత్మహత్యకు పాల్పడ్డాడా..? అనేది తేలకపోవడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖబూతర్‌ఖానా ప్రాంతంలోని ఔట్‌పోస్ట్‌లో టీఎస్‌పీఎస్సీ మహబూబ్‌నగర్ పదో బెటాలియన్‌కు



బాలేశ్వర్ (ఫైల్)

చెందిన ఆర్ఎస్ఐ బాలేశ్వర్(48) ఔట్‌పోస్ట్ ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. ఒక అధికారికి రిలీవర్‌గా వచ్చిన ఆయన మూడురోజుల క్రితమే బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం ఉదయం ఐదు గంటల సమయంలో ఆయన చేతిలోని తుపాకీ పేలి బుల్లెట్ గదమ కింద నుంచి తలపైభాగంలో నుంచి బయటికి వెళ్లింది. తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన తోటి సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచా రం ఇచ్చారు. దక్షిణ మండలం డీసీపీ సాయిచైతన్య, అడిషనల్ డీసీపీ షేక్ జహంగీర్, చార్మినార్ ఏసీపీ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మూడు రౌండ్లు ఫైర్..

బాలేశ్వర్ మృతిచెందిన సంఘటనలో మూడు రౌండ్లు ఫైర్ అయినట్లు పోలీసులు గుర్తించారు. అయితే, గన్‌కు ఆటోమెటిక్ లోడింగ్ సిస్టమ్ ఉంటుందని, అలాంటి సమయంలో మూడు బుల్లెట్లు ఫైర్ కావడం సహజమేనని అంటున్నారు.

దర్యాప్తు చేస్తున్నాం : పోలీసులు

బాలేశ్వర్ గన్ మిస్‌ఫైర్ అవడం వల్ల మృతి చెందాడా..? లేక ఆత్మహత్య చేసుకున్నాడా..? అనేది తేలాల్సి ఉందని పోలీసులు తెలిపారు. అందుకే అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఆత్మహత్య చేసుకునేందుకు పని ఒత్తిడా..? ఆర్థిక, కుటుంబ

మిగతా 6వ పేజీలో..

అవగాహనా లోపం.. అవస్థలు..!



అధికారులకు తెలియని మార్గదర్శకాలు

- మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో గందరగోళం
- దరఖాస్తుదారుల ఇబ్బందులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- సర్కిల్ అధికారులకు లేని స్పష్టత

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో ఓ వ్యక్తి తండ్రి మరణ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేశాడు. మన్సూరాబాద్ నుంచి ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో అతడు మరణించాడు. దీంతో బ్రాట్ డెడ్(తీసుకువచ్చే సరికి మరణించారు) అని ఆస్పత్రి నుంచి సర్టిఫికెట్ ఇచ్చారు. ఆ వివరాలూ దరఖాస్తుతోపాటు జత పర్చారు. రెండు నెలలైనా డెత్ సర్టిఫికెట్ ఇవ్వలేదు. అదేంటని అడిగితే.. మాకు సంబంధం లేదు.. బ్రాట్ డెడ్ అంటే చనిపోయిన ప్రాంతం ఏ సర్కిల్ పరిధిలోకి వస్తుందో అక్కడే తీసుకోవాలన్నది సంబంధిత అధికారి సమాధానం. అదే కారణంతో దరఖాస్తూ తిరస్కరించారు.

కూకట్‌పల్లికి చెందిన ఓ దరఖాస్తుదారుడి విషయంలోనూ అదే జరిగింది. ఓ వయోధికురాలు ఇంటి నుంచి ఆస్పత్రికి తీసుకెళ్లేసరికి మరణించింది. వారు ఉండే ప్రాంతం ఓ సర్కిల్‌లో.. ఆస్పత్రి మరో సర్కిల్‌లో ఉండడంతో అధికారులు పేచి పెట్టి నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పించుకున్నారు.

అస్వస్థతకు గురైన వ్యక్తిని చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్తారు. దురదృష్టవశాత్తు ఒక్కోసారి సదరు వ్యక్తి మార్గమధ్యలోనే మృతిచెందవచ్చు. వైద్యులు ధ్రువీకరిస్తే కానీ.. ప్రాణంతో ఉన్నాడా..? లేదా..? అన్నది ఆస్పత్రికి వెళ్తోన్న సమయంలో కుటుంబ సభ్యులు పరిశీలించరు. అలాంటప్పుడు ఎక్కడ తుదిశ్వాస విడిచారు అన్నది ఎవరు చూడాలి. నిర్ధారించాల్సింది ఎవరు..? ఇవేవి పట్టించుకోకుండా జీహెచ్ఎంసీలోని కొందరు అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్లు, ఏఎంఓహెచ్‌లు

మిగతా 6వ పేజీలో..


కెరీర్ ప్రణాళికకు వేదిక.. వేసవి

విద్యాసంవత్సరం ముగింపుకొచ్చింది. ఇప్పటికే పదోతరగతి పరీక్షలు పూర్తి కావడంతో తర్వాత ఏం చేయాలనే వేటలో విద్యార్థులు బిజీగా ఉన్నారు. పరీక్షలు అయిన తర్వాత ఒకటి, రెండు వారాలు ఫ్యామిలీతో ఏదైనా ఔటింగ్‌కు వెళ్లినా లేదంటే బంధువుల ఇళ్లకు వెళ్లి గడపడం ఫర్వాలేదు కానీ, మిగిలిన సమయం ఎలా సద్వినియోగం చేసుకోవాలన్నదే ప్రశ్న. టీనేజర్లకు ఇంటర్న్‌షిప్స్ చేసేందుకు, కళాశాలలో అడ్మిషన్స్ ఆఫీసర్స్‌గా బాధ్యతలు నిర్వర్తించేందుకూ ఈ వేసవి అనుకూలమైన కాలం. జాబ్ స్కిల్స్ మెరుగు పరుచుకునేందుకు అత్యంత అనువైన సమయమిది. టీనేజర్ల (పదమూడేళ్ల లోపు వయసు వారు)ను స్ఫూర్తిదాయక యాక్టివిటీలలో బిజీగా చేయడం మంచిదని సైకాలజిస్ట్ రమణ చెబుతున్నారు.

– హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి)

- వేసవిలో వినోదమే కాదు.. నేర్చుకునేందుకూ సరైన సమయమిదే
- సద్వినియోగం చేసుకోవాలంటున్న నిపుణులు

ఎలా ప్లాన్ చేసుకోవాలి అంటే..



టీనేజర్లు స్నేహితులను పెంచుకోవాలి..

టీనేజర్లు స్నేహితులను పెంచుకునేందుకు అనువైన సమయమిది. అపార్ట్‌మెంట్ లేదా కాలనీలలో ఉన్న తమ వయసు పిల్లలతో కలిసి ఆడే ఆటలు, వారితో మాట్లాడడం వల్ల స్నేహం మరింత బలపడుతుంది.

సమ్మర్ క్యాంప్‌లతో..

వేసవిలో సమ్మర్ క్యాంప్‌లు నగరం మొత్తం జరుగుతూనే ఉంటాయి. కాస్త వైవిధ్యంగా ఉన్న అంశాలపై దృష్టి సారిస్తే టీనేజర్లకూ ఉత్సాహంగా ఉంటుంది. రోబోటిక్స్ లాంటివి వారికి ఆసక్తి కలిగించవచ్చు. ఓ కొత్త అంశాన్ని నేర్చుకున్నామన్న తృప్తి లభిస్తుంది. భవిష్యత్‌లో ఎంతగానో ఉపయోగపడవచ్చు.

ప్రకృతిపై ప్రేమ కలిగించాలి..

నగరీకరణ ప్రభావంతో ప్రకృతికి పిల్లలు దూరమవుతున్నారు. దీంతో నేచర్ డెఫిసిట్ డిజార్డర్‌తో కొంతమంది పిల్లలు బాధపడుతుంటారు. ఇలాంటి వారికి ఔట్‌బౌండ్ లైఫ్ యాక్టివిటీస్ ఉపయోగపడతాయి. ఈ తరహా కార్యక్రమాల వల్ల నాయకత్వ లక్షణాలు మెరుగుపడడంతో పాటుగా ప్రకృతిలో సురక్షితంగా ఎలా ఉండాలి వంటి అంశాలు కూడా నేర్చుకుంటారు.

మనీ మేనేజ్‌మెంట్..

టీనేజ్‌లోనే డబ్బును జాగ్రత్తగా ఖర్చు పెట్టడం గురించి తెలియజేయాలంటే షాపింగ్ చేయించడం ఓ మార్గం. కొంత మొత్తంలో డబ్బు ఇచ్చి వారి చేతనే షాపింగ్ చేయించడం ద్వారా ఎలాంటి వాటికి ఖర్చుపెడుతున్నారో మీకు

మిగతా 6వ పేజీలో..

స్వరమాధురి ఉగాది నంది పురస్కారాల ప్రదానం


పురస్కారాన్ని అందుకుంటున్న ధీకొండ తిరుపతి

బర్కత్‌పుర/చిక్కడపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పురస్కారాలు ఉత్సాహం ఇవ్వడంతోపాటు మరింత సమాజ సేవ చేయడానికి దోహదపడుతాయని బీసీ కమిషన్ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ అన్నారు. నిజాం కళాశాల సోషియాలజీ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి హెడ్, అసిస్టెంట్ ప్రొఫెసర్. ధీకొండ తిరుపతి, ఎస్‌బీఐ మాజీ ఏజీఎం, ప్రముఖ గాయకుడు చింతలపూడి త్రినాథరావులు స్వరమాధురి ఉగాది నంది పురస్కారానికి ఎంపికయ్యారు. స్వరమాధురి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయగానసభలో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాలను తిరుపతి, త్రినాథరావులకు డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ విద్యారంగంలో తాను చేసిన సేవలను గుర్తించి పురస్కారాన్ని అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డును తల్లిదండ్రులకు అంకితం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



మహ్మద్ ఫహీమ్ ఖురేషీకి ఖర్జూర తినిపిస్తున్న కాంగ్రెస్ నాయకుడు అజరుద్దీన్

శివరాంపల్లిలో ఇఫ్తార్ విందు

రాజేంద్రనగర్, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మైనారిటీ గురుకుల విద్యాసంస్థల వైస్ చైర్మన్ మహ్మద్ ఫహీమ్ ఖురేషీ ఆధ్వర్యంలో ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ శివరాంపల్లిలోని ఎస్ఎన్‌సీ కన్వెన్షన్‌లో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందులో రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, టీండియా మాజీ క్రికెటర్, కాంగ్రెస్ నాయకుడు అజరుద్దీన్ పలు కార్పొరేషన్ల చైర్మన్లు బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఒబేదుల్లా కొత్వాల్ పాల్గొన్నారు.



బాబుల్‌రెడ్డినగర్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

చేవెళ్ల ఎంపీగా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించుకుందాం

రాజేంద్రనగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మరోసారి అధికారంలోకి వచ్చి నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని కావాలంటే పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరమున్నదని కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించారు. బాబుల్‌రెడ్డినగర్‌లో ఇంటింటికి ప్రచారం చేసినా ఆయన, దుకాణాలలో వ్యాపారులను కలిసి బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఓటు వేయాలని అభ్యర్థించారు. పార్లమెంట్ ఎన్నికలలో చేవెళ్లలో బీజేపీ అభ్యర్థిని గెలిపించుకుందామని అన్నారు. ప్రచారంలో బీజేపీ రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ పి.మల్లేశ్‌యాదవ్, అడికె జనార్దన్, రావుల భాస్కర్, సంతిగౌడ్, సీహెచ్ వెంకటరమణ, గోపాల్ నాయక్, కొవ్వాకుల బాబు, రమేశ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, చెన్నమ్మ, రాజలింగం, రాజ్‌కుమార్, రామారావు, బొల్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవచేసే నాయకులను ఎన్నుకోవాలి

బీజేపీ చేవెళ్ల అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి

రాజేంద్రనగర్, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచదేశాలకు చాటుతున్న ఘనత ప్రధాని నరేంద్రమోదీకి దక్కుతుందని బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి కొండా సంగీతారెడ్డి అన్నారు. ఆదివారం అత్తాపూర్ డివిజన్, సింఫనీ విల్లాస్‌లో ఉంటున్న ఓటర్లతో సంగీతారెడ్డి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఎంపీగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చేవెళ్ల ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, గొప్ప పారిశ్రామిక వేత్తగా పేరు తెచ్చుకున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సామాన్య ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతోనే రాజకీయాలలోకి వచ్చారన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో ప్రజలంతా కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి అండగా ఉండి , సేవ చేసే నాయకులను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో సింఫనీ గేటెడ్ కమ్యూనిటీ సభ్యులు, బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ ఎన్.మల్లారెడ్డి, అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఎస్.విజయ్‌కుమార్, కార్పొరేటర్ మొంద్ర సంగీత గౌరీశంకర్, కొండా గౌతమిరెడ్డి, వినోద్‌కుమార్, దామోదర్, నరేశ్, సంతోష్ జాజు, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

'సికింద్రాబాద్‌లో పద్మారావు గెలుపు తథ్యం'

చార్మినార్ ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలలో ఎవరు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా సికింద్రాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ విజయం తథ్యమని, ఆ పార్టీ చార్మినార్ నియోజకవర్గ ఇన్‌చార్జి సలావుద్దీన్ లోధి పేర్కొన్నారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని పద్మారావు ఇంటికి వెళ్లి ఆయనను సన్మానించారు. అనంతరం సలావుద్దీన్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలకు ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయకుండా, రంజాన్ కానుకలు అందించకుండా కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని విమర్శించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో సికింద్రాబాద్ నియోజకవర్గంలో నివసించే ముస్లింలు మూకుమ్మడిగా తమ ఓటును బీఆర్ఎస్‌కు వేసి గెలిపిస్తారన్నారు.

బీజేపీ గెలుపునకు కష్టపడి పనిచేయాలి



కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలత

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో హైదరాబాద్ నియోజకవర్గంలో బీజేపీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని, బీజేపీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి కె. మాధవీలత అన్నారు. ఆదివారం చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని జంగమ్మెట్, లలితాబాగ్, ఉప్పుగూడ, చాంద్రాయణగుట్ట డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా అయా ప్రాంతాల్లో పార్టీ కార్యకర్తలతో పరిచయ కార్యక్రమం నిర్వమించి మాట్లాడారు. బీజేపీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీపై పాతబస్తీలో వ్యతిరేకత మొదలైందన్నారు. ఆయన మతం పేరిట రాజకీయాలు చేస్తున్నారన్నారని విమర్శించారు. బీజేపీకి అవకాశం ఇస్తే పాతబస్తీ రూపురేఖలు మార్చివేసి అభివృద్ధి చేసి చూపుతానిని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గ్యార ప్రభాకర్, జె.చిరంజీవి, కొడి మహేందర్, ధర్మతేజ, ఎడ్ల విజయ్‌కుమార్, పండరీనాథ్, పొన్న శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ పెరిగిన చికెన్ రేట్లు

- లైవ్‌బర్డ్ రూ.220
- స్కిన్‌లెస్ కిలో రూ. 320
- నాటుకోడి కిలో రూ.400పైనే..

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నగరంలో చికెన్ రేట్లు మళ్లీ దడ పుట్టిస్తున్నాయి. 15 రోజుల క్రితం వరకు కాస్త అందుబాటులోకి వచ్చిన ధరలు.. ఆదివారం ఒక్కసారిగా పెరిగాయి. కిలోపై రూ.80 నుంచి 100 వరకు పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు చికెన్‌ను కొనుగోలు చేసేందుకు వెనకంజ వేశారు. గ్రేటర్‌లో గతంలో ఎన్నడూలేని విధంగా చికెన్ రేట్లు గరిష్ఠంగా పెరిగాయి.

తగ్గినట్లే తగ్గి..!

మార్చి మూడో వారంలో నగరానికి కోళ్ల దిగుమతి పెరగడంతో రేట్లు కాస్తా అందుబాటులోకి వచ్చాయి. ఈ మేరకు మార్చి 17 నుంచి ఏప్రిల్ 2 వరకు లైవ్ కోడి కిలో రూ.120 నుంచి రూ.140 వరకు, స్కిన్‌లెస్ కిలో రూ.180 నుంచి రూ.200-220 వరకు విక్రయించారు. అయితే రేట్లు అందుబాటులోకి వచ్చాయని భావిస్తున్న తరుణంలో రెండు రోజులుగా మళ్లీ పెంచారు. ఆదివారం స్కిన్‌లెస్ కిలో రూ.300 నుంచి 320 వరకు, లైవ్‌బర్డ్ రూ.200 నుంచి రూ.210 వరకు విక్రయించారు. అలాగే నాటుకోడి కిలో బర్డ్‌ను రూ.400పైగానే అమ్మారు.

ఎండలను అడ్డుపెట్టుకుని దోపిడీ..

నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ఎండలను అడ్డుపెట్టుకుని వ్యాపారులు అడ్డగోలుగా దోచుకుంటున్నారని కొనుగోలుదారులు వాపోతున్నారు. నగర శివారు ప్రాంతాల నుంచి కోళ్ల దిగుమతి ఎక్కువగా ఉన్నప్పటికీ కొంతమంది కృత్రిమ కొరత సృష్టించి అందిన కాడికి దోచుకుంటున్నారని చెబుతున్నారు. స్కిన్‌లెస్ కిలో రూ.300 నుంచి 320 వరకు రేటు పెట్టడం దారుణమని, దీనికంటే రూ.400 పెడితే మటన్ వస్తోందని పేర్కొంటున్నారు. ధరలను నియంత్రణపై ఎవరూ పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముస్లింలకు పవిత్రమైనది రంజాన్ మాసం



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మహ్మద్ ముర్తుజా అలీ తదితరులు

రాజేంద్రనగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైనదని, 30 రోజులు ఉపవాస దీక్షలో ఉంటూ ఖురాన్ పఠనం చేయడం వలన వారికి ఎంతో పుణ్యం లభిస్తుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం రాత్రి రాజేంద్రనగర్‌లోని జామా మసీద్‌లో బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా మైనారిటీ విభాగం నాయకుడు మహ్మద్ ముర్తుజా అలీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కొన్నేళ్ల నుంచి రంజాన్ నెలలో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తున్న ముర్తుజా అలీ, ఆయన కుటుంబ సభ్యులపై అల్లాహ్ కృప ఉండాలని ఆకాంక్షించారు. తాను రోజూ ఏదో ఒక చోట ఇఫ్తార్ విందులలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ముర్తుజా అలీ మాట్లాడుతూ, ఇఫ్తార్ విందులో కులమతాలకు అతీతంగా దాదాపు మూడు వేల మంది హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహ్మద్ గౌస్, సయ్యద్ వసీమ్, షేక్ సలామ్, పోరెడ్డి దర్మారెడ్డి, పుంజాల సాయిగౌడ్, చెన్నయ్య, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాహితీమూర్తులను సత్కరించుకోవడం అభినందనీయం



ఆచార్య చెన్నకేశవరెడ్డిని సత్కరిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తమ రచనల ద్వారా సమాజాన్ని మేల్కొలిపే సాహితీమూర్తులను సత్కరించుకోవడం అభినందనీయమని ఎమ్మెల్సీ సురభి వాణీదేవి అన్నారు. ఆదివారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య జి.చెన్నకేశవరెడ్డి 80వ జన్మదినం సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారగ్రహీత అంపశయ్య నవీన్‌ను సత్కరించారు. దీంతోపాటు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ప్రకటించిన సందర్భంగా ప్రసిద్ధ అనువాదకుడు ఎలనాగను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సురభి వాణీదేవి సన్మానగ్రహీతల్ని అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశానికి గర్వకారణంగా నిలిచిన మహోన్నతమైన పీవీ నరసింహారావు కుమార్తెను అయినందుకు గర్వపడతానని అన్నారు. ఆచార్య చెన్నకేశవరెడ్డి రచించిన జాతిరత్నం గ్రంథం అందరికీ మార్గదర్శనమని అన్నారు. కార్యక్రమంలో కాళోజీ పురస్కారగ్రహీత డా.అమ్మంగి వేణుగోపాల్, పీవీ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ పి.వి.ప్రభాకరరావు, వెలుదండ నిత్యానందరావు, రామకృష్ణారావు, ఎం.కె.రాము, సురేందర్‌రావు, ఆచార్య ఎం.శంకర్‌రెడ్డి, వేంకటేశ్వరరెడ్డి, గంటా జలంధర్‌రెడ్డి, చికోలు సుందరయ్య అమ్మంగి కవితాస్వామి తదితరులు పాల్గొన్నారు.

మహావీర్ ఆస్పత్రిలో గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం



గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం డీలక్స్ రూమ్‌లను ప్రారంభిస్తున్న ఏఐజీ చైర్మన్ డాక్టర్ డి. నాగేశ్వర్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మహావీర్ ఆస్పత్రి రీసెర్చ్ సెంటర్‌లో గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం, డీలక్స్ రూమ్‌లను ఏఐజీ చైర్మన్, చీఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహావీర్ ఆస్పత్రి ఎన్నో ఏళ్లుగా విశేష సేవలు అందిస్తోందన్నారు. జీర్ణవ్యవస్థను ప్రభావితం చేసే రుగ్మతలు, జీర్ణ వాహిక, ప్యాంక్రియాస్, కాలే యం, పిత్త వాహికలు, పిత్తాశయం సంబంధించిన వ్యాధులు విపరీతంగా పెరుగుతున్నాయని, ఇలాంటి సదుపాయాలు ఉండడం వల్ల మెరుగైన వైద్యం అందుతుందన్నారు. నాలుగు దశాబ్దాలకు పైగా కుల మతాలకతీతంగా పేదలకు సేవలందిస్తుందన్నారు. మహావీర్ ఆస్పత్రిలో రోగుల మెరుగైన ఆరోగ్య సంరక్షణ కోసం అన్ని విభాగాలను అత్యాధునిక పరికరాలతో అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగాన్ని చంద్రకళాదేవి కాంతిలాల్ నహర్, కుటుంబం విరాళంగా అందించారని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రూపేంద్ర ప్రసాద్, మహేంద్ర రంకా, సుశీల్ సంచేటి, డాక్టర్ ఆశా ఖివ్‌సార, డాక్టర్ మిసులాల్ జైన్, నితిన్ కె షా, పరేష్ షా, రాజేష్ పరాక్, రాజేష్ పోకర్నా, రమేష్ కుండాలియా, షీల్ కుమార్ జైన్, విజయ్ సురానా, విమల్ రాంకా, యోగేష్ జైన్ పాల్గొన్నారు.

కవులు, కళాకారులు, సాహితీవేత్తలు

సమాజహితం కోసం పనిచేయాలి



పురస్కారగ్రహీతల్ని సత్కరిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కవులు, కళాకారులు, సాహితీవేత్తలు సమాజహితం కోసం పనిచేయాల్సిన అవసరముందని మాజీ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. క్రోధినామ ఉగాది పండుగ పురస్కరించుకొని ఫ్రెండ్షిప్ మినిస్ట్రిస్ ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ పాలడుగు సరోజినిదేవికి సాహితీసేవ, విద్యాశాఖలో చేసిన సేవకుగాను ప్రత్యేకంగా సత్కరించి అభినందించారు. దీంతో పాటు పలువురికి ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వేణుగోపాలచారి పురస్కారగ్రహీతల్ని సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉగాది సందర్భంగా ప్రతిభావంతులను సన్మానించుకోవడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో హాస్య బ్రహ్మ శంకనారాయణ, దేవసేన, డా.ఆలూరి విల్సన్ పాల్గొన్నారు.

మద్దాళి ఉషాగాయత్రికి ఘన సత్కారం

రవీంద్రభారతి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం స్వీకరించిన సందర్భంగా ప్రముఖ నర్తకి మద్దాళి ఉషాగాయత్రికి ఘన సత్కారం చేశారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రిటైర్డ్ ఐఏఎస్ కేవీ.రమణాచారి నర్తకి ఉషాగాయత్రిని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మద్దాళి ఉషాగాయత్రి జీవితం నాట్యానికి అంకితం చేశారని అన్నారు. నృత్య కిన్నెర సంస్థ ద్వారా వందలాది మంది నర్తకులను తయారు చేశారని గుర్తుచేశారు. ఉషాగాయత్రి నాట్య సేవలను గుర్తించి కేంద్రం సంగీత నాటక అకాడమీ పురస్కారంతో సత్కరించిందని తెలిపారు. ఈ పురస్కారం రావడం సంతోషకరమని అన్నారు. ఉషాగాయత్రికి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పురస్కారాలు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మద్దాళి రఘురామ్‌తో పాట కిన్నెర ఆర్ట్ థియేటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.



నిరాహార దీక్షలో మాట్లాడుతున్న తెలంగాణ ఆప్ కన్వీనర్ సుధాకర్

కేజ్రీవాల్ అంటే మోదీకి భయం

కవాడిగూడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కేజ్రీవాల్‌ను చూసి మోదీ భయపడుతున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డిడ్డి సుధాకర్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోతానేమోనన్న భయంతోనే కేజ్రీవాల్‌పై అక్రమ కేసు బనాయించి జైల్లో పెట్టించారని ఆరోపించారు. ఈడీ, సీబీఐ లాంటి దర్యాప్తు సంస్థలను కేంద్రంలోని బీజేప ప్రభుత్వం తన జేబు సంస్థలుగా మార్చుకొని, ప్రతిపక్ష నేతలను బెదిరిస్తోందన్నారు. దర్యాప్తు సంస్థల సాయంతోనే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గెలిచేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఢిల్లీ మద్యం కేసులో కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఆదివారం దేశవ్యాప్తంగా జరిగిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా.. ధర్నాచౌక్‌లో ఆప్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో కూడా నిరసన నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు సుధాకర్ అధ్యక్షత వహించగా.. కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, సీపీఐ రాష్ట్ర నాయకుడు బాలమల్లేశ్‌తో పాటు పలు పార్టీల నేతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. లిక్కర్ స్కామ్‌లో ఎలాంటి ఆధారాలు లేకపోయినప్పటికీ కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారన్నారు. బీజేపీకి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో విరాళాలు ఇచ్చినవారిని బెయిల్‌పై విడుదల చేశారని ఆరోపించారు. కేజ్రీవాల్‌పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి బేషరతుగా విడుదల చేయాలని సుధాకర్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమిదే విజయమని ఆయన పేర్కొన్నారు. దీక్షలో సీపీఎం, సీపీఐ నాయకులు, పలువురు వక్తలు మాట్లాడారు. కేజ్రీవాల్ అరెస్టును వారంతా ఖండించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు.

ఆటోలో నిద్రిస్తున్న డ్రైవర్‌ను కత్తితో పొడిచి దోపిడీ

ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సౌత్‌జోన్ ఏడీసీపీ షేక్ జహంగీర్

హైదరాబాద్ సిటీ/చార్మినార్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన ఆటోలో నిద్రిస్తున్న ఆటోడ్రైవర్‌పై దాడిచేసి, నగదు, సెల్‌ఫోన్ దోచుకున్న ముగ్గురు నేరస్థులను మీర్‌చౌక్ పోలీసులు అరెస్ట్ చేశారు. పురానీహవేలిలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సౌత్‌జోన్ ఏడీసీపీ షేక్ జహంగీర్ వివరాలు వెల్లడించారు. దోపిడీకి పాల్పడిన ఇద్దరు నిందితులు పాత నేరస్థులని, వివిధ పోలీస్‌స్టేషన్‌లలో వారిపై కేసులున్నాయని తెలిపారు. కిషన్‌బాగ్‌కు చెందిన ఆటోడ్రైవర్ సయ్యద్ అబ్దుల్ హసన్ (35) పాత నేరస్థుడు. ఇతడిపై నగరంలో పలు పోలీస్‌స్టేషన్‌లలో 17 కేసులున్నాయి.

యాకుత్‌పురాకు చెందిన సయ్యద్ తాలిబ్‌అలీ అలియాస్ సమీర్(22) ప్రైవేటు ఉద్యోగి, ఇతడిపై కూడా పలు పోలీస్‌స్టేషన్‌లలో 7 కేసులున్నాయి. బాల్‌షెటికేత్‌కు చెందిన ఆటో డ్రైవర్ సయ్యద్ తాహెర్ అలీ(30) స్నేహితులు. ఈనెల 5వ తేదీ తెల్లవారు జామున తాహెర్ అలీ, సమీర్, హసన్ ముగ్గురు ఆటోలో సాలార్‌జంగ్ మ్యూజియం రోడ్డులో వెళుతున్నారు. మాతాకిడికి ప్రాంతానికి చెందిన ఆటోడ్రైవర్ మహ్మద్ దస్తగిరి(35) ఈనెల 5వ తేదీ ఉదయం 5.30 గంటల ప్రాంతంలో సాలార్‌జంగ్ మ్యూజియం సమీపంలోని చిల్లా వద్ద రోడ్డుపక్కగా ఆటో ఆపి అందులోనే నిద్రపోతున్నాడు. వీరు ముగ్గురు ఆటోలో పడుకొని ఉన్న దస్తగిరి రెండు తొడలపై కత్తితో పొడిచి బెదిరించి, అతడి వద్ద ఉన్న రూ. 500, సెల్‌ఫోన్ తీసుకొని పరారయ్యారు. బాధితుడు మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న మీర్‌పేట డీఐ దిలీప్‌కుమార్ బృందం సీసీ టీవీ ఫుటేజ్‌ల ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రెండు కత్తులు, ఆటో, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

'ఎస్సీ ఉప కులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

బర్కత్‌పుర, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్, ప్రత్యేకబోర్డు ఏర్పాటు చేయాలని ఎస్సీ ఉప కులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి.వెంకటేష్ మోచి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాల, మాదిగలతో సమానంగా ఎస్సీ ఉపకులాలకు పార్లమెంట్ సీట్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఉపకులాలపై ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ చేసిన వ్యాఖ్యలను ఆయన వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి సమావేశంలో వెంకటేష్ మాట్లాడారు. ఇప్పటి వరకు ఉపకులాలకు ఒక ఎంపీ, ఎమ్మెల్యే టికెట్ కూడా ఇవ్వలేదని, రాజకీయ పార్టీలు ఈ పద్ధతిని మార్చుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు టి.ఎన్.స్వామి, సత్యనారాయణ, మహేందర్, నర్సింగ్ మోరే, బాల్‌రాజ్, శోభ, రామారావు, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

రత్నదీప్ సూపర్ మార్కెట్‌లో అగ్నిప్రమాదం

- భారీగా ఎగిసిపడిన మంటలు
- హైదరాబాద్ శివారులో ఘటన



మార్కెట్‌లో ఎగిసిపడుతున్న మంటలు

నార్సింగ్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో త్వరలో ప్రారంభం కానున్న ఓ సూపర్ మార్కెట్ కాలిబూడిదైంది. ఈ ఘటన బండ్లగూడ మున్సిపాలిటీ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. లంగర్‌హౌజ్-అప్పా రేడియల్ మార్గంలో ప్రధాన రోడ్డుకు అనుకుని రత్నదీప్ సెలెక్ట్ సూపర్ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఉగాది నుంచి ప్రారంభం కావాల్సిన మార్కెట్‌లో సెంట్రల్ ఏసీతో పాటు అన్ని రకాల ఎలక్ట్రికల్ పరికరాల ఏర్పాటు జరుగుతోంది. ఆదివారం సామగ్రి ఏర్పాటు చేస్తుండగా అగ్నిప్రమాదం జరిగిందని, మంటలకు దట్టమైన పొగ అలుముకోవడంతో అందరం ఒక్కసారిగా బయటకు పరుగులు పెట్టామని కార్మికులు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో కార్మికులు ఎవరూ గాయపడలేదని జిల్లా అగ్నిమాపక అధికారి గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఆస్తి నష్టం లక్షల్లోనే ఉంటుందని, ఈ ప్రమాదానికి వెల్డింగ్ పనులు కారణమా లేక షార్ట్ సర్క్యూట్ కారణమా అన్నది దర్యాప్తులో తేలుతుందని అన్నారు. ఈ ఘటనపై రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/0tlKr7O లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

11న జ్యోతిరావు పూలే జయంతి

రాజేంద్రనగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూల్యే జయంత్యుత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటు వ్యవస్థాపక అధ్యక్షుడు పోతురాజు యాదయ్య మాదిగ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పూలే విగ్రహ ఏర్పాటు కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ ఉదయం 11 గంటలకు జ్యోతిరావు పూలే జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. రాజేంద్రనగర్ పట్టణ ప్రజలు, పార్టీల నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు, బీసీ సంఘాలు అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ

మైనారిటీ సెల్ ఇన్‌చార్జిగా అఫ్జల్



అఫ్జల్ అహ్మద్

పహాడీషరీఫ్ ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గ మైనారిటీ ఇన్‌చార్జిగా ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు బాలాపూర్‌కు చెందిన సయ్యద్ అఫ్జల్ అహ్మద్‌ను నియమితులయ్యారు. ఈ సందర్భంగా సయ్యద్ అబ్దుల్ అహ్మద్ మాట్లాడుతూ మహేశ్వర నియోజకవర్గంలోని మైనార్టీలను ఒక్కతాటిపైకి తీసుకొచ్చి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ రంజిత్ రెడ్డి గెలుపును కృషి చేస్తానన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, స్థానిక ప్రజలు

ప్రపంచ ఆరోగ్య దినోత్సవంపై

అవగాహన ర్యాలీ

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వివిధ రోగాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గాంధీ ఆస్పత్రి జనరల్ మెడిసిన్ సీనియర్ అసోసియేట్ ప్రొఫెసర్, తెలంగాణ వైద్య మండలి సభ్యురాలు డాక్టర్ ప్రతిభాలక్ష్మి, డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, స్థానిక ప్రజలు

ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలి

రాజేంద్రనగర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సేవభావాన్ని అలవర్చుకోవాలని బీఆర్ఎస్ అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు వి.శ్రీరాంరెడ్డి సూచించారు. రాంబాగ్ ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదర్‌గూడ పిల్లర్ నెంబర్ 143 వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం శ్రీరాంరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో రహదారుల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా బాటసారు దాహార్తిని తీర్చవచ్చన్నారు. కార్యక్రమంలో జగ్గుబాయి, కన్నబాయి, ప్రజాపతి సంజు మాస్టర్, అంబదాస్, జైహింద్‌రెడ్డి, పన్నాలాల్, సంతోష్ పాల్గొన్నారు.

చేవెళ్ల సభను విజయవంతం చేయాలి

- బీఆర్ఎస్ జల్‌పల్లి మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్



షర్ఫుద్దీన్ హమేద్

పహాడీషరీఫ్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న చేవెళ్లలో జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జల్‌పల్లి మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హమేద్ పిలుపునిచ్చారు. ఆదివారం ఎర్రకుంటలోని కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఏ పదవీ లేకున్నా నిరంతరం బడుగు బలహీన వర్గాల తరఫున కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పోరాటం చేస్తున్నారని, ఆయన గెలిపించి పార్లమెంట్‌కు పంపించితే, పేదల పక్షాన జ్ఞానేశ్వర్ తన గళం విప్పి ప్రశ్నిస్తారని అన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో కాసాని జ్ఞానేశ్వర్ గెలుపునకు అందరూ సమష్టిగా పనిచేయాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల తరహాలో పనిచేస్తే చేవెళ్లలో బీఆర్ఎస్ పార్టీ విజయం తథ్యమన్నారు.

పీఆర్‌సీ బాండ్స్ బకాయిల

చెల్లింపుల్లో వివక్ష వద్దు

- ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ నాగేశ్వర్‌రావు

హైదరాబాద్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో 2013 పీఆర్‌సీ బాండ్స్ బకాయిలను కేవలం 15వేల మంది డ్రైవర్లకే చెల్లించి, కండక్టర్లు, ఇతర కార్మికులు, ఉద్యోగులకు నిలిపివేయడం అన్యాయమని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వర్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం పథకాన్ని విజయవంతంగా అమలు చేయడంలో డ్రైవర్లతోపాటు కండక్టర్లు, ఇతర గ్యారేజీ కార్మికులు సైతం కృషిచేస్తున్నారని ఆయన గుర్తుచేశారు. ఆర్టీసీలో సుమారు 42 వేల మంది కార్మికులు దాచుకున్న బాండ్స్ డబ్బులను అందరికీ విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేవలం 15వేల మంది డ్రైవర్లకు అందించి, మిగిలిన 27 వేలమందికార్మికులు(15వేల మందికండక్టర్లు, 4వేల మంది గ్యారేజీ, 6వేల మంది ఇతర సెక్యూరిటీ క్లరికల్, సూపర్‌వైజర్‌లు)ను విస్మరించడం దారుణమన్నారు. తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పండుగ నాటికి 2013 నాటి పీఆర్‌సీ బకాయిలను పూర్తిస్థాయిలో ఆర్టీసీలోని కార్మికులందరికీ చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన ఆర్టీసీ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. పీఆర్‌సీ బకాయిలు చెల్లింపుల కోసం రాష్ట్రప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ ఆర్టీసీ యాజమాన్యం నిర్లక్ష్యం చేయడం భావ్యం కాదని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన నిధులు, సబ్సిడీల చెల్లింపులు, ఆర్టీసీ ఆర్థిక పరిస్థితిపై యాజమాన్యం శ్వేతపత్రం విడుదల చేయాలని నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు.



రాజేంద్రనగర్ సర్కిల్ శివరాంపల్లిలో ఆదివారం జరిగిన ఇఫ్తార్ విందులో ఒకరికొకరు ఖర్జురాను తినిపించుకుంటున్న హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, కాంగ్రెస్ నాయకుడు అజారుద్దీన్

యువత సాధికారిత లక్ష్యంగా ముందుకు సాగాలి


ప్రీతి అడుసుమిల్లి

మాదాపూర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): యువత సాధికారిత లక్ష్యంగా ముందుకు సాగాలని కార్పొరేట్ క్వీన్ మిసెస్ ఇండియా-2024, క్లాసిక్ మిసెస్ ఇండియా-2024 డాక్టర్ ప్రీతి అడుసుమిల్లి అన్నారు. మాదాపూర్‌లోని కావూరిహిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి, సమాజానికి తన వంతుగా కృషిచేసేందుకు ఎల్లప్పుడూ ముందుంటానన్నారు. టైర్-2, టైర్-3 పట్టణాలకు చెందిన యువతకు మేక్ ఓవర్, గ్రూమింగ్ వృత్తిలో నైపుణ్యాలను అందించేందుకు కొత్తగా అకాడమీని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఎర్రగడ్డలో రూ. 5లక్షలు పట్టివేత

అమీర్‌పేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ఆధారాలు లేకుండా టాటా నెక్సా కారులో తరలిస్తున్న రూ.5లక్షలను ఆదివారం ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు ఎర్రగడ్డలో పట్టుకున్నారు. ఎన్నికలకోడ్ నేపథ్యంలో పోలీసులు ఆదివారం ఎర్రగడ్డ వద్ద తనిఖీలు నిర్వహించారు. సనత్‌నగర్ ఎస్‌ఆర్టీకి చెందిన శ్రీకాంత్ గౌడ్ తన నెక్సా కారులో కూకట్‌పల్లి నుంచి వస్తుండగా పోలీసులు తనిఖీ చేయగా రూ.5 లక్షలు లభించాయి. నగదుకు సంబంధించిన రసీదులు లేకపోవడం.. పొంతన లేని సమాధానాలు చెప్పడంతో డబ్బును స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి వెల్లడించారు. డబ్బును ఎన్నికల కమిషన్‌లోని గ్రీవెన్ సెల్ అధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు చిన్నారుల మృతి

- నీటి సంపులో పడి ఒకరు..
- రెండో అంతస్తునుంచి పడి మరొక చిన్నారి..

నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన సంఘటనలు ఇరు కుటుంబాల్లో విషాదాలను నింపాయి. షాపూర్‌నగర్‌లో ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారి ప్రమాదవశాత్తు నీటిసంపులో పడి మృతిచెందగా.. నింబోలి అడ్డాలో ఓ భవనం రెండో అంతస్తు నుంచి పక్క భవనంలోని మొదటి అంతస్తులో పడి మరో చిన్నారి మృతిచెందింది. వివరాలిలా ఉన్నాయి.

షాపూర్‌నగర్‌లో..

జీడిమెట్ల,ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): ఇంటిముందు ఆడుకుంటున్న ఏడాదిన్నర వయసు గల చిన్నారి ప్రమాదవశాత్తు మూతలేని నీటిసంపులో పడి మృతి చెందింది. ఈసంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లా యాలాల్ మండలం రాఘాపూర్ గ్రామానికి చెందిన వడ్డేశివకుమార్ దంపతులు బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి షాపూర్‌నగర్‌లో ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అత్త నాగమ్మ కూడా వీరితో పాటు ఉంటుంది. ఆదివారం భార్యా భర్తలు అన్నం తిని నిద్రపోతుండగా పాప ఆడుకుంటూ ఇంటి ముందున్న సంపులో పడి మృతిచెందింది. కాసేపటి తర్వాత అత్త నీటి కోసం వెళ్లి చూడగా పాప శవం కనిపించడంతో అల్లుడుని లేపి మృతదేహాన్ని బయటకు తీశారు. జీడిమెట్ల పోలీసులకు సమాచారం అందించగా శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు.

రెండో అంతస్తు నుంచి పడి..


మృతిచెందిన రియాన్సీ

బర్కత్‌పుర, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఇంటి రెండో అంతస్తుపై ఆడుకుంటున్న ఏడాదిన్నర చిన్నారి ప్రమాదవశాత్తు పక్కింటి మొదటి అంతస్తులో పడి మృతి చెందింది. ఈ విషాదకర సంఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం నింబోలి అడ్డాలో రతన్‌లాల్, భార్య, ఇద్దరు పిల్లలతో ఉంటున్నాడు. శనివారం సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో ఇంటి రెండో అంతస్తులో కుర్చీపై కూర్చొని ఆడుకుంటున్న రియాన్సీ (ఏడాదిన్నర వయసు) ప్రమాదవశాత్తు పక్కింటి మొదటి అంతస్తులో పడిపోయింది. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే తల్లిదండ్రులు సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి, ఆ తర్వాత ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ చిన్నారి ఆదివారం రాత్రి మృతి చెందింది.

- రోడ్డుపై విరిగిపడ్డ చెట్టుకొమ్మ

తప్పించబోయి యువకుడి మృతి

అల్వాల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై విరిగిపడిన చెట్టుకొమ్మను తప్పించబోయిన ఓ యువకుడు కిందపడి మృతిచెందాడు. ఈ సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగాం ప్రాంతానికి చెందిన మల్లేష్ కుమారుడు మహేశ్(21) బంజారాహిల్స్‌లో ఉంటూ డిగ్రీ చదువుతున్నాడు. స్నేహితులను కలువడానికి శనివారం రాత్రి అల్వాల్ నుంచి శామీర్‌పేట్ మీదుగా స్కూటీపై వెళ్తున్నాడు. హకీంపేట్ రోడ్డుపై విరిగిపడిన చెట్టు కొమ్మ అడ్డు రావడంతో మహేశ్ దానిని తప్పించబోయి అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు సమీపంలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. ఈ మేరకు అల్వాల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముఖంపై కొట్టి భార్యను హత్య చేసిన భర్త


లక్ష్మి(ఫైల్)

ఉప్పల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): దంపతుల మధ్య జరిగిన గొడవ చివరకు ఒకరి ప్రాణాలను తీసింది. ఆవేశానికి గురైన భర్త.. భార్య ముఖంపై పదే పదే కొట్టడంతో ఆమె కిందపడి మృతిచెందింది. ఈ ఘటన ఆదివారం ఉప్పల్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రామంతాపూర్ డివిజన్ వాసవీనగర్‌లో మోహన్‌శర్మ, తన భార్య లక్ష్మి, కుమారుడు శివసాయి గణేష్‌తో కలిసి నివసిస్తున్నాడు. కొద్దిరోజులుగా భార్యాభర్తల మధ్య వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో ఆదివారం జరిగిన గొడవలో ఆవేశానికి గురైన మోహన్‌రావు భార్యను పదేపదే ముఖంపై కొట్టడంతో ఆమె స్పృహతప్పి కిందపడి మృతిచెందింది. ఆమె కింద పడిపోయిన విషయాన్ని మోహన్‌రావు తన కుమారుడు సాయిగణేష్ తెలిపాడు. ఇంట్లోకి వెళ్లిన సాయిగణేష్‌కు తల్లి ముఖంపై దెబ్బలు కనిపించడంతో ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు.


పీఎం రోజ్‌గార్ యోజన లోన్లు ఇప్పిస్తామని మోసం

- రూ12.9లక్షలు కాజేసిన కేటుగాళ్లు

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి రోజ్‌గార్ యోజన సబ్సిడీ లోన్లు ఇప్పిస్తామని మోసం చేసి సుమారు రూ.12.9లక్షలు కాజేసిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అమీర్‌పేట న్యూసైన్స్ కాలేజీ సమీపంలో నివాసం ఉండే మోనోశ్యామ్ తేజ చదువుకుంటున్నాడు. ఇతని వద్దకు వినీత్‌గౌడ్ అతని సోదరుడు విక్కీగౌడ్‌లు వచ్చి ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన కింద రుణాలు ఇప్పిస్తామని తెలిపారు. మోనోశ్యామ్ తేజ ష్యూరిటీ మీద అతని బంధువులు, స్నేహితుల వద్ద నుంచి రుణాలు ఇప్పిస్తామని ఆన్‌లైన్‌లో రూ.9.78లక్షలు, నగదుగా రూ.3.12లక్షలు తీసుకున్నారు. ఆ తర్వాత వీరిద్దరు గౌతమీ అనే మధ్యవర్తిని పరిచయం చేశారు. 12లక్షల లోన్‌కు కమీషన్ కింద రూ.40వేలు, రూ.18లక్షలకు రూ.50వేలు, రూ.30లక్షలు మిషనరీకైతే రూ.1.5లక్షలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ డబ్బును తేజ విడతల వారీగా ఇచ్చాడు. ఆ తరువాత లోన్లు రాకపోవటంతో డబ్బులు తిరిగి అడిగితే చంపేస్తామని బెదిరించారు. దీంతో బాధితుడు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టార్గెట్.. కుత్బుల్లాపూర్..!

గత ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి మల్కాజిగిరి పార్లమెంట్ నుంచి పోటీచేసి గెలుపొందిన విషయం తెలిసిందే. దీంతో ప్రస్తుత ఎన్నికల్లో ఆ స్థానాన్ని తిరిగి కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకునేలా వ్యూహాలు రచిస్తున్నారు. ఇందులో భాగంగా మల్కాజిగిరి, ఉప్పల్ అసెంబ్లీ బాధ్యతలను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు అప్పగించినట్లు సమాచారం. మెజార్టీ ఓట్లు కలిగిన కుత్బుల్లాపూర్‌పై తానే స్వయంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో కోల్పోయిన ప్రాబల్యాన్ని ఈ ఎన్నికల్లో సాధించుకునే దిశగా ముందుకు సాగుతున్నారు.



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మే 13న తెలంగాణ, ఏపీలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ పార్టీని ఓడించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆపరేషన్ ఆకర్ష్‌పై దృష్టి సారించింది. ప్రధానంగా గ్రేటర్ పరిధిలోని నాలుగు పార్లమెంట్ స్థానాలకు మూడింటిలో కాంగ్రెస్ జెండాను ఎగురవేసేందుకు తీవ్రంగా కసరత్తు చేస్తోంది. ఈ మేరకు ఇతర పార్టీలకు చెందిన బలమైన నేతలతోపాటు ద్వితీయ శ్రేణి కేడర్‌ను తమ వైపు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల బీఆర్‌ఎస్ చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ విజయలక్ష్మితోపాటు మరికొందరు పార్టీ ముఖ్య నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. ఇదే సమయంలో మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాల్లోని నాయకులను కూడా తమ పార్టీలోకి తీసుకొచ్చేందుకు చకాచకా పావులు కదుపుతున్నారు. ఇటీవల నిజాంపేట్ మేయర్‌తోపాటు తొమ్మిది మంది కార్పొరేటర్లను చేర్చుకున్నారు. తాజాగా బీజేపీ రాష్ట్ర నాయకుడు, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ డీలా..!

గతేడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క స్థానాన్ని కూడా దక్కించుకోలేకపోయింది. ప్రధానంగా కుత్బుల్లాపూర్ లాంటి నియోజకవర్గంలో మూడోస్థానానికి పరిమితమైంది. ఇక్కడ బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద 85,576 వేల భారీ మెజార్టీతో గెలుపొందారు. ఈ తరుణంలో సీఎంగా రేవంత్‌రెడ్డి.. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని కుత్బుల్లాపూర్‌ను టార్గెట్‌గా పెట్టుకుని పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ అసెంబ్లీ సెగ్మెంట్‌లోని బీఆర్‌ఎస్ ముఖ్యనాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం ద్వారా పార్లమెంట్ ఎన్నికల్లో తమ పార్టీకి పెద్ద ఎత్తున ప్రయోజనం చేకూరుతోందని భావిస్తున్నారు. కాగా, ఇక్కడ ఆపరేషన్ ఆకర్ష్ బాధ్యతలను మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావుకు అప్పగించారు. ఇదిలా ఉండగా, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌పై కూడా కాంగ్రెస్ నాయకులు ఫోకస్ పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీలను కూడా తమ ఖాతాలో వేసుకునేందుకు ముందుకు సాగుతున్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్‌లో పార్టీల వారీగా ఓట్లు..

నియోజకవర్గం	బీఆర్‌ఎస్	బీజేపీ/జనసేన	కాంగ్రెస్
కంటోన్మెంట్	59,057	41,888	20,825
మల్కాజిగిరి	1,25,049	55,427	75,519
మేడ్చల్	1,86,017	50,535	1,52,598
కుత్బుల్లాపూర్	1,87,999	1,02,423	1,01,554
కూకట్‌పల్లి	1,35,635	39,830	65,248
ఎల్‌బీనగర్	1,11,380	89,075	83,273
ఉప్పల్	1,32,927	47,332	83,897

మజ్లిస్ ఉక్కిరి బిక్కిరి

- హైదరాబాద్ పార్లమెంటులో గెలుపు కోసం తీవ్రంగా కసరత్తు
- బలమైన అభ్యర్థిని దించకుండా కాంగ్రెస్‌పై ఒత్తిడి

హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : నాలుగు దశాబ్దాలుగా అప్రతిహతంగా హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి విజయం సాధిస్తూ వస్తున్న మజ్లిస్ పార్టీ ఈసారి గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోంది. జాతీయ స్థాయిలో.. రాష్ట్రంలో మారిన రాజకీయ సమీకరణలతో మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. దశాబ్దకాలంగా బీఆర్‌ఎస్(టీఆర్‌ఎస్)తో కలిసి సాగిన ఒవైసీ గత శాసనసభ ఎన్నికల తర్వాత ఆ పార్టీతో తెగదెంపులు చేసుకుని కాంగ్రెస్‌కు సన్నిహితంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ స్థానం నుంచి బీజేపీ మాధవీలతను బరిలో నిలిపింది. ఆమెను ఢీకొనేందుకు అసదుద్దీన్ ఒవైసీ అస్త్రశస్త్రాలు ప్రయోగిస్తున్నారు. బస్తీల్లో తిరుగుతూ ప్రజలను కలుసుకుంటున్నారు. సాయంత్రం వేళల్లో ఇఫ్తార్ విందుల్లో పాల్గొంటున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గోషామహల్ మినహా మిగిలిన ఆరు శాసనసభ స్థానాల్లో మజ్లిస్ ఎమ్మెల్యేలు విజయం సాధించారు. అయినా పార్టీపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందనే సంకేతాలతో కాలికి బలపం కట్టుకుని తిరుగుతున్నారు. యాకుత్‌పురా, చార్మినార్, మలకపేట, చాంద్రాయణగుట్ట అసెంబ్లీ సెగ్మెంట్లలో మజ్లిస్‌పై వ్యతిరేకతను తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారు. టిక్కెట్ దక్కలేదనే కారణంగా పార్టీ కార్యకలాపాల్లో అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ముంతాజ్‌ఖాన్‌ను బుజ్జగిస్తున్నారు. ఇఫ్తార్ విందులకు స్వయంగా ఆయనను ఆహ్వానించడం గమనార్హం. పార్టీ విధానాలతో అసంతృప్తిగా ఉన్న మాజీ కార్పొరేటర్ మహ్మద్‌గౌస్‌ను మచ్చిక చేసుకున్నారు. అయినా ఆశించిన స్థాయిలో మజ్లిస్‌కు సానుకూల పరిస్థితులు కన్పించకపోవడంతో కాంగ్రెస్ పార్టీతో సన్నిహితంగా మెలగుతున్నారు. వారం, పది, రోజులుగా అసదుద్దీన్ ఒవైసీ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం నేతలు షబ్బీర్ అలీ, అజారుద్దీన్, అలీ మస్కతితో సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిసింది. హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి మైనారిటీ అభ్యర్థిని రంగంలోకి దించకుండా కాంగ్రెస్ నేతలపై ఒత్తిడి పెంచినట్టు సమాచారం. దీంతో కాంగ్రెస్ పార్టీ మైనారిటీయేతర వర్గం అభ్యర్థిని ఖరారు చేయాలని భావిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ మైనారిటీ అభ్యర్థిని రంగంలోకి దించితే ఓట్లు చీలి మజ్లిస్ బలం సన్నగిల్లుతుందని, గెలుపుపై ప్రభావం పడుతుందని అసదుద్దీన్ భావిస్తున్నారు. బీజేపీ బలమైన అభ్యర్థి మాధవీలతను రంగంలోకి దించడంతో మైనారిటీయేతర ఓట్లు గంపగుత్తగా ఆమెకు పడిన పక్షంలో ఫలితాలు తారుమారయ్యే ప్రమాదం ఉందని మజ్లిస్ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. పాతనగరంలో బీఆర్‌ఎస్‌కు అంతగా బలం లేనందున ఆ పార్టీ నుంచి పోటీ చేసే గడ్డం శ్రీనివాస్‌యాదవ్ ఆశించిన స్థాయిలో ఓట్లు పొందే అవకాశం లేదని భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ మైనారిటీ వర్గం అభ్యర్థిని రంగంలోకి దించితే వచ్చే ప్రమాదాన్ని పసిగట్టి ఒవైసీ ఆచితూచి వ్యవహరిస్తున్నారు. రంజాన్ తర్వాత ఎన్నికల ప్రచారాన్ని విస్తృతస్థాయిలో చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

మెట్రో.. రాయితీ నో

(3వ పేజీ తరువాయి)

ఆఫర్(ఎస్ఎస్ఓ)-59ను ప్రారంభించారు. ఇందులో ముందుగా ప్రయాణికుడు రూ.100తో మెట్రో స్మార్ట్‌కార్డు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. తర్వాత రూ.59తో రీచార్జి చేయించుకుంటే ప్రతీ రెండో, నాలుగో శనివారం, ప్రతీ ఆదివారంతోపాటు పబ్లిక్ హాలిడేస్‌లో మెట్రో రైళ్లలో ఎక్కడి నుంచి ఎక్కడి వరకైనా రోజంతా తిరిగే అవకాశాన్ని కల్పించారు. వీటితో పాటు ఆఫ్-పీక్ అవర్స్ ఆఫర్‌ను అమలు చేసింది. ఇందులో రద్దీ లేని సమయంలో కాంటాక్ట్ లెస్ కార్డ్(సీఎస్‌సీ)లపై 10 శాతం, డిజిటల్ క్యూఆర్ టికెట్లపై 10 శాతం రాయితీ అందించింది. అంటే ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, రాత్రి 8 నుంచి 11 గంటల వరకు కాంటాక్ట్ లెస్ కార్డుల ద్వారా చేసే బుకింగ్‌లపై ఈ రాయితీలను ఇచ్చారు. ఏప్రిల్ 1 నుంచి రాయితీలు ఎత్తేయడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అదనపు కోచ్‌లు కరువు..

నగరంలో పెరిగిన ఎండల తీవ్రతకు మెట్రో రైళ్లలో సామర్థ్యానికి మించి ప్రయాణిస్తున్నారు. ప్రధానంగా ఎల్‌బీనగర్, దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, నాగోల్, ఉప్పల్, సికింద్రాబాద్ ఈస్ట్, సికింద్రాబాద్ వెస్ట్, బేగంపేట్, అమీర్‌పేట్, పెద్దమ్మగుడి, రాయదుర్గం, హైటెక్‌సిటీ, మియాపూర్, జేఎన్‌టీయూ, కూకట్‌పల్లి, మూసాపేట్, తదితర స్టేషన్లలో ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల వరకు విపరీతమైన రద్దీ ఉంటుంది. ఆయా మార్గాల్లో అప్‌అండ్ డౌన్‌లో నడిచే ప్రతీ రైలులో ఊపిరాడని పరిస్థితి నెలకొంటుంది. ప్రతీ ఐదు నిమిషాలకోసారి రైలు వస్తున్నప్పటికీ.. వచ్చిన వెంటనే బోగీలన్నీ పూర్తిగా నిండుకుని వెళ్తున్నాయి. అయితే, ప్రస్తుతం మూడు బోగీలతో నడుస్తున్న రైలుకు అదనంగా మరో మూడు కోచ్‌లను జత చేసి నడిపించాలని ప్రయాణికులు తరచూ ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఎల్ అండ్‌టీ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నా అందుబాటులోకి తీసుకురాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. రైలులోని మూడు బోగీల్లో కిక్కిరిసి వెళ్తుండడంతోపాటు మహిళలకు కేటాయించిన అరబోగీలోకి కూడా పురుషులు చొచ్చుకు వెళ్తుండడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. అయితే, ప్రస్తుతం నడుస్తున్న 57 రైళ్లలోని 171 కోచ్‌లకు అదనంగా మరో 40 నుంచి 50 కోచ్‌లను తీసుకొచ్చి ప్రయాణికులకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామని అధికారులు ఏడాదిన్నర కాలంగా చెబుతున్నప్పటికీ అమలుకు నోచుకోవడం లేదు. నాగ్‌పూర్ నుంచి కోచ్‌లను తీసుకొచ్చేందుకు ప్రణాళికలు రూపొందించామంటున్నా నేటికీ పట్టాలెక్కని పరిస్థితి నెలకొంది.

ఆర్టీసీలో ఉచితం.. మెట్రోలో భారం..!

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించింది. నిత్యం లక్షలాది మంది మహిళలు జీరో టికెట్‌తో హాయిగా ప్రయాణిస్తున్నారు. నగర రవాణాలో అతికీలకమైన మెట్రోలో కొత్తరకం ఆఫర్లను తీసుకొచ్చి ప్రయాణికులకు మరింత అండగా నిలవాల్సిన ఎల్‌అండ్‌టీ అధికారులు ఆదాయం కోసం ఉన్నవాటిని ఎత్తివేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో కుదుర్చుకున్న ఒప్పందంలో కంటే అధిక టికెట్ చార్జీలు వసూలు చేస్తున్నప్పటికీ పట్టించుకునే వారే కరువయ్యారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, స్టేషన్ల వద్ద ఫస్ట్ మైల్, లాస్ట్ మైల్ కనెక్టివిటీని అందుబాటులో ఉంచామని చెబుతున్నప్పటికీ ఎక్కడా వాహనాలు కనిపించడంలేదు. స్టేషన్లకు ఐదు కిలోమీటర్ల సమీపంలోని ప్రజలకు మెట్రో రైడ్ యాప్ ద్వారా ఎలక్ట్రిక్ బైక్‌లు, ఆటోల ద్వారా తక్కువ ధరకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని ప్రకటించినా ఆచరణలో విఫలమవుతున్నారు. దీంతో రాత్రిపూట మెట్రో దిగిన ప్రయాణికులు తిరిగి ఆటోలు, క్యాబ్‌ల్లో కనీసం రెండు, మూడొందలు పెట్టి ఇంటికి చేరుకోవాల్సి వస్తోంది.

'రన్ ఫర్ హెల్త్' మెగా 5కే రన్


మెగా 5కే రన్‌లో వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది, టీసీఎస్ ఉద్యోగులు (ఇన్‌సెట్లో: రన్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ పవన్ గోరుకంటి)

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో 'హెల్తీ లైఫ్ స్టైల్' పై అవగాహన కోసం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ 'రన్ ఫర్ హెల్త్' పేరిట మెగా 5కే రన్ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రెసిడెంట్ రాజన్న కలిసి 5కే రన్ ప్రారంభించారు. 500 మందికి పైగా టీసీఎస్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో పాటు డాక్టర్ల బృందం, పారామెడికల్స్ సిబ్బంది రన్‌లో పాల్గొన్నారు. హైటెక్ సిటీలోని యశోద ఆస్పత్రి నుంచి ప్రారంభమై, ఐకియా మీదుగా తిరిగి యశోద ఆస్పత్రికి చేరుకుంది.

అవగాహనా లోపం.. అవస్థలు..!

(3వ పేజీ తరువాయి)

దరఖాస్తుదారులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. ఉన్నతాధికారులూ పట్టించుకోకపోవడంతో జీహెచ్‌ఎంసీలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ గందరగోళంగా మారింది. మార్గదర్శకాల్లో అస్పష్టత.. సర్కిల్ స్థాయిలో అధికారులకు వాటిపై పూర్తి అవగాహన లేకపోవడంతో పౌర సేవలకు ప్రతిబంధకంగా మారుతోంది. వాస్తవంగా ఇంటి వద్ద మరణించినా/ఆస్పత్రికి తీసుకెళ్తోన్న సమయంలో మృతిచెందినా.. హోమ్ డెత్‌గా పరిగణిస్తారు. దరఖాస్తు చేసిన అనంతరం సంబంధిత అధికారులు ఇంటి వద్దకు వచ్చి వివరాలు సేకరిస్తారు. చుట్టు పక్కల ఉండే వారి నుంచి సమాచారం తీసుకుంటారు. దాని ఆధారంగా ఇంటి వద్ద మరణించారని నిర్ధారించుకున్న అనంతరం సర్టిఫికెట్ జారీ చేస్తారు.

కేంద్ర కార్యాలయంలో నిర్లక్ష్యం..

జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో అవకతవకలకు చెక్ పెట్టేలా సరికొత్త విధానానికి జీహెచ్‌ఎంసీలో శ్రీకారం చుట్టారు. పారదర్శక పౌరసేవల కోసం అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకొచ్చారు. అయినా, నకిలీ సర్టిఫికెట్లు జారీ అవుతుండడంతో గతేడాది పలు మార్పులు చేశారు.

ఇప్పటి వరకు ఉన్న మార్గదర్శకాల ప్రకారం ఎవరైనా వ్యక్తిని ఆస్పత్రికి తీసుకెళ్తోన్న క్రమంలో మరణిస్తే.. ఇంటి వద్ద మృతిచెందినట్టుగా భావించి ఆ ప్రాంతం ఏ సర్కిల్ పరిధిలోకి వస్తుందో అక్కడే మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేస్తున్నారు. ఈ విషయంపై కొందరు ఏఎంసీలు, ఏఎంఓహెచ్‌లకు అవగాహన లేదు. సదరు అధికారులకు బాధ్యతలు అప్పగించే క్రమంలో ముందు వారికి మార్గదర్శకాలు స్పష్టంగా వివరించాలి. జీహెచ్‌ఎంసీ కేంద్ర కార్యాలయంలోని అధికారులు మాత్రం అదేం పట్టించుకోకుండా.. వికేంద్రీకరణ పేరిట ఎక్కడి పనులు అక్కడే చేయాలని ఆదేశాలు జారీ చేసి గాలికొదిలేస్తున్నారు. ఈ క్రమంలోనే అవకతవకలు జరగడంతో పాటు.. ప్రజలూ ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీంతో ప్రజలు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఇళ్లు ఉన్న సర్కిల్‌లో ఇవ్వరు.. ఆస్పత్రి ఉన్న సర్కిల్‌కు వెళ్లినా మాకు సంబంధం లేదంటున్నారు.. ఏం చేయాలని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో కేంద్ర కార్యాలయంలోని ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు.

ఒక్కొక్కటిగా హస్తగతం..!

(3వ పేజీ తరువాయి)

రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి.

బోడుప్పల్, పీర్జాదిగూడలో..

బోడుప్పల్‌లో 28 స్థానాలుండగా బీఆర్‌ఎస్ 23 చోట్ల గెలిచింది. కాంగ్రెస్ ఐదు స్థానాలు దక్కించుకుంది. గతంలోనే బీఆర్‌ఎస్‌కు చెందిన ఐదుగురు కార్పొరేటర్లు హస్తం గూటికి చేరారు. ఆదివారం మరో ఐదుగురు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీంతో కాంగ్రెస్ బలం 16కు పెరిగింది. అవిశ్వాసం పెట్టిన పక్షంలో ఇక్కడి మేయర్ స్థానం అధికార పార్టీ చేజిక్కించుకునే అవకాశం ఉంది. పీర్జాదిగూడలో 26 స్థానాలకుగాను అన్నిచోట్లా బీఆర్‌ఎస్ గెలిచింది. తాజాగా డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్‌తోపాటు 11 మంది కార్పొరేటర్లు మాడుగుల చంద్రకళ, శారదఈశ్వర్‌రెడ్డి, పప్పుల రమాదేవిభీంరెడ్డి, నవీన్‌రెడ్డి, అమర్‌సింగ్, సుమలత, సత్యనారాయణ, సరితాదేవేందర్, స్వాతికృష్ణగౌడ్, మహేశ్వరి, ప్రసన్నలక్ష్మీశ్రీధర్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు జగదీశ్వర్‌రెడ్డి, రాందాస్, ఇర్ఫాన్‌లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇప్పటికీ బీఆర్‌ఎస్ బలం 14గా ఉన్నా.. ముున్ముందు జరిగే పరిణామాలను బట్టి మేయర్ స్థానం ఎవరి సొంతం అన్నది తేలనుంది. ఆ రెండు కార్పొరేషన్ల నుంచి మరికొందరు కార్పొరేటర్లు బీఆర్‌ఎస్‌ను వీడుతారని ప్రచారం జరుగుతోంది. పీర్జాదిగూడ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు దర్గా దయాకర్‌రెడ్డి పార్టీకి రాజీనామా చేసి అధికార పార్టీలో చేరారు. దీంతో ఇక్కడ ఆ పార్టీపై తీవ్ర ప్రభావం ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వ్యూహాత్మకంగా ముందుకు..

రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. మెజార్టీ స్థానాలు కైవసం చేసుకునేందుకు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా బీఆర్‌ఎస్‌కు చెందిన మేయర్లు, కార్పొరేటర్లను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తోంది. అధికార పార్టీలో ఉంటే ఎన్నుకున్న ప్రజలకు మెరుగైన సేవ చేయవచ్చని, అభివృద్ధి చేసే అవకాశం ఎక్కువగా ఉంటుందని చెబుతోంది. శివారు ప్రాంతాల్లోని కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో బీఆర్‌ఎస్ మేయర్లు, కార్పొరేటర్లతో సంప్రదింపులు జరిపే బాధ్యతను స్థానిక నేతలకు అప్పగించింది. వారి రాయబారాలు ఫలిస్తుండడంతో ఒక్కొక్కరుగా అధికార పార్టీలోకి చేరుతున్నారు.

బోడుప్పల్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లు...

● సింగిరెడ్డి పద్మారెడ్డి ● కొత్త చందర్‌గౌడ్ ● నీసా వెంకటేష్ గౌడ్ ● భూక్యా సుమన్ ● లావణ్యశేఖర్‌రెడ్డి

మిస్ ఫైరా..? ఆత్మహత్యా..?

(3వ పేజీ తరువాయి)

సమస్యలేమైనా ఉన్నాయా? అనే కోణంలో విచారిస్తున్నామని తెలిపారు. గతేడాది (2023 ఆగస్టు 23న) ఇదే ఖబూతర్‌ఖానా ఔట్‌పోస్ట్‌లో గన్ మిస్‌ఫైర్ అయి సూర్యాపేట జిల్లాకు చెందిన భూపతి శ్రీకాంత్ అనే హెడ్‌కానిస్టేబుల్ మృతిచెందిన విషయం తెలిసిందే. అదే ఔట్‌పోస్ట్‌లో అదే తరహాలో తాజాగా మరోసారి తుపాకీ పేలి ఆర్‌ఎస్‌ఐ మృతిచెందడం చర్చనీయాంశంగా మారింది.

కెరీర్ ప్రణాళికకు వేదిక.. వేసవి

(3వ పేజీ తరువాయి)

తెలియడమే కాదు.. డబ్బు ఎలా ఖర్చు చేయాలో కూడా వారికి తెలుస్తుంది.

చుట్టుపక్కల ప్రాంతాల గురించి..

వేసవి సెలవులను వినోదాత్మకంగా ఆస్వాదించాలంటే ట్రావెలింగ్‌ను మించిన మార్గం మరోటి ఉండదు. ఎంపిక చేసుకునే ప్రదేశాలకు దగ్గరలో చారిత్రక విశిష్టత కలిగిన ప్రాంతాలు కూడా ఉంటే నేర్చుకోవడానికి మరింత ఆస్కారం ఉంటుంది.

స్మార్ట్‌ఫోన్స్ దరి చేరనీయకూడదు..

వేసవిలో ఎక్కువమంది పిల్లలు స్మార్ట్‌ఫోన్స్ లేదంటే ట్యాబ్స్‌తోనే కుస్తీపడుతుంటారు. అలా కాకుండా ఫిజికల్ యాక్టివిటీస్‌తో వారిని బిజీ చేయడం మంచిది. అలాగే పిల్లలకు పుస్తకాలను చదవడాన్ని అలవాటుగా మార్చాలి.

టీనేజర్లు ఏం చేయవచ్చంటే..

కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరచుకోవాలి..

కెరీర్‌లో రాణించాలంటే కమ్యూనికేషన్ స్కిల్స్ అతి ముఖ్యం. ఇంగ్లిష్ భాషకు ఉన్న ప్రాధాన్యం తెలిసిందే. అదే సమయంలో ఇతర విదేశీ భాషలు తెలుసుకోవడమూ మంచిదే! జర్మనీ, ఫ్రెంచ్ లాంటి భాషలు నేర్చుకోవడం వల్ల ఉపాధి అవకాశాలను కొన్ని దేశాలకే పరిమితం చేసుకుంటున్నామన్న భయం ఉండదు.

ఆనందించాలి.. కానీ చదవాలి..!

వేసవి సెలవులంటే ఆనందించడానికేనన్నది చాలామంది అభిప్రాయం. సెలవుల్లో పుస్తకం తీయకపోవడం వల్ల వెనకబడే అవకాశాలున్నాయి. అందుకే రోజూ కనీసం ఒక గంట అయినా తమకు క్లిష్టమైన సబ్జెక్ట్ ప్రాక్టీస్ చేయడం మంచిది.

ఇంటర్న్‌షిప్ చేయడం మంచిది..

కెరీర్‌పై సరైన ప్రణాళిక లేక చాలామంది ఫెయిల్ అవుతున్నారు. తమ కెరీర్‌ను మలుపు తిప్పే రంగాల్లో పార్ట్‌టైమ్ ఉద్యోగం లేదంటే ఇంటర్న్‌షిప్ చేయడం మంచిది. మీరెంచుకున్న రంగాల గురించి లోతుగా తెలుసుకునేందుకు ఇది తోడ్పడవచ్చు.

జాబ్‌స్కిల్స్ అలవడతాయి

వాలెంటరింగ్‌తో జాబ్‌స్కిల్స్ కూడా అలవడతాయి. సేవాతత్పరత మెరుగుపడడంతోపాటుగా తోటి వారితో ఎలా ఉండాలో కూడా తెలుస్తుంది.

ఆమె కృషి అడవినే సృష్టించింది

రోజుకో చెట్టు... ఇదీ కొల్లక్కయిల్ దేవకీ అమ్మ చేపట్టిన యజ్ఞం. నలభై ఏళ్ళ నుంచి ఆమె సాగిస్తున్న కృషి ఒక అడవినే సృష్టించింది. అది అరుదైన మొక్కలకు, వలస పక్షులకు నిలయంగా మారింది. తొంభయ్యేళ్ళ వయసులోనూ పర్యావరణ సంరక్షణకు, జీవవైవిధ్యానికీ పాటుపడుతూ... అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న ఒక సామాన్యురాలి కథ ఇది.



“నేను పుట్టిన ఏడాది తెలుసు. తేదీ సరిగ్గా గుర్తులేదు. కానీ ఏ మొక్కను ఎప్పుడు నాటానో మాత్రం కచ్చితంగా గుర్తుంటుంది. ఎందుకంటే అవి నా పిల్లల్లాంటివి” అంటారు కొల్లక్కయిల్ దేవకీ అమ్మ. గత నెలాఖర్లోనే ఆత్మీయుల మధ్య తొంభయ్యో పుట్టిన రోజు జరుపుకొన్న ఆమె నలభయ్యేళ్ళుగా మొక్కలు నాటే యజ్ఞాన్ని నిష్ఠగా నిర్వహిస్తున్నారు. 1934లో కేరళలోని ముత్తుకులమ్ గ్రామంలో జన్మించిన ఆమెది వ్యవసాయ కుటుంబం. ఇంగ్లీష్ టీచర్ గోపాలకృష్ణ పిళ్ళైతో వివాహం అయ్యాక కూడా... అత్తింటి వారి పొలంలో వ్యవసాయ బాధ్యతలను ఆమె తీసుకున్నారు. జీవితం సంతోషంగా సాగుతున్న సమయంలో ఆమె కారు ప్రమాదానికి గురయ్యారు. కాళ్ళు బాగా దెబ్బతినడంతో కొన్ని నెలల పాటు మంచం మీదే ఉండాల్సి వచ్చింది. ఆ తరువాత పూర్వంలా కష్టమైన పనులు చేయకూడదని వైద్యులు హెచ్చరించారు. “మొక్కలన్నా, పచ్చదనమన్నా నాకు ఎంతో ఇష్టం. ‘వ్యవసాయం వద్దంటే మరేం చెయ్యాలి?’ అని మధనపడుతున్నప్పుడు... “మొక్కలు నాటి, వాటిని పెంచు” అని నా భర్త సూచించారు. మా పెరట్లోనే దానికి శ్రీకారం చుట్టాను. నా భర్త ఎక్కడికి వెళ్ళినా కొత్త రకం మొక్కలను, విత్తనాలను తీసుకువచ్చేవారు. వాటిని నాటడం, సంరక్షించడం ఎంతో సంతోషంగా అనిపించేది. దాంతో దాదాపు నాలుగు దశాబ్దాలుగా కొనసాగిస్తున్నాను” అని చెబుతారు దేవకి. తమ అయిదు ఎకరాల స్థలంలో... రోజుకు కనీసం ఒక్క మొక్కయినా ఆమె నాటుతున్నారు. మామిడి, చింత, వేప, మద్ది లాంటి 200కు పైగా రకాల మొక్కలు, చెట్లు దాదాపు అయిదు వేల వరకూ ఆమె పెంపకంలో సేదతీరుతున్నాయి. కనీసం వెయ్యి మొక్కలు, చెట్లు పండ్లను, కూరగాయలను, పూలను అందిస్తున్నాయి.

అరుదైన అతిథుల కోసం...

దేవకీ అమ్మలో అభినందనీయమైన మరో అంశం... పర్యావరణ స్పృహ. “నా చిన్నప్పుడు ఎక్కడ చూసినా పచ్చదనం ఉండేది. నీటి కరువు మాట వినిపించేది కాదు. మార్కెట్లో కాయగూరలు కొనడం చాలా తక్కువ. ఇప్పుడు పరిస్థితులన్నీ మారిపోయాయి. రసాయన ఎరువులు, పురుగుల మందులు వినియోగించి పండించే పంటల్లో నాణ్యత లేదు. అందుకే కొత్త కొత్త రోగాలు పుట్టుకొస్తున్నాయి” అంటారామె. తన తోటలో పూర్తిగా పర్యావరణ అనుకూలమైన పద్ధతుల్నే ఆమె పాటిస్తారు. చెట్ల కోసం సేంద్రియమైన ఎరువుల్నే ఉపయోగిస్తారు. ఆమె వనాన్ని పలు పక్షులు తమ నివాసంగా చేసుకున్నాయి. వాటిలో దేశీయమైనవే కాదు... వలస పక్షులు కూడా ప్రతి సీజన్లో అక్కడికి వచ్చి విడిది చేస్తాయి. వాటి కోసం ఆమె గూళ్ళను ఏర్పాటు చేశారు. మంచి నీరు అందుబాటులో ఉంచారు. “అవి నా తోటకు వచ్చే అరుదైన అతిథులు. వాటిలో అంతరించిపోయే ప్రమాదం ఉన్న జాతులు కూడా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. వాటి బాగోగులు చూసుకోవడం నా విధి కదా!” అని అంటారు దేవకి. వర్షపు నీటి సంరక్షణ కోసం కూడా ఆమె పలు చర్యలు చేపట్టారు. “దేవకీ అమ్మ తన తోటను ఒక అభయారణ్యంగా తీర్చిదిద్దారు. ఏక వ్యక్తి సైన్యంలా ఆమె సాగించిన పర్యావరణ పరిరక్షణ ఈ ప్రాంతంలో జీవవైవిధ్యానికి దోహదం చేస్తోంది” అని స్థానిక అధికారులు ప్రశంసిస్తున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులను, పరిశోధకులను, సోషల్ ఫారెస్ట్రీ గురించి తెలుసుకోవాలనే ఆసక్తి ఉన్న పర్యాటకులను దేవకీ ఉద్యానవనం ఆకర్షిస్తోంది. ప్రకృతి ప్రేమికులు, వృక్ష, పక్షి శాస్త్రవేత్తలు తరచూ దాన్ని సందర్శిస్తూ ఉంటారు.

బాధ్యతే కాదు... ఉత్సవం కూడా...



ఇప్పటికీ ప్రతిరోజూ కొంతసేపైనా తను పెంచిన అడవిలాంటి తోటలో గడుపుతారు దేవకి. “కొన్నేళ్ళ క్రితం వరకూ నా భర్త, నేను ఎక్కువ సమయం తోటలోనే ఉండేవాళ్ళం. ఆయన మరణించాక నా కుటుంబ సభ్యులు, స్నేహితుల సాయంతో పనులు నడిపించేదాన్ని. వయసు మీద పడడంతో నాకు ఓపిక తగ్గింది. నా మనుమలు, మునిమనుమలు ఆ బాధ్యతలు చూస్తున్నారు. కానీ ఇప్పటికీ రోజుకు ఒక మొక్కయినా నాటడం మాత్రం మానలేదు” అని చెబుతున్నారు దేవకి. “మా అమ్మ ప్రారంభించిన ప్రయాణాన్ని... ఆమెతో సహా నాలుగు తరాలవాళ్ళం కొనసాగిస్తున్నాం. బడికి సెలవులు ఇచ్చినప్పుడల్లా... మేము, మా పిల్లలు, ఇప్పుడు వాళ్ళ పిల్లలు అమ్మ దగ్గరకు రావడం, పాత మొక్కలు ఎలా ఎదుగుతున్నాయో చూడడం, కొత్తవి నాటడం ఆనవాయితీ అయిపోయింది. అమ్మ దాన్ని మా జీవితంలో ఒక భాగం చేశారు. మొక్కల పెంపకం మాకు అభిరుచి, బాధ్యత మాత్రమే కాదు... ఒక పెద్ద ఉత్సవం కూడా” అంటారు దేవకీ అమ్మ కుమార్తె ప్రొఫెసర్ తంగమణి. దేవకీ చేసిన కృషికి కేంద్ర ప్రభుత్వం నుంచి ‘నారీ శక్తి’ అవార్డు, కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ నుంచి ‘ఇందిరా ప్రియదర్శిని విశ్వమిత్ర’ అవార్డుతో సహా పలు రాష్ట్ర, జాతీయ స్థాయి పురస్కారాలు లభించాయి. దేవకీ అమ్మ పర్యావరణ శాస్త్రవేత్త కాదు, ఉద్యమకారిణీ కాదు. ఒక మామూలు మనిషి. కానీ నేల తల్లి పచ్చగా ఉండాలని కలలు కన్నారు. దాని కోసం చేయగలిగింది చేస్తున్నారు. అడవులు చాలా వేగంగా కనుమరుగవుతున్న కాలంలో... ప్రకృతిని కాపాడుకోడానికి తమ వంతు ప్రయత్నం చేయాలనే స్ఫూర్తిని తన కథ కొందరిలోనయినా కలిగించాలనేది ఆమె ఆకాంక్ష.

కళ

స్వరాలు... ఆమె గొంతులో అద్భుత గానమవుతాయి. వయొలిన్ తీగలు... ఆమె చేతిలో కమ్మగా శృతి చేసుకొంటాయి. సంగీతంతో అయిదు పదులు దాటిన ప్రయాణం. మంగళంపల్లి వంటి ఉద్దండుల మార్గదర్శనం. డెబ్బై ఏళ్ళు పైబడిన వయసులోనూ... తరగని స్వర నీరాజనం. తాడేపల్లి సుబ్బలక్ష్మి... ప్రముఖులెందరితోనో కలిసి వేదిక పంచుకున్న ఆమె... తన అనుభవాలను ‘నవ్య’తో ఇలా చెప్పుకొచ్చారు.



సంగీతమే ప్రపంచం

“అప్పుడు నాకు ఐదేళ్లు ఉంటాయనుకుంటా. ప్రముఖ గాయకుడు మాధవపెద్ది సత్యం గారి వదిన మీనాక్షి... విజయవాడ సత్యనారాయణపురంలోని మా ఇంటి దగ్గర ఉండేవారు. ఆవిడ నాకు సంగీతం నేర్పించేవారు. మా అక్కయ్యవాళ్లతో కలిసి వెళ్లేదాన్ని. చదువు మీద ఏ మాత్రం ఆసక్తి ఉండేది కాదు. సంగీత విద్వాంసుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారిది మా వెనక వీధే. మా నాన్నకు ఆయన బాగా పరిచయం. ఒక రోజు నన్ను ఆయన దగ్గరు తీసుకువెళ్లి... ‘మా అమ్మాయి బడికి వెళ్లడంలేదు. ఎప్పుడు చూసినా సంగీతమే అంటోంది. ఏం చేయమంటారు’ అని నాన్న అడిగారు. అప్పుడే విజయవాడలో సంగీత కళాశాల ప్రారంభించారు. ఆ కళాశాల నెలకొల్పడంలో బాలమురళీ గారి కృషి ప్రముఖమైనది. ఆయన సూచనతో నాన్న నన్ను సంగీత కళాశాలలో చేర్పించారు. అది కూడా గాత్రంలో కాదు... వయొలిన్‌లో. వయొలిన్‌లో చేర్చమని చెప్పింది బాలమురళీ గారేనట. ఎందుకంటే ‘ఆమె గొంతు బాగుంది. వయొలిన్ నేర్చుకొంటే వోకల్ కూడా బాగా వస్తుంది. సంగీత ధర్మాలు తెలుస్తాయి’ అని అన్నారట. అలా మా గురువు ఆకెళ్ల మల్లికార్జునశర్మ గారి శిష్యరికంలో వయొలిన్ అభ్యాసం మొదలుపెట్టా. ఇదంతా 1956-57ల్లో సంగతి. చిన్న వయసు కావడంతో వయొలిన్‌పై వేళ్లు కూడా సరిగ్గా అందేవి కాదు. అలాంటిది ఏడాది తిరక్కుండానే కళాశాలలో అందరి కంటే ముందుండేదాన్ని. ఎప్పుడూ బహుమతులు తెచ్చుకొనేదాన్ని. తరువాత కోటిపల్లి ప్రకాశరావు, నేదునూరి కృష్ణమూర్తి, ఎంవీ రమణమూర్తి గార్ల వద్ద కర్ణాటక సంగీతంలో సూక్ష్మ మెలకువలు, బేధాలు నేర్చుకున్నాను. వారందరి ప్రోత్సాహంతో ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి గాత్రం, వయొలిన్ డిప్లమోలు అందుకున్నాను.



రాష్ట్రపతి నుంచి సత్కారం...

వివిధ వేదికలతో పాటు రాజ్‌భవన్‌లో కూడా నేను చాలా సార్లు పాడాను. కేఆర్ నారాయణ్ గారు రాష్ట్రపతిగా ఉన్నపుడు రాజ్‌భవన్‌లో ఆయన ఎదుట కచేరీ ఇచ్చాను. అనంతరం ఆయన నన్ను ప్రత్యేకంగా సత్కరించారు. అలాగే రిజర్వ్ బ్యాంకు మాజీ గవర్నర్ సి.రంగరాజన్ గారు తదితర ప్రముఖుల నుంచి ఎన్నో సత్కారాలు, సన్మానాలు అందుకున్నాను. అవన్నీ నాకు కాదు... నాలోని కళాకారిణికి దక్కిన గౌరవాలు. మన సంప్రదాయ సంగీతానికి ముగ్ధులై ఆహూతులు కొట్టే కరతాళ ధ్వనులు నాకు ఎంతో ప్రేరణనిస్తాయి. ఎంతో గొప్పగా అనిపిస్తాయి. ఈ ప్రయాణంలో శోభానాయుడు, అలేఖ్య పుంజల, ఉమారమ, వనజ ఉదయ్ తదితర ప్రముఖ నర్తకీమణులతో నాకు మంచి సంబంధాలు ఏర్పడ్డాయి. వారి నాట్య ప్రదర్శనలకు గాత్రం అందించే భాగ్యం నాకు కలిగింది. వాళ్లతో దాదాపు అన్ని దేశాలూ తిరిగాను.

బాలభవన్‌తో మొదలు...

చిన్న వయసులోనే వయొలిన్, గాత్ర సంగీతంలో కచేరీలు ఇవ్వడం మొదలుపెట్టాను. విజయవాడలో ఉన్నప్పుడే చాలా కచేరీలు చేశాను. తరువాత మా నివాసం హైదరాబాద్‌కు మారింది. 1985 నుంచి 92 వరకు ఇక్కడి ‘జవహర్ బాలభవన్’లో వయొలిన్ ఇన్‌స్ట్రక్టర్‌గా పని చేశాను. అదే నా తొలి ఉద్యోగం. ఒక పక్క గాత్ర సంగీతం, వయొలిన్ కచేరీలతో పాటు కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలకు గాత్ర సాయం చేసేదాన్ని. అలా గాత్రసాయం చేసేవారిని ‘గాయక్ అసిస్టెంట్’ అంటారు. మొదట్లో నేను, రేడియో ఆర్టిస్ట్ మల్లిక్ గారు కలిసి పాడేవాళ్లం. అదే సమయంలో కోఠి సంగీత కళాశాలలో గాయక్ అసిస్టెంట్ పోస్టు ఖాళీ అయింది. అందులో చేరిన కొన్నేళ్లకు వయొలిన్ లెక్చరర్‌గా ప్రమోషన్ వచ్చింది.

దేశవిదేశాల్లో కచేరీలు...

ఒక పక్క ఉద్యోగం చేస్తూనే కచేరీలు కూడా ఇచ్చేదాన్ని. ముఖ్యంగా హైదరాబాద్‌కు నివాసం మారిన తరువాత కార్యక్రమాలు అధికమయ్యాయి. ‘ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ కల్చరల్ రిలేషన్స్’ తరఫున అమెరికా, లెబనాన్, టర్కీ, సిరియా, దక్షిణాఫ్రికా, జాంబియా, జింబాబ్వే, శ్రీలంక, గ్రీస్, సింగపూర్ తదితర దేశాల్లో పర్యటించే అవకాశం దక్కింది. విదేశీ గడ్డపై నిర్వహించిన ఉత్సవాల్లో పాల్గొని... మన సంప్రదాయ సంగీత మధురిమను వారికి పరిచయం చేయడం నిజంగా మధురానుభూతి. ప్రపంచ తెలుగు మహాసభలతో పాటు కాళిదాస్ సమారోహ్, కోణార్క్, సూర్య ఫెస్టివల్స్‌లో, తిరుమల, బెజవాడ కనకదుర్గ తదితర ప్రముఖ ఆలయాల్లో ప్రదర్శనలు ఇచ్చే అదృష్టం నాకు కలిగింది. సాంస్కృతిక శాఖ నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నాను. సి.నారాయణరెడ్డి గారు అయితే నన్ను చూసినప్పుడల్లా... ‘అమ్మా... సుబ్బలక్ష్మి గారు... ఇంకా వయొలిన్ వాయిస్తున్నారా’ అనేవారు. నా చదువు మెట్రిక్యులేషన్‌తోనే ఆగిపోయినా... సంగీతం నన్ను ఎంతో ఉన్నతంగా నిలబెట్టింది. కొన్ని వందల కార్యక్రమాల్లో స్వర నీరాజనం చేసే అదృష్టం నాకు కలిగింది.

సంగీత విద్యాలయం...

నేను 2008లో పదవీ విరమణ పొందిన తరువాత ‘బిట్స్ పిలానీ’లో నాలుగైదేళ్లు పని చేశాను. నాలాగా మరింతమందిని శాస్త్రీయ సంగీతం వైపు ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో 2009లో నేను, మావారు ఉమాశంకర్ కలిసి ‘వాగ్దేవి సంగీత విద్యాలయం’ ప్రారంభించాం... మా ఇంట్లోనే! మావారు కూడా కళాకారుడే. చక్కగా పాడతారు. వయొలిన్ వాయిస్తారు. ఉద్యోగం చేస్తూనే సంగీతం కొనసాగించారు. మేమిద్దరం కలిసి చాలా కచేరీలు ఇచ్చాం. కొన్ని భక్తి గీతాల ఆల్బమ్స్‌కు సంగీతం అందించాం. మా ఇద్దరి మార్గం ఒకటే కావడంతో సంగీత విద్యాలయం నెలకొల్పాం. దీని ద్వారా ఇప్పటివరకు వందల మందికి శిక్షణ ఇచ్చాం. ప్రస్తుతం యాభై మంది మా దగ్గర సంగీత సాధన చేస్తున్నారు. భద్రాచలం, తిరుమల, యాదగిరిగుట్ట తదితర ప్రసిద్ధ ఆలయాల్లో నిర్వహించే ‘నాద నీరాజనం’లో మా విద్యార్థులతో కలిసి వేదిక పంచుకున్నాను. అది వారి భవిష్యత్తుకు మంచి పునాదిగా మారుతుందనే ఉద్దేశం. కొందరు విద్యార్థులైతే సొంతంగా అకాడమీలు పెట్టుకున్నారు.

ఎన్టీఆర్ అద్భుతమైన డ్యాన్సర్...

చిన్నప్పుడు జూనియర్ ఎన్టీఆర్ ఎన్నో నాట్య ప్రదర్శనలు ఇచ్చాడు. అతని నాట్యానికి నేను గాత్రం అందించేదాన్ని. అతను ఎంతో అద్భుతంగా డ్యాన్స్ చేసేవాడు. ప్రతి కార్యక్రమానికీ వెంట వాళ్ల అమ్మ షాలిని గారు వచ్చేవారు. జూనియర్ ఎన్టీఆర్ చివరి నాట్య ప్రదర్శనకు కూడా నేనే పాడాను. మద్రాసు తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిందా కార్యక్రమం. కొన్నిటికైతే వయొలిన్, గాత్రం రెండూ నేనే. అతను చాలా మంచి పిల్లవాడు. పెద్దలను గౌరవించేవాడు. కానీ తెగ అల్లరి చేసేవాడు. నన్ను ‘సుబ్బలక్ష్మి గారూ’ అనేవాడు. అప్పట్లో నల్లకుంట శంకరమఠం వెనకాల వాళ్ల ఇల్లు. రిహార్సల్స్ కోసం వాళ్లింటికి వెళ్లేదాన్ని. తిరిగి వచ్చేటప్పుడు ‘నేనూ వస్తా ఉండండి’ అంటూ నా వయొలిన్ పట్టుకుని, ఆటో మాట్లాడి మరీ నన్ను పంపించేవాడు. వాళ్లమ్మగారు చాలా మంచి వ్యక్తి. నేనే కాదు, మా పిల్లలందరూ వాళ్లకు బాగా తెలుసు. తరువాత మెహదీపట్నంలో ఇల్లు కొనుక్కొని వెళ్లిపోయారు. అయితే అతను హీరో అయ్యాక మళ్లీ కలవలేదు. జూనియర్ ఎన్టీఆర్ ఎంత అల్లరి చేసినా... డ్యాన్స్ దగ్గరకు వచ్చేసరికి దున్నేసేవాడు. వాళ్ల తాతయ్య ఎన్టీ రామారావు గారి సినిమాలో మయసభ సన్నివేశం డైలాగులు గుక్క తిప్పుకోకుండా చెప్పేవాడు.



బాలమురళీ గారి పక్కన...

ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో మధుర జ్ఞాపకాలు. అన్నిటికంటే తీపి జ్ఞాపకం... మంగళంపల్లి బాలమురళీ గారి కచేరీకి నేను వయొలిన్ వాయించడం. నాకు పదకొండేళ్లు వచ్చేసరికి ఆయన మద్రాసు వెళ్లిపోయారు. ఆ తరువాత ఎన్నో ఏళ్లకు ఆయన సమక్షంలో నా విద్య ప్రదర్శించే అవకాశం లభించింది. అదీ అనూహ్యంగా. సింగపూర్‌లో తెలుగు మహాసభలకు వనజ గారితో గాయక్ అసిస్టెంట్‌గా వెళ్లాను. అయితే బాలమురళీ గారు తన కచేరీకి మాట్లాడుకున్న వయొలిన్ కళాకారుడు రాలేదు. ‘హైదరాబాద్ నుంచి ఒకావిడ వచ్చారండి. ఆవిడ వయొలినిస్ట్’ అని నిర్వాహకులు ఆయనకు చెప్పారు. బాలమురళీ గారు ‘ఆవిడను వెంటనే రమ్మనండి’ అన్నారు. వెళితే... ‘నా పక్కన వయొలిన్ వాయించమ్మా’ అన్నారు. నాకు కంగారు పుట్టింది. ‘మీ పక్కన కూర్చొని వయొలిన్ వాయించగలనా? నేను చిన్నప్పుడు మీ విద్యార్థిని’ అని గుర్తు చేశాను. ‘మీ నాన్న, పెదనాన్న అందరూ తెలుసులే. నువ్వేం భయపడక్కర్లేదు’ అని ధైర్యం చెప్పారు. ఆ ధైర్యంతో తడబాటు లేకుండా వాయించి ఆయన ప్రశంసలు అందుకున్నాను.

త్యాగరాజ ఆరాధనోత్సవాలు...

మా విద్యాలయానికి వచ్చేవారిలో డబ్బు ఇవ్వగలిగినవారి నుంచే ఫీజు తీసుకొంటాను. సంగీతాభిరుచి కలిగి, డబ్బు ఇవ్వలేనివారికి ఉచితంగానే నేర్పిస్తున్నాను. అలాగే ఏటా మా సొంత ఖర్చులతో ‘త్యాగరాజ ఆరాధనోత్సవాలు’ నిర్వహిస్తున్నాం. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి కళాకారులు పంచరత్నాలు పాడతారు. అలాగే ‘థిల్లానా’ పేరుతో యూట్యూబ్ చానల్ ప్రారంభించి, దాని ద్వారా సంగీతం నేర్పే ప్రయత్నం చేస్తున్నాను. అరవై ఏళ్లకు పైగా సంగీతంతోనే కలిసి, సంగీతమే ప్రపంచంగా ప్రయాణిస్తున్నాను. ఇది నాకు కలిగిన అదృష్టంగా భావిస్తున్నాను.”

● హనుమా

నవ్య | చిత్రజ్యోతి



మరోసారి ‘మా’ అధ్యక్షుడిగా

మా (మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) అధ్యక్ష పదవిలో మంచు విష్ణు తాత్కాలికంగా మరి కొంతకాలం కొనసాగనున్నారు. ఈ మేరకు ఆదివారంనాడు జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఒక నిర్ణయం తీసుకున్నామని ‘మా’ ఉపాధ్యక్షులు మాదాల రవి తెలియజేశారు. ‘మా’ అసోసియేషన్ ఫండ్ రైజింగ్ కోసం జూలైలో మలేసియాలో ఒక ఈవెంట్ నిర్వహిస్తున్నామని, అదేవిధంగా ‘మా’ కోసం ప్రత్యేక భవంతిని నిర్మించడానికి సన్నాహాలు ప్రారంభించామని, అప్పటి వరకు మంచు విష్ణుని అధ్యక్షుడుగా ప్రస్తుతం ఉన్న కార్యవర్గం సహా కొనసాగాలని జనరల్ బాడీ తీర్మానించిందని ఆయన తెలియజేశారు. 2021 అక్టోబర్‌లో జరిగిన ‘మా’ ఎన్నికల్లో ప్రకాశ్‌రాజ్ పై విష్ణు గెలుపొందారు. రెండేళ్లకోసారి ‘మా’ ఎన్నికలు నిర్వహిస్తారు. ఆ ప్రకారం గతేడాది సెప్టెంబర్‌లోనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. కానీ ఈ ఏడాది మే నెలకు కమిటీ ఎన్నికలను వాయిదా వేశారు. ఇంకో నెలలో ఎన్నికలకు సిద్ధమవ్వాల్సిన తరుణంలో ‘మా’ జనరల్ బాడీ ఈ నిర్ణయం తీసుకుంది.



సేనాపతి రాకకు సిద్ధం

కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన ‘ఇండియన్’ (తెలుగులో ‘భారతీయుడు’) చిత్రం సంచలన విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. వీరిద్దరి కలయికలో ఆ చిత్రానికి సీక్వెల్‌గా ‘ఇండియన్ 2’ రూపొందుతోంది. సుభాస్కరన్ నిర్మాత. ఈ చిత్రాన్ని జూన్‌లో విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో సేనాపతిగా కమల్‌హాసన్ సీరియస్ లుక్‌లో కనిపించారు. ‘తప్పును అస్సలు భరించలేను’ అని పోస్టర్‌పై రాసి ఉన్న వాక్యం సినిమాపై అంచనాలు మరింత పెంచింది. ఈ చిత్రంలో సిద్ధార్థ్, కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్‌సింగ్, ప్రియా భవానీ శంకర్, ఎస్.జే సూర్య కీలకపాత్రలు పోషిస్తున్నారు. అనిరుద్ రవిచంద్రన్ సంగీతాన్ని అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రవివర్మన్



నేడు జాతీయ ఉత్తమ నటుడు అల్లు అర్జున్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా ‘పుష్ప 2: ది రూల్’ చిత్రం నుంచి స్పెషల్ లుక్‌ను ఆదివారం యూనిట్ విడుదల చేసింది. అలాగే ఈ రోజు ‘పుష్ప 2’ టీజర్‌ను విడుదల చేస్తున్నట్లు నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ తెలిపాయి.

రాధిక తరహాలో జానకి



అశ్విని శ్రీ ప్రధాన పాత్ర పోషిస్తున్న లేడీ ఓరియంటెడ్ చిత్రం ‘మిస్ జానకి’. ఇటీవలే పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తం షాట్‌కు నిర్మాత సీ కల్యాణ్ క్లాప్ ఇచ్చారు. సతీశ్ కుమార్ దర్శకత్వంలో నాగరాజు నెక్కంటి నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ‘ఈ నెల 20 నుంచి రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభిస్తాం. రెండు షెడ్యూల్స్‌లో చిత్రీకరణ పూర్తిచేస్తాం’ అన్నారు. ‘ఈ చిత్రంతో హీరోయిన్‌కు మంచి పేరు వస్తుంది. ‘డీజే టిల్లు’ చిత్రంలో రాధిక తరహాలో అశ్విని శ్రీ పాత్ర కూడా ప్రేక్షకులను అలరిస్తుంది’ అని దర్శకుడు చెప్పారు. అలీ, తనికెళ్ల భరణి, చిత్రం శ్రీను కీలకపాత్రలు పోషిస్తున్నారు. శ్రీ వసంత్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: లక్ష్మీ కుమార్

దసరాకు వస్తున్న వేటగాడు



రజనీకాంత్ కథానాయకుడిగా ‘జై భీమ్’ ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం ‘వేట్టయాన్’. లైకా ప్రొడక్షన్స్ బేనర్‌పై సుభాస్కరన్ భారీస్థాయిలో నిర్మిస్తున్నారు. అమితాబ్‌బచ్చన్, ఫహాద్ ఫాజిల్, రానా కీలకపాత్రలు పోషిస్తున్నారు. మేకర్స్ ఈ చిత్రం రిలీజ్ డేట్ అప్డేట్‌ను ఇచ్చారు. దసరా సందర్భంగా అక్టోబర్‌లో ‘వేట్టయాన్’ చిత్రాన్ని విడుదల చేయబోతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రివాల్వర్ గురిపెట్టిన రజనీకాంత్ స్టిల్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచందర్

శబరి రాక అప్పుడే



వరలక్ష్మీ శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం ‘శబరి’. అనిల్ కాట్జ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మహేంద్రనాథ్ కూండ్ల నిర్మాత. ‘శబరి’ విడుదల తేదీ ఖరారైంది. మే 3న ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ సహా పలు భారతీయ భాషల్లో విడుదల చేస్తున్నట్టు ఆదివారం మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ “శబరి’ కథ, కథనం కొత్తగా ఉంటాయి. ఎమోషనల్ థ్రిల్లర్. వరలక్ష్మీ శరత్‌కుమార్ గత చిత్రాలకు భిన్నంగా ఉంటుంది. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే చిత్రమిది’ అన్నారు. సునయన, వైవా హర్ష, భద్రం కీలకపాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: గోపీసుందర్, సినిమాటోగ్రఫీ: రాహుల్ శ్రీవాత్సవ

నెగెటివ్ ప్రచారంపై పోలీసులకు ఫిర్యాదు



విజయ్‌దేవరకొండ హీరోగా నటించిన ‘ఫ్యామిలీ స్టార్’ సినిమా ఇటీవలే విడుదలై మంచి టాక్‌తో దూసుకుపోతోంది. కాగా, ఈ సినిమా ఏమాత్రం బాలేదని కొందరు సోషల్ మీడియాలో నెగెటివ్ ప్రచారం చేస్తున్నారు. ఈ సినిమాపై ఇలా దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని విజయ్‌దేవరకొండ పర్సనల్ మేనేజర్ అనురాగ్ పర్వతనేని, ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నిషాంత్‌కుమార్ కలసి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొందరు కావాలనే ఇలా నెగెటివ్ ప్రచారం చేయడం వల్ల సినిమా వసూళ్లపై ప్రభావం పడుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసుని విచారించి నిందితులని పట్టుకుంటామని పోలీసులు హామీ ఇచ్చారు.

టీఎస్‌పీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

నదులు-భూ స్వరూపాలు


నది క్రమక్షయ భూస్వరూపాలు

నదుల క్రమక్షయం, నిక్షేపణల మూలంగా మూడు దశల్లో భూస్వరూపాలు ఏర్పడతాయి. అవి యవ్వన దశలో ఏర్పడే భూస్వరూపాలు, ప్రౌఢ దశలో ఏర్పడే భూస్వరూపాలు, వృద్ధ దశలో ఏర్పడే భూస్వరూపాలు.

యవ్వన దశలో ఏర్పడే భూస్వరూపాలు

'V' ఆకారపు లోయ

నది ఎగువ భాగం అంటే యవ్వన దశలలో ఉన్నపుడు దాని ముఖ్య కార్యక్రమం 'క్రమక్షయం'. ఈ దశలో పక్క కోత కంటే అధోముఖ కోత ఎక్కువగా ఉండడం వల్ల నది లోయ పెరుగుతుంది. దాని అడ్డుకోత ఆకృతి 'V' అక్షరాన్ని పోలి ఉంటుంది. అంటే లోతు అధికంగా ఉండి వెడల్పు తక్కువగా ఉండే నదిలోయలు ఏర్పడతాయి. 'V' ఆకారపు లోయల్లో గార్జ్, అగాధ ధరులు అనే రెండు రకాలు ఉంటాయి.





గార్జ్: నదులు ప్రవహించే లోయను మరింత లోతుగా, వెడల్పుగా పెంచడం వల్ల నదికి ఇరువైపులా నిట్ట నిలువు గోడలు ఏర్పడే భూస్వరూపాన్నే గార్జ్ అంటారు. అధోముఖ క్రమక్షయం తోపాటు పక్క కోత క్రమక్షయం కూడా చోటు చేసుకున్నపుడు 'V' ఆకారపు లోయ గార్జ్‌గా మారుతుంది. దీని విస్తృతి పరిమిత స్థాయిలోనే ఉంటుంది.

ఉదా: చెబాయ్ గార్జ్-బీహార్ నది(బిహార్), బైసన్ గార్జ్-గోదావరి నది(తెలంగాణ), కొలరాడో గార్జ్-కొలరాడో నది (యూఎస్ఏ)

అగాధధరులు: గార్జ్ విస్తృత రూపమే అగాధ ధరులు. అధోముఖ కోత ఎక్కువగా ఉన్నపుడు ఏర్పడే ఎత్తైన గోడలు, లోతైన పొడవైన నది లోయను అగాధధరులు అంటారు. అధోముఖ, పక్క కోతలు రెండూ సమానంగా ఉన్నపుడు అగాధధరులు ఏర్పడతాయి. అమెరికాలోని కొలరాడో నదిపై ఉన్న 'గ్రాండ్ కాన్యాన్' ప్రపంచంలోనే అతి పెద్దది. దీని లోయ సుమారు 2 కి.మీ కాగా పొడవు 482 కి.మీ. సింధూ నది కూడా హిమాలయాల్లో ప్రవహిస్తూ 17000 అడుగుల లోయ గల గార్జ్, అగాధధరిని ఏర్పరుస్తుంది. పెన్నానది ఆంధ్రప్రదేశ్‌లోని ఎర్రమల కొండల్లో 'గండికోట గార్జ్'ను ఏర్పాటు చేస్తోంది. దీనిని ద గ్రేట్ క్యాన్యన్ ఆఫ్ ఇండియా అని పిలుస్తారు.

పాట్ హోల్స్

నది ప్రవాహ వేగం ఎక్కువగా ఉన్నపుడు నది నీరు సుడులు తిరుగుతూ ప్రవహిస్తుంది. పదునైన రాళ్లు ఆ సుడుల్లో ఇరుక్కొని నది గర్భంలో గుండ్రని గుంటలను ఏర్పరుస్తాయి. వీటినే పాట్ హోల్స్ అంటారు. పాట్ హోల్స్ వ్యాసం కొన్ని సెం.మీల నుంచి పదుల మీటర్ల వరకు ఉంటుంది. అయితే వీటి లోతు మాత్రం వ్యాసం కంటే అధికంగా ఉంటుంది.

రాతి బల్లులు

మృదు, కఠిన శిలలు ఒకదానిపై ఒకటి క్షితిజ సమాంతరంగా అమరి ఉన్నపుడు ప్రవాహవేగానికి మృదుశిల క్రమక్షయం చెందగా మిగిలిన కఠినశిల బల్ల వలె బయటకు కనిపిస్తుంది. దీనినే 'రాతి బల్ల'గా పిలుస్తారు.

జలపాతాలు

మృదు, కఠినశిలలు ఒక క్రమ పద్ధతిలో ఒకదాని కింద మరొకటి అమరి ఉన్నపుడు అవి క్రమక్షయం చెందడంలో వైరుధ్యం ఏర్పడి జలపాతాలు ఏర్పడతాయి. జలపాతం వద్ద నీరు పైనుంచి కిందికి దుమికినపుడు ఏర్పడిన మడుగును 'దుముకుడు మడుగు' అంటారు. జలపాతాల ఎత్తు, ఆకృతి, పరిమాణం, కోణం, ప్రవాహ నీటి పరిమాణాలు భిన్న స్థాయిలో ఉంటాయి. కాబట్టి విభిన్న రకాలైన జలపాతాలు ఏర్పడతాయి.

ఉదా: క్యాటరాక్ట్, క్యాస్కేడ్ జలపాతాలు. నీరు నిటారుగా కిందికి దుముకుతూ ఏర్పరచే భారీ జలపాతాలను క్యాటరాక్ట్ జలపాతాలు అంటారు.

నిటారుగా కాకుండా శిలల కాఠిన్యతలో తేడా వల్ల ఏర్పడ్డ మెట్ల వంటి నిర్మాణాల మీదుగా నీరు కిందికి దుమికినపుడు చిన్న పరిమాణంతో ఏర్పడే జలపాతాలను 'క్యాస్కేడ్ జలపాతాలు' అంటారు.

కెనడా-అమెరికా దేశాల సరిహద్దులో గల నయాగరా జలపాతం పరిమాణంలో ప్రపంచంలోనే అతి పెద్దది. వెనిజులా దేశంలోని ఏంజెల్ జలపాతం ప్రపంచంలో అత్యంత ఎత్తయిన జలపాతం. భారతదేశం-కర్ణాటకలోని శరావతి నదిపై గల జోగ్ జలపాతం భారతదేశంలోనే అత్యంతఎత్తయినది. మధ్యప్రదేశ్-నర్మదానదిపై ఉన్న మార్బుల్, ధువన్‌ధార జలపాతాలు; ఆంధ్రప్రదేశ్‌లో కపిల నదిపై ఉన్న కపిల తీర్థం జలపాతం; తెలంగాణ-ఆదిలాబాద్ జిల్లాలోని కుంతల జలపాతం ప్రముఖమైనవి.

ప్రౌఢదశలో ఏర్పడే భూస్వరూపాలు

నది మధ్య భాగమైన ఈ దశలో వాలు తక్కువగా ఉండి ప్రవాహ వేగం కూడా తక్కువగానే ఉంటుంది. ఈ దశలో ఉపనదుల సంఖ్య పెరగడంతో నదీ పరివాహక ప్రాంతం, నదిలో నీటి పరిమాణం పెరుగుతాయి. రవాణా, నిక్షేపణలు ఈ దశలో ముఖ్య కార్యక్రమాలు. అధోముఖ కోత కంటే పక్క కోత ఎక్కువగా ఉంటుంది. అందువల్ల నదిలోయ ఇరుకుగా ఉండక వెడల్పుగా ఉంటుంది. అక్కడక్కడ నది వంకరలు తిరిగి ప్రవహిస్తుంది.

స్పర్స్ : ప్రౌఢదశలో నది నెమ్మదిగా ప్రవహిస్తున్నపుడు తాను ప్రవహించే లోయను వెడల్పు చేసే కార్యక్రమంలో భాగంగా ఈ స్పర్స్ ఏర్పడతాయి. ఇవి ఇంచుమించు త్రిభుజాకారంలో ఉండి పటంలో చూపినట్లు ఒకదానికొకటి అభిముఖంగా ఉంటాయి. కాబట్టి వీటిని జోడించిన స్పర్స్ అని కూడా అంటారు.

నది వేదికలు : నదికి ఇరువైపులా సన్నగా, బల్లపరుపుగా మేడ మెట్లను పోలి ఉండే వాటిని నది వేదికలు అంటారు. ఇవి నది పక్కవాటు క్రమక్షయం వల్ల ఏర్పడతాయి. గతంలో ఒక నది ఎలా ప్రవహించింది, ఎన్ని వంకరలు తిరిగింది తదితర వివరాలను నది వేదికలు సూచిస్తాయి.

వరద మైదానాలు : నదికి వరదలు ఎక్కువగా వచ్చినపుడు నదిలో ప్రవహించే నీరు నదిలోయలోనే కాకుండా నది ఒడ్డు మీద కూడా పొర్లి ప్రవహించడం వల్ల నదిలో రవాణా చేసిన రాళ్లు, రప్పలు, ఒండ్రుమట్టి, ఇసుక మొదలైనవి నది ఒడ్డున నిక్షేపితమవుతాయి. ఇవి ఒక మైదాన రూపంలో ఏర్పడతాయి. వీటినే వరద మైదానాలు అంటారు.

సహజ లేవీలు : నదికి వరదలు ఎక్కువగా వచ్చినపుడు నది ప్రవాహం పెరిగి ఒక్కోసారి నది ఒడ్డును దాటి వరద మైదానం వెలుపల ఇరువైపులా సన్నని రిడ్జ్ రూపంలో నదీ భారాన్ని నిక్షేపణ కావిస్తుంది. దీనినే సహజ లేవీలు అంటారు.

నది వంకరలు : నది తాను క్రమక్షయం ద్వారా సమకూర్చుకున్న భారాన్ని మోయలేక అధిక భారం వల్ల వంకరలు తిరిగి ప్రవహిస్తుంది. ఈ వంకరలను నది వంకరలు అంటారు. గంగానది అలహాబాద్ సమీపంలో; గోదావరి నది అంతర్వేది సమీపంలో; బ్రహ్మపుత్ర నది అస్సోంలో వంకరలు తిరిగి ప్రవహిస్తాయి.

వండలి వీవన : నది యవ్వనదశ నుంచి ప్రౌఢ దశలోకి మారి దిగువకి ప్రవహించినపుడు దాని వేగం తగ్గుతుంది. అందువల్ల ప్రవాహం వెంట రవాణా అవుతున్న ఇసుకరాళ్లు, ఒండ్రుమట్టి తదితరాలను అనువైనచోట విసనకర్ర ఆకారంలో నిక్షేపణం చెందించడాన్ని వండలి వీవన అంటారు.

వృద్ధ దశలో ఏర్పడే భూస్వరూపాలు

ప్రౌఢ లేదా మధ్యమ దశను దాటిన తరవాత నది సముద్రంలో కలిసే ముందు నది లోయ వాలు చాలా తక్కువగా ఉండడం వల్ల ప్రవాహ వేగం కూడా చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల నది పాయలుగా చీలి ప్రవహిస్తుంది. వీటిని నది పాయలు అంటారు.

ఇసుక మేటలు : యవ్వన, ప్రౌఢ దశల్లో నది క్రమక్షయం వల్ల సమకూరిన నది భారాన్ని సముద్రం వరకు రవాణా చేయలేక మధ్యలోనే అక్కడక్కడ ఇసుకను నిక్షేపిస్తుంది. ఈ ఇసుక నిక్షేపణలను 'ఇసుక మేటలు' అంటారు. ఈ ఇసుక మేటలు నది ప్రవాహంలో జడ మాదిరిగా వంకర టింకరగా ఉంటాయి. వీటిని 'బ్రెయిడేడ్ నమూనా' అంటారు.

ఆక్స్-బౌ సరస్సులు : నది వృద్ధ దశలో మరీ వంకరలు తిరిగి ప్రవహించే సందర్భంలో కొన్నిసార్లు అర్ధచంద్రాకార ఆకృతిగల సరస్సులు ఏర్పడతాయి. వీటినే ఆక్స్-బౌ సరస్సులు అంటారు.

నది పాయలు : నది సముద్రంలో కలిసేముందు అనేక పాయలుగా చీలిపోయి అవి విడివిడిగా సముద్రంలో కలుస్తాయి. ఈ పాయలను నదిపాయలు అంటారు. ఉదా: గోదావరి నది రాజమండ్రి దాటిన తరవాత సముద్రంలో కలిసే ముందు ఏడు పాయలుగా విడిపోతుంది. వీటిని సప్తగోదావరులు అంటారు.

డెల్టాలు : క్రమక్షయం ద్వారా నది సముపార్జించిన ఒండ్రుమట్టి, ఇసుక వంటివి నది ముఖ ద్వారం వద్ద నిక్షేపించినపుడు డెల్టాలు ఏర్పడతాయి. ఇవి గ్రీకు అక్షరమైన డెల్టాను పోలి ఉంటాయి. ఇవి చాలా సారవంతమైనవి. వీటిలో ఒండ్రు మట్టి ఎక్కువగా ఉండడం వల్ల వరి పంట సాగుకు అనుకూలంగా ఉంటాయి. నది ప్రవాహ వేగం, నది భారం, సముద్ర తరంగాల ప్రభావం వంటి వాటి వల్ల ప్రపంచంలో వివిధ నదులు పలు రకాల డెల్టాలను ఏర్పరచాయి.

- అమెరికాలోని మిసిసిపి నది పక్షి పాద డెల్టాను, గంగా నది డిజిటల్ డెల్టాను గోదావరి నది ధనుస్సాకార డెల్టాను; కృష్ణా, పెన్నా నదులు లో బేట్ డెల్టాలను ఏర్పరుస్తాయి.
- ఈ డెల్టాల ఆకృతియే గాక విస్తృతి కూడి విభిన్నమే. కొన్ని నదులు అసలు డెల్టాలనే ఏర్పరచకపోగా కొన్ని మాత్రం స్వల్పస్థాయి డెల్టాలను మాత్రమే ఏర్పరచగల్గుతాయి.
- మిసిసిపి, పో, కొలరాడో, ఇరావడి, గంగా నదులు మాత్రం వందల కిలోమీటర్ల వైశాల్యంలో విశాలమైన డెల్టాలను ఏర్పరుస్తాయి.
- నది ముఖ ద్వారంలో డెల్టాలు ఏర్పడడమనేది నది పరివాహక ప్రాంతంలో ఉన్న శిలల స్వభావం, అక్కడ కురిసే వర్షపాతం, చుట్టూ ఉన్న వృక్షజాలం, క్రమక్షయం జరిగే విధానం, సముద్ర అలల స్వభావం వంటి వాటిపై ఆధారపడి ఉంటుంది. డెల్టాల మందం సాధారణంగా 400 మీటర్ల నుంచి 800 మీటర్ల వరకు ఉంటుంది.



వి.వెంకట్‌రెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ

డెల్టాలు-రకాలు

- డెల్టాలను వాటి ఆకారం, నిర్మాణం, పరిమాణం, పెరుగుదల వంటి వాటి ఆధారంగా వర్గీకరించారు.
- **ధనుస్సు ఆకార డెల్టా:** డెల్టా మధ్య భాగం సముద్రం వైపు వంగినట్లు ఉండి దాని రెండు చివరలు దగ్గరకు కుంచించినట్లు ఉంటూ ఒక వృత్త చాపం మాదిరి లేదా వంచిన ధనుస్సు మాదిరి ఉన్నట్లయితే దానిని ధనుస్సు ఆకార డెల్టా అంటారు. నదిలోని నీటి సాంద్రత, సముద్ర జలసాంద్రతలు ఇంచుమించు సమానంగా ఉన్నపుడు ఈ డెల్టాలు ఏర్పడతాయి.
- **పక్షిపాద డెల్టా:** పక్షిపాదం ఆకారంలో ఉంటుంది. ఈ డెల్టాలు సముద్ర జలాల కంటే నది జలాలు తేలికగా ఉన్నపుడు ఏర్పడతాయి. నదిలో రవాణా అవుతున్న సన్నని పరిమాణంగల క్రమక్షయ శిలా పదార్థాలను సముద్ర జలాల్లోని సుదూర ప్రాంతాలకు తరలించినపుడు నది ప్రధాన ప్రవాహానికి ఇరువైపులా నిక్షేపణ చెంది రేఖీయ డెల్టా ఏర్పడుతుంది. అదే సమయంలో నది ముఖ ద్వారం వద్ద పాయలుగా చీలిన ప్రధాన నది ఇతర పాయలు కూడా వాటి ప్రవాహాలకనుగుణంగా రేఖీయ డెల్టాలను ఏర్పరుస్తాయి. ఈ రేఖీయ ఆకృతిలో గల డెల్టాలన్నింటి కలయిక పక్షి పాదాన్ని పోలిన విస్తృత డెల్టాగా కనిపిస్తాయి. అమెరికాలోని మిసిసిపి డెల్టాను దీనికి ముఖ్య ఉదాహరణగా చెప్పవచ్చు.
- **డిజిటల్ డెల్టా:** కంప్యూటర్ కీ బోర్డులో అక్షరాల బిళ్లల మాదిరిగా చిన్న చిన్న డెల్టాలు అనేకం ఏర్పడడం వల్ల ఈ రకం డిజిటల్ డెల్టాలు రూపొందుతాయి. గంగా, బ్రహ్మపుత్ర నదులు డిజిటల్ డెల్టాలను ఏర్పరుస్తాయి.
- **లోబేట్ డెల్టా:** నది, సముద్ర జలాల సాంద్రత ఇంచుమించు సమానంగా ఉన్నపుడు మూడు చీలికలు ఉన్న ఫ్యాన్ ఆకారంలో ఏర్పడే డెల్టాను లోబేట్ డెల్టా అంటారు. కృష్ణా, పెన్నా డెల్టాలు ఈ రకానికి చెందినవి.
- **ఎస్చురైన్ డెల్టా:** నదులు సముద్రంలో కలిసేచోట సన్నని పొడవైన డెల్టాలను ఏర్పరచినపుడు వాటిని ఎస్చురైన్ డెల్టా అంటారు. నర్మద, తాపి, మెకంజీ, సీన్, హడ్సన్ డెల్టాలు ఈ రకానికి చెందినవి.
- **విసర్జిత డెల్టాలు:** నదులు తమ ముఖ ద్వారాలను మార్చుకున్నపుడు పాత డెల్టాలను పూర్తిగా వదిలేసి కొత్త డెల్టాలను ఏర్పరుస్తాయి. ఇలా వదిలిన డెల్టాలనే విసర్జిత డెల్టాలు అంటారు. ఉదాహరణకు చైనాలోని ఎల్లో నది (పూర్వం హ్యాంగ్ హో నది) అనేకమార్లు తన ముఖ ద్వారాన్ని మార్చుకోవడం ద్వారా ఈ రకమైన డెల్టాలు ఏర్పడ్డాయి. హుగ్లీ నది వల్ల గంగా డెల్టా పశ్చిమ భాగంలో ఇటువంటి డెల్టా ఏర్పడింది.



కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఫోన్ ట్యాపింగ్

చట్టం ఏమి చెబుతోందంటే...

చట్టాలను రూపొందించేటప్పుడు, కొన్ని ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వాటికి మినహాయింపులూ ఇస్తుండటం పరిపాటి. అయితే అలాంటి మినహాయింపులు ఆ చట్టానికి లొసుగులుగా పరిణమించినప్పుడు దిద్దుబాటు చర్యలు అనివార్యమవుతాయి. ఇటీవలికాలంలో వెలుగుచూస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాలు ప్రధానంగా దిద్దుబాటు చర్యల ఆవసరాన్ని తెలుపుతున్నాయి.

ఫోన్ ట్యాపింగ్ అంటే ఒక వ్యక్తికి తెలియకుండా వారి సంభాషణలను వినేవిధంగా ఎవరైనా ఆ ఫోన్‌ను సాంకేతికంగా తమ ఆధీనంలోకి తెచ్చుకోవడం. అయితే ఫోన్‌లో సంభాషించేటప్పుడు వ్యక్తులు స్వేచ్ఛగా తమ భావాలను, వ్యక్తిగత విషయాలను, రహస్యాలను చర్చించే అవకాశం ఉంది. ఈ భావప్రకటన స్వేచ్ఛకు, గోప్యత హక్కుకు ఫోన్ ట్యాపింగ్ చర్యలు భంగం కలిగిస్తాయి. ఇది రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులైన ప్రకరణ 19(భావ ప్రకటన స్వేచ్ఛ), ప్రకరణ 21(జీవించే స్వేచ్ఛలో అంతర్భాగంగా ఉన్న గోప్యత హక్కు)లను ఉల్లంఘిస్తోంది.

ఇదే విషయాన్ని 'పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్' వర్సెస్ 'యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీం కోర్టు ఉద్ఘాటించింది. టెలిఫోన్ సంభాషణలు గోప్యత హక్కుల కిందకు వస్తాయని అలాంటి హక్కును చట్టం నిర్ధారించిన పద్ధతిలో మినహా, ఇతరత్రా ఉల్లంఘించడం కిందికే వస్తుందని పేర్కొంది.

అయితే భారత రాజ్యాంగ ప్రకరణ 19(2)లో భావప్రకటన స్వేచ్ఛపై పరిమితులను పేర్కొన్నారు. ప్రజాసంక్షేమం, శాంతిభద్రతల దృష్ట్యా ఒక వ్యక్తి భావప్రకటన స్వేచ్ఛపై ప్రభుత్వం సహేతుక పరిమితులు విధించే సౌలభ్యాన్ని అందించింది. ఈ నిబంధనను అనుసరిస్తూ 'ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం 1885' సెక్షన్ 5(2) ప్రకారం ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో, ప్రజాభద్రత, భారతదేశ సార్వభౌమాధికారం, సమగ్రత, రాష్ట్రాల శాంతి భద్రతలు, విదేశాలతో స్నేహపూర్వక సంబంధాలు దెబ్బతినే అవకాశాలున్నప్పుడు, నేరం చేయడానికి ప్రేరేపించడం వంటి వాటిని నిరోధించడానికి ఫోన్ ట్యాపింగ్ చేసే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు దఖలుపడ్డాయి.

అయితే 'ఇండియన్ టెలిగ్రాఫ్(సవరణ) రూల్స్ 2007'లోని రూల్ 419ఏ ద్వారా ఫోన్ ట్యాపింగ్‌కు అనుమతినిచ్చే అధికారిక హోదాల గురించి స్పష్టంగా పేర్కొంది. కేంద్ర, రాష్ట్రాల స్థాయుల్లో ఎవరెవరికి అధికారం ఉంటుందో చర్చించింది. రాష్ట్రస్థాయిల్లో ఆ రాష్ట్రాల్లో ఫోన్ ట్యాప్ చేసే అధికారం పోలీసులకు ఉంటుంది. రాష్ట్రప్రభుత్వ కార్యదర్శి(ఇన్‌చార్జ్ ఆఫ్ హోమ్ డిపార్ట్‌మెంట్) నుంచి ఉత్తర్వులు పొందాల్సి ఉంటుంది.

కేంద్రప్రభుత్వ స్థాయిలో ఫోన్ ట్యాపింగ్‌కు పది సంస్థలకు అనుమతి ఉంది.

1) ఇంటెలిజెన్స్ బ్యూరో
2) సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్
3) ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్
4) నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో
5) సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్
6) డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్
7) నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ
8) రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్
9) డైరెక్టరేట్ ఆఫ్ సిగ్నల్
10) ఢిల్లీ పోలీస్ కమిషనర్.

కేంద్రప్రభుత్వ స్థాయిలో ఫోన్ ట్యాపింగ్‌కు ఉత్తర్వులు జారీచేసే అధికారం మినిస్ట్రీ ఆఫ్ హోం అఫైర్స్‌కు చెందిన భారత ప్రభుత్వ కార్యదర్శికి ఉంటుంది.

అయితే అత్యవసర పరిస్థితుల్లో, కేంద్రస్థాయిలో జాయింట్ సెక్రటరీ స్థాయి కంటే తక్కువ కానీ హోదా గల అధికారి(కేంద్ర హోం కార్యదర్శి ఆథరైజ్ చేసినవారు) ఉత్తర్వులు ఇవ్వవచ్చు. అదేవిధంగా రాష్ట్రస్థాయిలో అత్యవసర పరిస్థితుల్లో రాష్ట్ర హోం సెక్రెటరీ ఆథరైజ్ చేసిన అధికారి ఉత్తర్వులివ్వవచ్చు.

ఒక్కోసారి ముందస్తు ఆదేశాలు పొందడం సాధ్యం కాని పరిస్థితులు లేదా మారుమూల ప్రాంతాల్లో నిఘా పెట్టాల్సిన సందర్భాల్లో కేంద్రస్థాయిలో అయితే ఫోన్ ట్యాపింగ్ అనుమతి గల పది అధీకృత సంస్థలకు చెందిన అధిపతులు లేదా వారి తరువాత గల రెండో అత్యంత సీనియర్ అధికారి ముందస్తు అనుమతితో ఫోన్ ట్యాప్ చేయవచ్చు. అదే రాష్ట్రస్థాయిలో అయితే ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు స్థాయి కంటే తక్కువ హోదా కాకుండా ఉన్న అధీకృత అధికారుల నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. అయితే ఈ అనుమతుల గురించి అత్యున్నత అధికారికి మూడురోజుల లోపు తెలియచేయాలి.

ఏడు పని దినాల్లోగా సదరు అధికారి దానిని ఆమోదించవచ్చు లేదా తిరస్కరించనూ వచ్చు. నిర్ణీత గడువు లోపు ఈ ఆమోదం పొందని పక్షంలో ఫోన్ ట్యాపింగ్ నిలిపివేయాలి.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

ఈ టెలిఫోన్ ట్యాపింగ్ దుర్వినియోగం కాకుండా ఈ చట్టం కొన్ని పరిమితులను విధించింది.

1. సమాచారం పొందేందుకు వేరే మార్గం లేకుంటే మాత్రమే టెలిఫోన్ ట్యాపింగ్ ఉత్తర్వులివ్వాలి.
2. ట్యాపింగ్ ఆదేశాలు ముందుగా ఉపసంహరించుకోని పక్షంలో అరవై రోజులు అమలులో ఉంటాయి. వీటిని పునరుద్ధరించవచ్చు. అయితే మొత్తంగా 180 రోజులకు మించి ఇవి అమలుకావు.
3. అధీకృత అధికారి జారీచేసే ట్యాపింగ్ ఆదేశాలపై ట్యాపింగ్‌కు గల కారణాలను తప్పనిసరిగా పేర్కొనాలి. అదేవిధంగా ఏడు పని దినాల్లోగా ఒక కాపీని సమీక్ష కమిటీకి నివేదించాలి.
4. కేంద్రంలో కేబినెట్ సెక్రటరీ నేతృత్వంలో న్యాయ శాఖ, టెలికాం శాఖ కార్యదర్శులు సభ్యులుగా సమీక్ష కమిటీ ఏర్పడగా రాష్ట్రస్థాయిలో రాష్ట్ర చీఫ్ సెక్రటరీ నేతృత్వంలో లా, హోం సెక్రటరీలు సభ్యులుగా సమీక్ష కమిటీ పనిచేస్తుంది. టెలిఫోన్ ట్యాపింగ్ అభ్యర్థనలను సమీక్షించడానికి ఈ కమిటీలు కనీసం రెండు నెలలకు ఒక్కసారైనా సమావేశం కావాల్సి ఉంటుంది.
5. ఫోన్ ట్యాపింగ్ రికార్డులు ఏదైనా సాక్ష్యాధారాలకు అవసరం అయితే తప్ప ఆరు నెలలకుమించి నిలువ చేయరు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఇలాంటి రికార్డులను ధ్వంసం చేస్తారు.
6. ట్యాపింగ్‌కు సాంకేతిక సహకారం అందించే టెలిఫోన్ సర్వీసు ప్రొవైడర్లు సైతం ఇలాంటి ట్యాపింగ్ వ్యవహారం ముగిసిన వెంటనే రెండు నెలల లోపు సదరు ట్యాపింగ్ రికార్డులను ధ్వంసం చేయాల్సి ఉంటుంది.
7. పత్రికాస్వేచ్ఛ రీత్యా పాత్రికేయుల ఫోన్ ట్యాపింగ్‌పై కఠిన ఆంక్షలున్నాయి.

అయితే చట్ట ప్రకారం ఇన్ని నియమ నిబంధనలు ఉన్నప్పటికీ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ రాజకీయ ఒత్తిడికి లోబడి అధీకృత సంస్థలు/ అధికారులు అక్రమంగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడటం వంటి వ్యవహారాలు ఇటీవల వెలుగులోకి రావడంతో ఫోన్ ట్యాపింగ్‌పరంగా నియమ నిబంధనలు మరింత కఠినం చేస్తూ చట్టసవరణ చేయాల్సిన ఆవసరం గోచరిస్తోంది. అదేవిధంగా ప్రాథమిక హక్కులకు ముడిపడి ఉన్న అంశమైనందున ఫోన్స్ ట్యాపింగ్ అనుమతి, తదనంతర సమీక్ష నిర్వహించే యంత్రాంగాల్లో న్యాయవ్యవస్థ ఉనికి, ప్రమేయం వాంఛనీయమని, ఆ దిశగా చట్ట సవరణలు ఉండాలని విశ్లేషకులు సూచిస్తున్నారు. అంతేకాక ఈ అధికారాలను అక్రమాలకు, అవినీతికి, రాజకీయ ప్రయోజనాలకు వినియోగించుకున్న వారికి కఠిన శిక్షలు ఉన్నప్పుడే అక్రమ ఫోన్ ట్యాపింగ్‌ను నియంత్రించవచ్చని కూడా వారు అభిప్రాయపడుతున్నారు.


పార్ట్-3

కోడింగ్ - డీకోడింగ్

కోడింగ్ - డీ కోడింగ్ చాప్టర్‌లో ఇప్పటి వరకు ఒక పదంలోని అక్షరాలు, మరొక అక్షరాలుగా మారే విధానంలో పలు పద్ధతులను తెలుసుకున్నారు. ఇప్పుడు నెంబర్ కోడింగ్‌ని పరిశీలిద్దాం.

నెంబర్ కోడింగ్‌లో ఒక పదానికి కోడ్‌గా సంఖ్యను ఇస్తారు. పదంలోని అక్షరాలకు సవ్యదిశ లేదా అపసవ్యదిశలో సంఖ్యలను విడివిడిగా రాయడం, ఆ సంఖ్యలను కూడి మొత్తం విలువగా చూపడం, గుణించడం, రెట్టింపు చేయడం, వర్గంగా తెలపడం, తిప్పి రాయడం వంటి అంశాలను పరిశీలించాలి.

నెంబర్ కోడింగ్ ప్రశ్నలకు సంబంధించి ఆలోచించే విధానంపై అవగాహన కోసం కింద ఇచ్చిన సూర్యకిరణాల డయాగ్రామ్‌ను పరిశీలించండి.



గమనించండి: పై డయాగ్రమ్‌లో BAG అనే పదాన్ని 14 రకాలుగా కోడింగ్ చేశారు. దాని వివరణలను 1 నుంచి 14 వరకు ఇప్పుడు పరిశీలిద్దాం.

1. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం సంఖ్యలు 2, 1, 7
2. BAG అనే పదానికి అపసవ్య దిశ వర్ణమాల(రివర్స్ ఆర్డర్) ప్రకారం సంఖ్యలు 26, 25, 20.
3. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలకు ఒక్కొక్క దానికి 4 కూడగా వచ్చాయి. (B అంటే 2+4=6, A అంటే 1+4=5, G అంటే 7+4=11 ఇక్కడ గమనించాల్సిన విషయం '4' అనే సంఖ్యనే కూడాలని ఏమిలేదు. ఏదో ఒక స్థిర సంఖ్యను పదంలోని అక్షరాలకు గల సంఖ్యలకు కూడవచ్చు)
4. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 2, 1, 7ల వర్గాలు(స్క్వేర్స్) 4, 1, 49.
5. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 2, 1, 7లను కూడగా 2+1+7=10.
6. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 2, 1, 7 లను కూడగా 2+1+7=10 కి రెట్టింపు 20.
7. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 2, 1, 7లను కూడగా 2+1+7=10 కి వర్గం 100.
8. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను గుణించగా అంటే లబ్ధం 2 x 1 x 7 = 14
9. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యల విడివిడి వర్గములను కూడగా అంటే $2^2+1^2+7^2=4+1+49=54$.
10. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా 2+1+7=10 దీని నుంచి 3 తగ్గించగా 10-3=7, (ఇక్కడ మూడు తగ్గించడానికి కారణం ఆ పదంలో '3' అక్షరాలు ఉన్నాయి)
11. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా 2+1+7=10. దీనికి 3 కూడగా 10+3=13 (ఇక్కడ మూడు కూడటానికి కారణం ఆ పదంలో '3' అక్షరాలు ఉన్నాయి).
12. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా 2+1+7=10. దీనిని 3తో గుణించగా 10 x 3 = 30 (ఇక్కడ 3తో గుణించడానికి కారణం ఆ పదంలో '3' అక్షరాలు ఉన్నాయి).
13. BAG అనే పదానికి వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా 2+1+7=10. దీనిని తిప్పి రాయగా 01.
14. BAG అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల అపసవ్య దిశ(రివర్స్ ఆర్డర్) ప్రకారం సంఖ్యలు 25, 26, 20 వీటిని కూడగా 25+26+20=71. ఈ విధంగా ఒక పదానికి ఎన్ని రకాలుగానైనా కోడ్ సంఖ్యలను తెలుపవచ్చు. అందువల్ల దీనిపై మీరు పట్టు సాధించాలంటే వర్ణమాల సవ్యదిశ, అపసవ్యదిశ అక్షరాలకు గల సంఖ్యలపై పూర్తి అవగాహన కచ్చితంగా ఉండి తీరాల్సిందే.



రీజనింగ్

ఇప్పుడు కొన్ని ప్రశ్నలను పరిశీలిద్దాం.

1. ఒక కోడ్ భాషలో 'HUMAN'ను 82113114గా రాశారు. అదే కోడ్ భాషలో 'STAND' ను ఏ విధంగా రాస్తారు?

ఎ) 19201243 బి) 19201144
సి) 19211243 డి) ఏదీకాదు

సమాధానం (బి)

వివరణ: వర్ణమాల ప్రకారం H అంటే 8వ అక్షరం, U అంటే 21వ అక్షరం, M అంటే 13వ అక్షరం, A అంటే 1వ అక్షరం. N అంటే 14వ అక్షరం. ఈ సంఖ్యలను పక్కపక్క రాస్తే 82113114. ఇదే విధంగా పదం 'STAND'లో వర్ణమాల ప్రకారం S అంటే 19వ అక్షరం, T అంటే 20వ అక్షరం, A అంటే 1వ అక్షరం, N అంటే 14వ అక్షరం, D అంటే 4వ అక్షరం. ఈ సంఖ్యలను పక్కపక్క రాయాలి. కాబట్టి సమాధానం 19201144 అవుతుంది.

2. ఒక కోడ్ భాషలో HEART 4 ART=3 అయితే అదే కోడ్ భాషలో PHONE 4 ONEను ఏ విధంగా రాస్తారు?

ఎ) 8 బి) 12 సి) 10 డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: గుర్తు '4' కు ఇరువైపుల గల ARTని తొలగిస్తే చేసిన H, E ఉంటాయి. వర్ణమాల ప్రకారం H అంటే 8వ అక్షరం వర్ణమాల ప్రకారం E అంటే 5వ అక్షరం ఇప్పుడు పెద్ద సంఖ్య నుంచి చిన్న సంఖ్య తీసివేస్తే 8-5=3 అవుతుంది. అదే విధంగా PHONE 4 ONEలో గుర్తు '4'కు ఇరువైపుల ONEని తొలగిస్తే P, H ఉంటాయి. వర్ణమాల ప్రకారం P అంటే 16వ అక్షరం, H 8వ అక్షరం. ఇప్పుడు పెద్ద సంఖ్య నుంచి చిన్న సంఖ్య తీసివేస్తే 16-8=8 సమాధానం అవుతుంది.

3. ఒక కోడ్ భాషలో RUNను $B_9C_7B_7$ గా రాశారు. అదే కోడ్ భాషలో NILను ఏ విధంగా రాస్తారు?

ఎ) $B_7C_3B_6$ బి) $B_6C_3B_7$ సి) $C_3B_6B_7$
డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: RUN అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 18, 21, 14. అతి తక్కువ ప్రధాన సంఖ్యను ప్రాధాన్యంలోకి తీసుకోవాలి. అంటే 18 అనేది అతి తక్కువ ప్రధాన సంఖ్య 2తో భాగించవచ్చు. అందుకని B అక్షరాన్ని తీసుకున్నాం. ఎన్ని రెండ్లు 18. 9 రెండ్లు కావున B_9, అదే విధంగా 21ని అతి తక్కువ ప్రధాన సంఖ్య 3తో భాగించవచ్చు. అందుకని 3వ అక్షరం C ని తీసుకున్నాం. 3 x 7 = 21 కావున 'C_7' అదే విధంగా N అంటే 14వ అక్షరం, అతి తక్కువ ప్రధాన సంఖ్య 2తో భాగించవచ్చు. అందువల్ల B అక్షరాన్ని తీసుకున్నాం. 2 x 7 = 14 అందువల్ల B_7 అంటే RUN - $B_9 C_7 B_7$ ఇదే విధంగా NIL అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 14, 9, 12. వీటిని వరుసగా అతి తక్కువ ప్రధాన సంఖ్యలైతే 2, 3, 2తో భాగించవచ్చు. కాబట్టి BCB అక్షరాలను తీసుకోవాలి. 2x7=14 కాబట్టి B_7. 3x3=9 కాబట్టి C_3, 2x6=12 కాబట్టి B_6. సమాధానం $B_7C_3B_6$

4. ఒక కోడ్ భాషలో INK+PEN=69గా రాశారు. అదే కోడ్ భాషలో MAT+CAP ఏమవుతుంది?

ఎ) 53 బి) 54 సి) 55 డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: INK అనే పదంలో I అంటే 9, N అంటే 14 K అంటే 11. ఈ మూడు సంఖ్యలను కూడగా INK అంటే 9+14+11=34. PEN అనే పదంలో P అంటే 16, E అంటే 5, N అంటే 14. కాబట్టి PEN అంటే 16+5+14=35. INK+PEN అంటే 34+35=69 ఇదే విధంగా MAT అనే పదంలో M అంటే 13, A అంటే 1, T అంటే 20. ఈ మూడు సంఖ్యలను కూడగా MAT అంటే 13+1+20=34

CAP అనే పదంలో C అంటే 3, A అంటే 1, P అంటే 16.

కాబట్టి CAP అంటే 3+1+16=20.

కాబట్టి MAT + CAP = 34+20=54 సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

ప్రైవేటు సంస్థకు బీబీసీ బాధ్యతలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: ఐటీ దాడులు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనల్లో సవరణలు జరిగిన దృష్ట్యా ప్రముఖ వార్తా సంస్థ 'బీబీసీ' తన నిర్వహణ విధానంలో భారీగా మార్పులు తీసుకొచ్చింది. భారత్‌లో వార్తల ప్రచురణ నిమిత్తం తనకు లభించిన పబ్లిషింగ్ లైసెన్సును విడిచిపెట్టుకొంది. దానిని భారతీయ ఉద్యోగులు నిర్వహిస్తున్న ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి అప్పగించింది. బీబీసీ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ఇదే ప్రథమం. ఈ నూతన విధానం వచ్చే వారం నుంచి అమల్లోకి రానుంది. గతంలో బీబీసీలో పని చేసిన నలుగురు మాజీ ఉద్యోగులు నెలకొల్పిన 'కలెక్టివ్ న్యూస్‌రూం' సంస్థకు తన పబ్లిషింగ్ లైసెన్సింగ్‌ను బీబీసీ అప్పగించింది. ఆ సంస్థే బీబీసీ తెలుగు సహా 7 భాషల్లో అందించే భారతదేశ వార్తలకు బాధ్యత తీసుకోనుంది. ఆ నూతన కంపెనీలో 26% వాటాలను బీబీసీ తన వద్ద ఉంచుకోనుంది. 2020లో తీసుకొచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విధానం ప్రకారం డిజిటల్ మీడియా రంగంలో 26% మేర మాత్రమే విదేశీ పెట్టుబడులు ఉండొచ్చు. మోదీపై డాక్యుమెంటరీ ప్రసారం చేసిన కొద్ది రోజులకే బీబీసీపై ఐటీ దాడులు జరిగిన సంగతి తెలిసిందే.

సోరెన్ కేసులో సాక్ష్యాలుగా ఫ్రిజ్, టీవీ బిల్లులు

రాంచీ, ఏప్రిల్ 7: ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ మనీలాండరింగ్ కేసులో ఓ స్మార్ట్‌టీవీ, ఫ్రిజ్ బిల్లులే ఇప్పుడు కీలక సాక్ష్యాలుగా మారాయి. ఈ నెల 4న రాంచీలోని పీఎంఎల్‌ఏ స్పెషల్ కోర్టుకు సమర్పించిన 191 పేజీల చార్జ్‌షీట్‌లో ఈడీ ఆ వివరాలను అందజేసింది. రాంచీలోని 8.86 ఎకరాల భూమిని సోరెన్ అక్రమంగా సంపాదించారని ఈడీ అభియోగాలు మోపిన విషయం తెలిసిందే. అయితే.. సోరెన్ మాత్రం ఆ భూమితో తనకు ఎలాంటి సంబంధాల్లేవని వాదించారు. రాజ్‌కుమార్ పహాన్ అనే వ్యక్తి పేరిట ఆ భూమి ఉన్నట్లు వివరించారు. అయితే, ఆ భూమి సోరెన్ కుటుంబ సభ్యుడు సంతోష్ ఆధీనంలోనే ఉందని నిరూపించే ఆధారాలను ఈడీ సేకరించింది. 2017 ఫిబ్రవరిలో కొనుగోలు చేసిన ఓ రిఫ్రిజిరేటర్, 2022 నవంబరులో కొన్న ఓ స్మార్ట్‌టీవీ ఇన్వాయిస్‌ల ద్వారా ఆ భూమి సోరెన్‌దేనని నిరూపించేలా ఆధారాలను తాజా చార్జ్‌షీట్‌తో జత చేసింది.

మా మేనిఫెస్టోపై ఫీడ్‌బ్యాక్ ఇవ్వండి: రాహుల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన ఎన్నికల ప్రణాళికపై దేశ ప్రజలంతా తమ అభిప్రాయాలు వెల్లడించాలని ఆ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియోను పోస్టు చేశారు. ప్రతి ఒక్క భారతీయుడి ఆకాంక్షే కాంగ్రెస్ మేనిఫెస్టో అని రాహుల్ వ్యాఖ్యానించారు. దీనిపై ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలను సోషల్ మీడియా వేదికగా వెల్లడించాలని ఆయన కోరారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం, యువతకు రైట్ టూ అప్రెంటిస్‌షిప్, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లపై ప్రస్తుతం ఉన్న 50% పరిమితిని తొలగించేలా రాజ్యాంగ సవరణ, కులాల వారీగా జనగణన వంటి కీలక హామీలను కాంగ్రెస్ ప్రకటించింది. ఈ ఎన్నికల ప్రణాళికపై ఇప్పుడు రాహుల్ ప్రజాభిప్రాయం కోరుతున్నారు.

భార్యను 224 ముక్కలు చేశాడు

» యూకేలో దారుణం.. కిరాతక భర్త అరెస్టు

లండన్, ఏప్రిల్ 7: సరిగ్గా రెండేళ్ల కిందట ఢిల్లీలో వెలుగుచూసిన శ్రద్ధా వాకర్ హత్య కేసు గుర్తుందా..? నమ్మి వచ్చిన ఆమెను ప్రేమికుడు అఫ్తాబ్ పూనావాలా అత్యంత కిరాతకంగా హతమార్చి.. శరీరాన్ని ముక్కలుగా చేసి.. ఆ భాగాలను అనేక చోట్ల పారవేశాడు. ఇలాంటి ఘటనే యూకేలో చోటుచేసుకుంది. లింకన్‌షైర్‌కు చెందిన నికొలస్(28) 2022 చివర్లో హోలీ బ్రామ్లీ (26)ని వివాహమాడాడు. కొద్ది రోజులకే ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. నిరుడు మార్చిలో నికొలస్ బెడ్‌రూమ్‌లో బ్రామ్లీని పలుసార్లు పొడిచి చంపాడు. శవాన్ని బాత్ రూంలోకి తీసుకెళ్లి ముక్కలుగా చేశాడు. వాటిని ప్లాస్టిక్ బ్యాగ్‌లో చుట్టి కిచెన్‌లో వారం పాటు ఉంచాడు. తర్వాత స్నేహితుడిని పిలిచి విథమ్ నదిలో పడేశాడు. అయితే, మరునాడు వాకింగ్‌కు వెళ్లిన ఓ వ్యక్తికి నదిలో ప్లాస్టిక్ బ్యాగులు తేలుతూ కనిపించడంతో ఈ దారుణం వెంటనే బయటపడింది. ఈతగాళ్లు బ్యాగులను తీసి చూడగా మొత్తం 224 శరీర భాగాలు కనిపించాయి.

అది విచ్ఛిన్న ముఠా భాష!

జమ్మూకశ్మీరుకు దేశంతో సంబంధం లేదంటారా?.. మీ మాటలకు సిగ్గుపడుతున్నాను

» కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేపై ప్రధాని ఫైర్

» అవినీతి నేతలను కాపాడుకోవడానికే

కేంద్ర ఏజెన్సీలపై టీఎంసీ దాడులు: మోదీ

నవాదా/జల్పాయ్‌గురి, ఏప్రిల్ 7: ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేపై ప్రధాని మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జమ్మూకశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370 అధికరణ రద్దు ప్రస్తావన రాజస్థాన్‌లో ఎందుకని శనివారం ఆయన జైపూర్‌లో చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. జమ్మూకశ్మీరుకు మిగతా దేశంతో సంబంధం లేదా అని ధ్వజమెత్తారు. ఇది విచ్ఛిన్న ముఠా (టుకడే టుకడే గ్యాంగ్) భాషగా పేర్కొన్నారు. ఆదివారం ప్రధాని బిహార్‌లోని నవాదా, బెంగాల్లోని జల్పాయ్‌గురిలో జరిగిన ఎన్నికల సభల్లో ప్రసంగించారు. 'కాంగ్రెస్ అధ్యక్ష పదవి చిన్నది కాదు. ఆ పదవిలో ఉన్న ఖర్గే 370 రద్దు గురించి ఏం మాట్లాడారు? జమ్మూకశ్మీరు గురించి రాజస్థాన్ ప్రజలకు ఏం సంబంధమని అంటారా? అంటే జమ్మూకశ్మీరు మన దేశంలో అంతర్భాగం కాదా? ఆయన మాటలకు సిగ్గుపడుతున్నాను. మాతృభూమి కోసం బిహార్ యువత, ప్రజలు ఎంతో మంది త్యాగాలు చేశారు. జమ్మూకశ్మీరును పరిరక్షించే క్రమంలో ఎందరో యువకులు ప్రాణత్యాగం చేశారు. రాజస్థాన్‌లో కూడా ఇంతే. కానీ ఇప్పుడు కాంగ్రెస్ నేతలు దేశంలోని ఈ ప్రాంతంతో ఆ ప్రాంతానికి సంబంధం ఏమిటని అంటారా? వారి విభజన దృక్పథాన్ని ఇది చాటుతోంది. ఈ విచ్ఛిన్న ముఠాను క్షమిస్తారా' అని సభికులను ప్రశ్నించారు. అలాగే శనివారం రాత్రి టీఎంసీ నేతలను అరెస్టు చేయడానికి వెళ్లిన ఎన్ఐఏ అధికారులపై స్థానిక టీఎంసీ కార్యకర్తలు దాడి చేసి.. తిరిగి వారిపైనే కేసు పెట్టారని మోదీ అన్నారు. బెంగాల్లో టీఎంసీ సిండికేట్ రాజ్ నడుస్తోందని.. అవినీతి నేతలను కాపాడడమే మమత ప్రభుత్వ ఏకైక లక్ష్యమని ధ్వజమెత్తారు. 'రాష్ట్రంలో దోపిడీ, భయానక వాతావరణం, అవినీతి, హింసకు టీఎంసీ ఉచిత లైసెన్సు కోరుతోంది. దేశ రాజ్యాంగాన్ని, చట్టాన్ని తుంగలో తొక్కుతోంది. పేదల కోసం కేంద్రం తెచ్చిన సంక్షేమ పథకాలను మమత అమలు చేయడం లేదు. కేంద్ర నిధులు మొదట తమ ఖాతాలో పడాలని అనుకుంటున్నారు. రాష్ట్రంలో వివిధ అవినీతి కేసులకు సంబంధించి ఈడీ అవినీతి నేతలకు చెందిన రూ.3 వేల కోట్ల ఆస్తులను జప్తు చేసింది. నేను అవినీతిని నిర్మూలిస్తానంటుంటే ప్రతిపక్ష కూటమి అవినీతిపరులను రక్షిస్తామంటోంది. అవినీతిపరులను రక్షించేందుకే టీఎంసీ, లెఫ్ట్, కాంగ్రెస్ ఇండీ కూటమిని ఏర్పాటుచేశాయి' అని మోదీ అన్నారు. సందేశ్‌ఖాలీలో జరిగిన అత్యాచారాలను యావద్దేశం చూసిందని.. అఘాయిత్యాలకు పాల్పడినవారు జీవితాంతం జైల్లో మగ్గేలా చేస్తానని అన్నారు.



ప్రధాని కాళ్లు మొక్కిన నీతీశ్

» నాలుగు వేల మంది ఎంపీలతో మోదీ మళ్లీ గెలుస్తారని వ్యాఖ్య

పట్నా, ఏప్రిల్ 7: ప్రధాని మోదీ ఈసారి 4వేల మంది ఎంపీలతో తిరిగి అధికారంలోకి వస్తారని బిహార్ సీఎం నీతీశ్ కుమార్ చేసిన వ్యాఖ్య సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. బహిరంగ వేదికపైనే నీతీశ్ మోదీ కాళ్లను మొక్కడం కూడా చర్చకు దారి తీసింది. బిహార్‌లోని నవడాలో ఆదివారం జరిగిన బహిరంగ సభలో ఈ సంఘటన చోటు చేసుకుంది. 25 నిమిషాల పాటు చేసిన నీతీశ్ ప్రసంగం మోదీ సహా అందరికీ విసుగు తెప్పించింది. పలుమార్లు ఆయన తడబడ్డారు. ఒక సందర్భంలో ఆయన 'మోదీ చార్ లాక్ (నాలుగు లక్షలు) అని అనబోయి.. చార్ హజార్ సే భీ జ్యాదా (4వేలకు పైగా) ఎంపీ స్థానాలతో తిరిగి అధికారంలోకి వస్తారని అన్నారు. లోక్‌సభలో మొత్తం సీట్లు 543 కాగా, 400 స్థానాల్లో గెలవాలని మోదీ లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే.. నీతీశ్ ప్రసంగంపై మోదీ సహా పలువురు అసంతృప్తి చెందారు. వేదికపై ఉన్న జేడీ(యూ) నేత విజయ్ కుమార్ పలుమార్లు ఆయనకు గడియారాన్ని చూపించారు. మోదీ కూడా చమత్కరిస్తూ "మీరు మంచి ఉపన్యాసం ఇచ్చారు. చెప్పడానికి నాకేమీ విగల్చలేదు" అన్నారు. ప్రసంగాన్ని ముగించిన నీతీశ్ నవ్వుతూ వంగి మోదీ కాళ్లను తాకారు.

అలెక్సాతో చిన్నారిని కాపాడిన బాలిక

» జాబ్ ఆఫర్ చేసిన ఆనంద్ మహీంద్రా



లఖ్‌నవూ, ఏప్రిల్ 7: ఉత్తరప్రదేశ్‌లోని బస్తీ జిల్లాకు చెందిన నికిత(13) 'అలెక్సా' సహాయంతో ఓ కోతి దాడి నుంచి తన అక్క కూతురిని రక్షించింది. కుటుంబ సభ్యులందరూ వేరే గదిలో ఉన్న సమయంలో ఆమె ఏడాది వయస్సు గల చిన్నారితో ఆడుకుంటుండగా ఓ కోతి ఆ ఇంట్లోకి దూరింది. పాపపై దాడిచేసేందుకు ప్రయత్నించగా.. నికిత సమయస్ఫూర్తితో వ్యవహరించి ఫ్రిడ్జ్ పైన ఉన్న అలెక్సాకు 'కుక్కలా మొరుగు' అంటూ ఆదేశాలిచ్చింది. అనంతరం అలెక్సా కుక్కలా మొరగడంతో ఆ అరుపులకు కోతి భయపడి పారిపోయింది. ఇలా కోతి బారి నుంచి తనతోపాటు తన అక్క కూతురిని కూడా ఆమె రక్షించుకుంది. ఈ విషయం తెలుసుకున్న మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా నికిత సమయస్ఫూర్తిని మెచ్చి ఆమెకు జాబ్ ఆఫర్ చేశారు. చదువు పూర్తయ్యాక నికిత కార్పొరేట్ ఉద్యోగం చేయాలనుకుంటే తాను ఇస్తానన్నారు.

విస్తారాలో సిబ్బంది కొరత..
10% విమానాల రద్దు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: పైలట్ల అనారోగ్యం, తగినంత మంది సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో 10 శాతం విమాన సర్వీసులను తగ్గిస్తున్నట్లు ఆదివారం టాటా గ్రూప్‌నకు చెందిన విస్తారా సంస్థ ప్రకటించింది. ఈ వేసవిలో ప్రతి రోజూ 300కుపైగా విమానాలను నడపాల్సి ఉండగా, సిబ్బంది కొరత కారణంగా 25-30 విమానాలను నిలిపివేయనున్నట్లు తెలిపింది. ఎక్కువగా డొమస్టిక్ విమానాలనే రద్దు చేశామని, తద్వారా విదేశాలకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూశామని పేర్కొంది. ఈ నెల తరువాత పరిస్థితులు సర్దుకుంటాయని తెలిపింది.

నడ్డాను ఎందుకు విచారించట్లేదు?



న్యూఢిల్లీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం పాలసీ కేసుకు సంబంధించి కేజ్రీవాల్‌తోపాటు ఆప్ నేతల్లో ఎవరి దగ్గరైనా ఒక్క రూపాయి దొరికిందా అని ఢిల్లీ మంత్రి అతిశీ ప్రశ్నించారు. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పాలని మద్యం వ్యాపారి శరత్ చంద్రారెడ్డిపై ఒత్తిడి తెచ్చి చివరికి అప్రూవర్‌గా మార్చుకున్నారని ఆరోపించారు. బీజేపీకి విరాళం ఇచ్చిన తర్వాత శరత్ చంద్రారెడ్డికి బెయిల్ వచ్చిందని గుర్తు చేశారు. ఈ కేసులో శరత్ చంద్రారెడ్డి కీలక వ్యక్తి అని ఈడీ, సీబీఐ చెబుతోందని, అలాంటి వ్యక్తి బీజేపీకి విరాళం ఇవ్వడంపై దర్యాప్తు సంస్థలు ఎందుకు నోరు మెదపడంలేదని, బీజేపీ అధ్యక్షుడు నడ్డాను ఎందుకు అరెస్టు చేయడం లేదని నిలదీశారు. కాగా, కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఆప్ ఆదివారం సామూహిక నిరహార దీక్షలు చేపట్టింది. దేశవ్యాప్తంగా ఆప్‌తోపాటు ఇండియా కూటమి నేతలు ఈ దీక్షలు చేపట్టినట్టు పార్టీ తెలిపింది.

ఎన్ఐఏ అధికారులపై లైంగిక వేధింపుల కేసు

నమోదు చేసిన పశ్చిమ బెంగాల్ పోలీసులు

» పేలుడు కేసులో నిందితుల కుటుంబసభ్యుల ఫిర్యాదే ఆధారం



భూపతినగర్‌లో మహిళల వాగ్వాదం

కోల్‌కతా, ఏప్రిల్ 7: జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులపై పశ్చిమ బెంగాల్ పోలీసులు లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు. ఎన్ఐఏ అధికారులపై శనివారం తూర్పు మిద్నపూర్ జిల్లా భూపతినగర్‌లో రాళ్లదాడి జరిగిన కొన్ని గంటలకే ఎన్ఐఏ అధికారులపై పోలీసులు లైంగిక వేధింపుల కేసు నమోదు చేయడం గమనార్హం. 2022 డిసెంబరు 3న భూపతినగర్‌లోని ఓ ఇంట్లో పేలుడు సంభవించి ముగ్గురు మృతిచెందారు. ఆ కేసు దర్యాప్తులో భాగంగా ఎన్ఐఏ అధికారులు శుక్రవారం అర్ధరాత్రి భూపతినగర్‌లో సోదాలు జరిపి అధికార తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) పార్టీ కార్యకర్తలు మనబ్రతో జన, బలాయి మైతీలను అరెస్టు చేశారు. ఆ ఇద్దరినీ తమ వాహనాల్లో కోల్‌కతాకు తీసుకెళ్తుండగా గ్రామస్థులు శనివారం ఎన్ఐఏ అధికారుల వాహనాలపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. అయితే, అరెస్టయిన మనబ్రతో జన కుటుంబంలోని ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎన్ఐఏ అధికారులపైనే పోలీసులు లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు. అర్ధరాత్రి తమ ఇంటి తలుపులు పగలగొట్టి లోపలికి ప్రవేశించిన ఎన్ఐఏ అధికారులు తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని ఆ మహిళ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇది భారత రాజ్యాంగంపై దాడి: బీజేపీ

భూపతినగర్ ఘటనపై బీజేపీ, టీఎంసీ మధ్య మాటల యుద్ధం మొదలైంది. 'కేంద్ర సంస్థలపై దాడిచేయడమంటే భారత రాజ్యాంగంపై దాడి చేయడమే. తమ విధులు నిర్వర్తిస్తున్న ఎన్ఐఏ అధికారులపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేయడం అన్ని రాజ్యాంగ వ్యవస్థలూ కుప్పకూలడానికి ఒక సంకేతం' అని బీజేపీ ఎంపీ శామిక్ భట్టాచార్య విమర్శించారు. కాగా, తమ నాయకులు, కార్యకర్తలపై బీజేపీ దాడి ప్రారంభించిందని టీఎంసీ ఆరోపించింది. కాగా, రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి(సీఈవో) ఆరిజ్ ఆఫ్తాబ్ భూపతినగర్ ఘటనపై నివేదిక కోరారు.

బిజినెస్

వోల్టాస్ 20 లక్షల ఏసీ అమ్మకాల మైలురాయి

VOLTAS

న్యూఢిల్లీ: ఇళ్లలో వినియోగించే ఏసీల విభాగంలో అగ్రగామి అయిన వోల్టాస్ 2023-24 ఆర్థిక సంవత్సరంలో 20 లక్షల ఏసీలు విక్రయించి కొత్త రికార్డును నమోదు చేసింది. అమ్మకాలు 35 శాతం పెరిగినట్టు కంపెనీ వెల్లడించింది. దేశీయ మార్కెట్లో ఈ రికార్డును సాధించిన తొలి కంపెనీ తమదేనని పేర్కొంది. ఏసీలకు డిమాండు సంవత్సరం పొడవునా బలంగా ఉండడంతో పాటు విస్తృత ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ నెట్‌వర్క్, కొత్త ఏసీల విడుదల వంటివి ఈ రికార్డు నెలకొల్పడానికి దోహదపడిన అంశాలని ఎండీ, సీఈఓ ప్రదీప్ బక్షి తెలిపారు. ఈ అమ్మకాలతో గృహ వినియోగ ఏసీల విభాగంలో నంబర్ వన్ స్థానం సుస్థిరం చేసుకున్నామని బక్షి చెప్పారు. టర్కిష్ కంపెనీ ఆర్సెలిక్‌తో తమ జాయింట్ వెంచర్ వోల్టాస్ బెకో బ్రాండ్ హోమ్ అప్లయెన్సులు కూడా 20 లక్షల అమ్మకాల మైలురాయికి చేరువైనట్టు ఆయన తెలిపారు. మొత్తం మీద గత ఏడాది తాము 50 లక్షల గృహోపకరణాలు విక్రయించామని ఆయన వెల్లడించారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



8వ తేదీ			
హైదరాబాద్	375	విజయవాడ	390
చిత్తూరు	458	విశాఖపట్నం	405
గోదావరి	390	వరంగల్	377
		డజను గుడ్లు రూ.60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	156	గోదావరి	152
వరంగల్	156	విజయవాడ	152
కరీంనగర్	156	గుంటూరు	152
మహబూబ్‌నగర్	156	ఒంగోలు	152
కర్నూలు	156	చిత్తూరు	148
విశాఖపట్నం	134		

ఎగుమతులపై మారుతి ఫోకస్

2030 నాటికి 8 లక్షలు టార్గెట్



న్యూఢిల్లీ: మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో రికార్డు ఎగుమతులు నమోదు చేసిన దేశీయ కార్ల దిగ్గజం ఆ జోరును కొనసాగించి కొత్త ఆర్థిక సంవత్సరంలో 3 లక్షల ఎగుమతుల మైలురాయిని చేరాలని భావిస్తోంది. అలాగే 2030 నాటికి 8 లక్షల కార్ల ఎగుమతుల లక్ష్యం నిర్దేశించుకుంది. 100 పైగా దేశాలకు మారుతి సుజుకీ కార్లు ఎగుమతులు చేస్తోంది. ఈ మార్కెట్లన్నింటిలోనూ రాబోయే కాలంలో మరిన్ని కొత్త కార్లు విడుదల చేయాలని కూడా మారుతి యాజమాన్యం నిర్ణయించింది. అలాగే పంపిణీ నెట్‌వర్క్ విస్తరించడంతో పాటు డీలర్‌షిప్‌ల వద్దనే బ్యాంక్ ఫైనాన్సింగ్, సర్వీసింగ్ సదుపాయాల పటిష్ఠతపై దృష్టి సారించాలని కూడా భావిస్తోంది. కొద్ది కాలం క్రితం వరకు తమ ఎగుమతులు 1 నుంచి 1.2 లక్షల పరిధిలోనే ఉండేవని, 2022-23లో 2.59 లక్షలు, 2023-24లో 2.83 లక్షల కార్లు ఎగుమతి చేయగలిగామని కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాహుల్ భారతి తెలిపారు. ఇతర కంపెనీల ఎగుమతులు దిగజారిన సమయంలో సైతం తాము 9 శాతం వృద్ధిని సాధించగలగడం విశేషమని ఆయన చెప్పారు. ప్రస్తుత కార్లనే కాకుండా ఈ ఏడాదిలో ఉత్పత్తి ప్రారంభించనున్న విద్యుత్ కార్లను సైతం జపాన్, యూరప్ వంటి మార్కెట్లకు ఎగుమతి చేయాలని నిర్ణయించామన్నారు. 2030 నాటికి ఎగుమతులను 7.5 లక్షల నుంచి 8 లక్షలకు పెంచడం తమ లక్ష్యమని ఆయన చెప్పారు. ఈ ఏడాది 3 లక్షల ఎగుమతుల మైలురాయిని దాటగలమన్న విశ్వాసం ఆయన ప్రకటించారు. ప్రస్తుత తాము ఉత్పత్తి చేస్తున్న మోడళ్లన్నీ 100 మార్కెట్లలోనూ అందుబాటులో లేవని, ఈ కారణంగా మరిన్ని దేశాల్లో మరిన్ని మోడళ్లను ప్రవేశపెట్టనున్నామని రాహుల్ వెల్లడించారు. దీనికి తోడు భారతదేశంలో తాము అనుసరిస్తున్న ఉత్తమ మార్కెటింగ్ వ్యూహాలన్నీ ప్రవేశపెట్టడం వల్ల ఆయా దేశాల కస్టమర్లలో విశ్వాసం పెరుగుతుందని భావిస్తున్నట్టు చెప్పారు. ఇటీవలే ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో తాము 2,83,067 కార్లు ఎగుమతి చేసినట్లు ఆయన తెలిపారు. విదేశాలకు తాము భారీగా ఎగుమతి చేస్తున్న మోడళ్లలో బాలెనో, డిజైర్, స్విఫ్ట్, ఎస్‌ప్రెసో, గ్రాండ్ విటారా, జిమ్నీ, సెలీరియో, ఎర్టిగా ఉన్నాయని చెప్పారు.

పునరుత్పాదక ఇంధనంపై రూ.2.30 లక్షల కోట్లు



ఖవ్డా/అహ్మదాబాద్ (గుజరాత్): పునరుత్పాదక ఇంధన వనరులపై అదానీ గ్రూప్ పెద్ద ఎత్తున దృష్టి పెట్టింది. సౌర, పవన విద్యుత్ కేంద్రాలతో పాటు, అందుకు అవసరమైన సోలార్ మాడ్యూల్స్, పవన్ విద్యుత్ జనరేటర్ల తయారీపై 2030 నాటికి రూ.2.30 లక్షల కోట్లు ఖర్చు చేయనుంది. ఇందులో రూ.2 లక్షల కోట్లు అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఏజీఈఎల్) ద్వారా ఖర్చు చేయనుంది. ఈ మొత్తంలో రూ.1.5 లక్షల కోట్లు గుజరాత్‌లోని ఖవ్డా వద్ద ఏర్పాటు చేస్తున్న సౌర, పవన్ విద్యుత్ పార్కు కోసం ఖర్చు చేస్తారు. ఈ పెట్టుబడితో 2030 నాటికి ఈ పార్కులో 30,000 మెగావాట్ల సౌర, పవన్ విద్యుత్ ఉత్పత్తి చేయాలని భావిస్తోంది. మిగతా రూ.50,000 కోట్లతో రాజస్థాన్, తమిళనాడుల్లో 6,000-7,000 మెగావాట్ల సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులు చేపడతారు. మరో రూ.30,000 కోట్లు అదానీ న్యూ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఏఎన్ఐఎల్) ద్వారా గుజరాత్‌లోని ముంద్రా వద్ద ఏర్పాటు చేసే ప్లాంట్లలో సోలార్ సెల్స్, విండ్ టర్బైన్ల తయారీ కోసం ఖర్చు చేస్తారు.

45,000 మెగావాట్ల లక్ష్యం: అదానీ గ్రీన్ ఎనర్జీ ఇప్పటికే 10,934 మెగావాట్ల పునరుత్పాదక ఇంధనం ఉత్పత్తి చేస్తోంది. 2030 నాటికి 45,000 మెగావాట్ల లక్ష్యం చేరుకోవాలని భావిస్తోంది. ఇందులో 30,000 మెగావాట్లు కేవలం గుజరాత్‌లోని ఖవ్డా వద్ద ఏర్పాటు చేసే సోలార్, పవన విద్యుత్ పార్క్ ద్వారా లభించనుంది. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద పునరుత్పాదక ఇంధన పార్కు. ప్రస్తుతం ఈ పార్కు నుంచి 2,000 మెగావాట్ల విద్యుత్ మాత్రమే ఉత్పత్తి అవుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం మరో 4,000 మెగావాట్లు అందుబాటులోకి వస్తుంది.

రిలయన్స్ కాపిటల్ కథ మళ్లీ మొదటికి !

న్యూఢిల్లీ: దివాలా ప్రక్రియలో ఉన్న రిలయన్స్ కాపిటల్ కథ ఇప్పట్లో తేలేలా లేదు. రూ.9,650 కోట్లతో ఈ కంపెనీని టేకోవర్ చేసేందుకు హిందుజా గ్రూప్ సంస్థ ఇండస్‌ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ లిమిటెడ్ (ఐఐహెచ్ఎల్) ఈ ఏడాది ఫిబ్రవరిలో వేసిన బిడ్‌కు ఎన్‌సీఎల్‌టీ ఆమోదం తెలిపింది. అయితే రిలయన్స్ కాపిటల్ నిర్వహణలోని నాన్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థకు అవసరమైన మూల ధనం, రుణాలను ఐఐహెచ్ఎల్ ఎలా సేకరిస్తోందో తెలపాలని బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏ కోరింది. దీంతో రిలయన్స్ కాపిటల్ దివాలా పరిష్కార కథ మళ్లీ మొదటికొచ్చినట్టయింది.

22600 పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం పాజిటివ్‌గా ప్రారంభమై 22500 వద్ద రియాక్షన్‌కు గురైనప్పటికీ తిరిగి కోలుకుంది. చివరికి ముందు వారంతో పోల్చితే 185 పాయింట్ల లాభంతో 22500 సమీపంలో క్లోజయింది. గత నాలుగు వారాలుగా నిఫ్టీ ఇక్కడ పరీక్ష ఎదుర్కొంటూనే ఉంది. ఈ విడత కూడా మైనర్ రియాక్షన్ అనంతరం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవడం తక్షణ ముప్పు లేదనేందుకు సంకేతం. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్వల్పకాలిక నిరోధాన్ని బ్రేక్ చేయడం అవసరం. గత వారం మిడ్‌క్యాప్ 100 సూచీ 1950 పాయింట్లు లాభపడి చారిత్రక గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది. స్మాల్‌క్యాప్ 100 సూచీ కూడా 1100 పాయింట్లు లాభపడి చారిత్రక గరిష్ఠ స్థాయి వద్ద పరీక్ష ఎదుర్కొంటోంది. ప్రస్తుతం మార్కెట్ ఐదో సారి చారిత్రక గరిష్ఠ స్థాయి 22550 వద్ద పరీక్షకు గురవుతోంది.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ధోరణిలో ట్రేడయినట్టయితే మరింత అప్‌ట్రెండ్ కోసం గత శుక్రవారం తాకిన ప్రధాన నిరోధం 22600 కన్నా నిలదొక్కుకోవాలి. ఆ పైన మానసిక అవధులు 22800, 23000.

బేరిష్ స్థాయిలు: బలహీనత ప్రదర్శించినా సానుకూలత కోసం 22500 వద్ద నిలదొక్కుకుని తీరాలి. అంత కన్నా దిగజారితే మైనర్ బలహీనతలో పడుతుంది. మరో మద్దతు స్థాయి 22300. ప్రధాన మద్దతు స్థాయిలు 22150, 21950.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం మంచి ర్యాలీ సాధించి 1370 పాయింట్ల లాభంతో 48,500 వద్ద క్లోజయింది. పాజిటివ్ ధోరణిలో ట్రేడయినట్టయితే మరింత అప్‌ట్రెండ్ కోసం ప్రధాన నిరోధం 48650 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ పైన మానసిక అవధి 49000. దిగువన మద్దతు స్థాయి 48000 కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది.

పాటర్న్: సానుకూలత కోసం 22600 వద్ద "అడ్డంగా ఏర్పడిన ట్రెండ్‌లైన్"ను బ్రేక్ చేయాలి. 22300 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి రివర్సల్ ఉండవచ్చు.

సోమ వారం స్థాయిలు	
నిరోధం	22600, 22640
మద్దతు	22460, 22400

www.sundartrends.in

ఫార్మా, ఎనర్జీ షేర్లపై కన్నేయండి

అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు వస్తే ఈ వారం దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సరికొత్త జీవిత కాల గరిష్ఠాలను నమోదు చేసే అవకాశం కనిపిస్తోంది. ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచడంతో మదుపరుల్లో నెలకొన్న గందరగోళం తొలగింది. ఈ వారం నిఫ్టీ 22,700 పాయింట్లను అధిగమిస్తే 22,900 పాయింట్ల వరకు పెరిగే అవకాశం ఉంది. బ్యాంకు నిఫ్టీ 48,900 పాయింట్ల స్థాయిని అధిగమిస్తే 49,600 పాయింట్ల వరకు ఎగబాకే అవకాశం కనిపిస్తోంది. ఈ వారం ఫార్మా, ఎనర్జీ కంపెనీల షేర్లు లైమ్‌లైట్‌లో ఉండవచ్చు.

ఈ వారం స్టాక్ రికమండేషన్లు...

బజాజ్ ఫిన్‌సర్వ్: ఈ ఏడాది ఆరంభం నుంచి స్వల్పకాలిక దిద్దుబాటులో ఉన్న బజాజ్ ఫిన్‌సర్వ్ కంపెనీ షేర్లకు రూ.1,520 వద్ద కీలక మద్దతు లభించింది. ప్రస్తుతం ఈ కౌంటర్ క్రాస్ ట్రెండ్‌లైన్‌ను బ్రేక్ చేసి మార్చి మూడో వారం నుంచి అదరగొడుతోంది. డెలివరీ వాల్యూమ్స్ కూడా పెరుగుతున్నాయి. కొత్త రుణాల్లో నాలుగు శాతం వృద్ధి నమోదు కావడం మరో కలిసొచ్చే అంశం. గత వారం రూ.1,677 వద్ద ముగిసిన ఈ షేర్లలో మదుపరులు రూ.1,725/1,775 టార్గెట్‌తో రూ.1,650 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. రూ.1,615ను స్ట్రిక్ట్ స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీఐ కార్డ్స్: రెండేళ్లుగా డౌన్‌ట్రెండ్‌లో ఉన్న ఈ కంపెనీ షేర్లకు రూ.680 వద్ద మరోసారి మద్దతు లభించింది. ఈ మధ్య డివిడెండ్ ఇవ్వడం, త్వరలో నాలుగో త్రైమాసిక ఫలితాలు ప్రకటించనుండడంతో షేర్ల ధరలో మూమెంటమ్ కనిపిస్తోంది. గత వారం ఎస్‌బీఐ కార్డ్స్ షేర్లు నెల రోజుల గరిష్ఠ స్థాయిని అధిగమించాయి. నిఫ్టీతో పోలిస్తే మెరుగైన పనితీరు కనబరుస్తోంది. శుక్రవారం భారీ వాల్యూమ్స్‌తో పాటు ఐదు శాతం లాభంతో రూ.730 వద్ద క్లోజయ్యాయి. రూ.785/915 టార్గెట్‌తో మదుపరులు రూ.700/720 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. రూ.690ని గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎన్‌బీసీసీ: రెండు నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో ఉన్న ఈ కౌంటర్‌లో ప్రస్తుతం టర్న్ అరౌండ్ కనిపిస్తోంది. రూ.104 వద్ద మద్దతు తీసుకుని క్రమంగా పెరుగుతోంది. గత వారం ఏకంగా 9.28 శాతం లాభంతో రూ.138 వద్ద ముగిసింది. అప్పర్ బొలింజర్ బ్యాండ్ బ్రేకవడం, డెలివరీ వాల్యూమ్స్ పెరగడం ఈ కౌంటర్‌కు ఉన్న సానుకూల అంశాలు. మదుపరులు రూ.145/160 టార్గెట్‌తో రూ.132 పైన పొజిషన్లు తీసుకోవచ్చు. కాకపోతే రూ.130ని స్ట్రిక్ట్ స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఐసీఐసీఐ లొంబార్డ్: చక్కటి అప్‌ట్రెండ్ తర్వాత ఈ కౌంటర్‌లో అక్యుములేషన్ పెరిగింది. ప్రస్తుతం ఈ కంపెనీ షేర్లు 52 వారాల గరిష్ఠ స్థాయిలో కోట్ అవుతున్నాయి. ట్రేడింగ్ వాల్యూమ్స్ సైతం పెరుగుతున్నాయి. బ్రోకరేజి సంస్థలు బై రేటింగ్ ఇవ్వడం ఈ కౌంటర్‌కు మరో సానుకూల అంశం. త్వరలో క్యూ4 ఆర్థిక ఫలితాలు ప్రకటించబోతోంది. దీంతో ఈ కౌంటర్‌లో మరింత మూమెంటమ్ కనిపిస్తోంది. గత వారం 4.85 శాతం లాభంతో రూ.1,717 వద్ద ముగిసింది. రూ.1,770/1,850 టార్గెట్‌తో మదుపరులు రూ.1,700 వద్ద ఈ కౌంటర్‌లో పొజిషన్లు తీసుకోవచ్చు. కాకపోతే రూ.1,660ని స్ట్రిక్ట్ స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎన్‌సీసీ: ఇంజనీరింగ్, నిర్మాణ సంస్థ ఎన్‌సీసీ షేర్లలో బలం కనిపిస్తోంది. మల్టీ ఇయర్ బ్రేకవుట్‌తో ఈ కౌంటర్ మంచి జోరు మీద ఉంది. సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయిని తాకేందుకు పరుగులు పెడుతోంది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్స్ గణనీయంగా పెరుగుతున్నాయి. గత వారం ఎన్‌సీసీ షేర్లు 6.90 శాతం లాభంతో రూ.272.70 వద్ద ముగిశాయి. రూ.290/310 టార్గెట్‌తో మదుపరులు రూ.260 వద్ద ఈ కౌంటర్‌లో పొజిషన్లు తీసుకోవచ్చు. రూ.240ని గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

అమ్రాబాద్ అభయారణ్యంలో మళ్లీ కార్చిచ్చు

» 100 హెక్టార్ల విస్తీర్ణంలో మంటలు అంటుకుని నష్టం

మన్ననూర్, ఏప్రిల్ 7: రోజురోజూ ఎండలు మండిపోతున్నాయి. మరోవైపు అడవుల్లో చెట్ల ఆకులు రాలుతున్నాయి. ఈ నేపథ్యంలో అడవుల్లో నిప్పురాజుకుని తరచూ మంటలు చెలరేగుతున్నాయి. నల్లమల అడవిలో ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారం నుంచి తరచూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ పులల అభయారణ్యం ప్రాంతంలో శనివారం రాత్రి మరోసారి కార్చిచ్చు రగిలి వంద హెక్టార్ల విస్తీర్ణంలో అడవి అగ్నికి ఆహుతైపోయింది. రాత్రి 11 గంటల ప్రాంతంలో మన్ననూరు వెస్ట్‌బీట్‌లోని తాళ్ల చెలక, గుండం అటవీ ప్రాంతంలో మంటలు చెలరేగినట్లు శాటిలైట్ యాప్ (ఎంవోడీఐఎస్, ఎస్ఎన్‌పీటీ) ద్వారా సమాచారం అందుకున్న డీఎఫ్‌వో రోహిత్ గోపిడి, అమ్రాబాద్, మన్ననూరు రేంజ్ అధికారులు ఆదిత్య, ఈశ్వర్, బీట్ అధికారులు హన్మంతు, మధు, కార్తీక్, క్విక్ రెస్పాన్స్ బృందం, బేస్ క్యాంపు వాచర్లు రెండు బృందాలుగా ఏర్పడి రాత్రంతా బ్లోయర్ల సాయంతో శ్రమించి మంటలను ఆర్పివేశారు. మంటలను అదుపు చేసేందుకు కృషి చేసిన అటవీ సిబ్బందిని డీఎఫ్‌వో రోహిత్ అభినందించారు. మానవ తప్పిదాలతో అడవిలో మంటలు చెలరేగుతున్నాయని, అటవీ సమీప గ్రామాల ప్రజలు, శ్రీశైలం-హైదరాబాద్ రహదారి మీదుగా ప్రయాణించే వారు బీడీలు, సిగరెట్లు కాల్చిపారేయడం, వంటలు చేసుకోవడం వంటివి చేయవద్దని కోరారు.



అడవిలో ఎగిసిపడుతున్న మంటలు

రేపు కొంచెం కూల్!

(మొదటి పేజీ తరువాయి)

పడిపోయే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇక సోమవారం, మంగళవారం కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశముందని తెలిపింది. ప్రస్తుతం అన్ని జిల్లాల్లో ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసి ఉండగా, మంగళవారం మాత్రం యెల్లో అలెర్ట్ జారీ చేసింది. ఇక ఆదివారం కూడా రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోయాయి. నల్లగొండ జిల్లా నిడమనూరు, సూర్యాపేట జిల్లా శాంతినగర్‌లో గరిష్ఠంగా 44.5, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేట, మంచిర్యాల జిల్లా హాజీపూర్‌లో 44.4, సూర్యాపేట జిల్లా మునగాల, వనపర్తి జిల్లా కొత్తకోటలో 44.3, నల్లగొండ జిల్లా తెల్లదేవరపల్లిలో 44.2, అదే జిల్లా కమ్మిరెడ్డిగూడెం, గూడ్పూరు, జగిత్యాల జిల్లా కొల్వాయిలో 44.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ కేంద్రం పేర్కొంది. ఇటు సూర్యాపేట జిల్లా తంగతుర్తి మండలం వెంపటిలో వడదెబ్బ తగిలి భోనగిరి అవిలమ్మ (60) మృతి చెందింది. రజక వృత్తిలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం ఊరిలో కొందరి ఇళ్లకెళ్లి దుస్తులు ఉతికిన ఆమె తీవ్ర అస్వస్థతకు గురైంది. ఈ నేపథ్యంలోనే ఆమెను ఇంటికి చేర్చగా.. పరిస్థితి విషమించి సాయంత్రం మరణించింది.

లోకం తీరు



జగన్‌కు ఈసీ నోటీసులు

» చంద్రబాబును 'అరుంధతి' సినిమాలో 'పశుపతి' పాత్రతో పోలుస్తూ చేసిన వ్యాఖ్యలపై సీరియస్

» 48 గంటల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం

» ఈసీ అయితే నాకేంటి? నేనింతే!

» ముఖ్యమంత్రి జగన్ ధిక్కారశైలి

» నోటీసు అందుకున్నా మళ్లీ అదే తప్పు

» చంద్రబాబుపై దూషణలు.. అడ్డగోలు భాష



అమరావతి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబును 'అరుంధతి' సినిమాలో 'పశుపతి' పాత్రతో పోలుస్తూ వైసీపీ అధ్యక్షుడు, సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) సీరియస్ అయింది. జగన్ వ్యాఖ్యలు కోడ్‌ను ఉల్లంఘించడమేనని నిర్ధారించింది. జగన్ వ్యాఖ్యలపై అందిన ఫిర్యాదుల మేరకు సీఈసీ సూచనలతో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనా ఆయనకు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 2, 3, 4 తేదీల్లో మదనపల్లె, పూతలపట్టు, నాయుడుపేటలో 'మేమంతా సిద్ధం' పేరుతో నిర్వహించిన సభల్లో.. చంద్రబాబు మీద చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. నోటీసులు అందిన 48 గంటల్లో వివరణ ఇవ్వకపోతే తదుపరి చర్యల కోసం కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిస్తామని మీనా సదరు నోటీసులో స్పష్టం చేశారు. ఈసీ నుంచి ఆదివారం ఉదయం నోటీసులు అందుకున్న జగన్.. 'నేనింతే.. అలాగే నోరు పారేసుకుంటా. అడ్డగోలుగా మాట్లాడుతా' అని ఆదివారం సాయంత్రం పొదిలిలో నిర్వహించిన సభ సాక్షిగా నిరూపించుకున్నారు. చంద్రబాబును పదేపదే తిట్టారు. శాడిస్టుగా అభివర్ణించారు. సంక్షేమ పథకాలు అమలు కాకుండా శాడిస్టులా అడ్డుకుంటున్నారని అడ్డగోలు భాష వాడారు. 'నన్ను ప్రశ్నించకముందు ప్రతిపక్షనేత చంద్రబాబును పది తిట్లు తిట్టా... ప్రశ్నించాక పాతిక తిట్లు తిడతా... ఏం చేసుకుంటారో చేసుకోండి' అని ఈసీకి సవాల్ విసిరారు. "ఎన్నికల కమిషన్ అయితే నాకేంటి? రాజ్యాంగ వ్యవస్థలయితే నాకేంటి? నేనింతే.." అన్నట్టుగా వ్యవహరించారు. ఒకవైపు జగన్ తీరు ఇలా ఉండగా.. మరోవైపు ఆయన పార్టీ సోషల్ మీడియా కూడా అదే బాటలో నడుస్తోంది. ఈసీ ఆదేశాలను ఏ మాత్రం లెక్కచేయడం లేదు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లను కించపరిచేలా వైసీపీ అధికారిక సోషల్ మీడియాలో ఇటీవల పలు పోస్టులు పెట్టారు. వృద్ధులకు పెన్షన్లు ఇవ్వకుండా ఈసీ అడ్డుకున్నట్టుగా, మరోవైపు చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఈ చర్యలను ఎంజాయ్ చేస్తున్నట్టుగా పోస్టు పెట్టారు. ఇలాగే ఇద్దరిపై పలు పోస్టులు పెట్టారు. వాటిని తొలగించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించినా ఏమాత్రం ఖాతరు చేయట్లేదు.

తెలంగాణ అటవీశాఖ పనితీరు భేష్

» పర్యావరణవేత్త ఎరిక్ సోలైమ్

హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అడవులు, వన్యప్రాణుల సంరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న తెలంగాణ అటవీశాఖ పనితీరు భేష్.. అని ప్రముఖ పర్యావరణవేత్త ఎరిక్ సోలైమ్ తెలిపారు. ఆదివారం ఆయన ఎక్స్(ట్విట్టర్) వేదికగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు తెంగాణ రాష్ట్ర అటవీశాఖ చేపడుతున్న చర్యలను... అధికారులు, సిబ్బంది పనితీరును ప్రశంసించారు. అడవుల్లో విస్తరిస్తున్న మంటలను ఆర్పుతున్న సిబ్బందిని హరిత సైనికులు(గ్రీన్ సోల్జర్స్)గా ఎరిక్ సోలైమ్ అభివర్ణించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మంటలు వ్యాపించకుండా వీరు ప్రాణాలకు తెగించి పోరాడుతున్నందునే అడవులు, వన్యప్రాణులకు రక్షణ లభిస్తున్నదని అన్నారు. రాష్ట్ర అటవీశాఖ పనితీరును గుర్తించినందుకు అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పర్యావరణవేత్త ఎరిక్ సోలైమ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల బంద్

» వారం రోజుల్లో 2.23 టీఎంసీల నీటి విడుదల

నాగార్జునసాగర్, ఏప్రిల్ 7: నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఎడమ కాల్వకు ఆదివారం నీటి విడుదలను అధికారులు నిలిపివేశారు. ఎడమ కాల్వ ఆయకట్టు పరిధిలోకి వచ్చే నల్లగొండ, ఖమ్మం జిల్లాల ప్రజల తాగునీటి అవసరాల కోసం ఈ నెల 1 నుంచి నీటిని విడుదల చేశారు. రోజుకు సుమారు 4,500 క్యూసెక్కుల నీరు విడుదలైంది. వారం రోజుల్లో 2.23 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా, ఆదివారం సాయంత్రానికి 511.20 అడుగులుగా ఉంది. సాగర్ ప్రాజెక్టు నుంచి ఎస్ఎల్‌బీసీకి 1350 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా, ఎగువ నుంచి ఎటువంటి నీటి రాక లేదని అధికారలు తెలిపారు.

దేశవ్యాప్త కులగణన హర్షణీయం : జాజుల

హైదరాబాద్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన చేస్తామనడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ఇదే అంశాన్ని ఎన్నికల మ్యానిఫెస్టోలోనూ చేర్చడంపై రాహుల్‌గాంధీకి ధన్యవాదాలు తెలిపారు. బీసీ రిజర్వేషన్‌ను 50 శాతం పెంచుతామని, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పిస్తామని మ్యానిఫెస్టోలో పొందుపర్చడం అభినందనీయమన్నారు. ఈ నిర్ణయాల వల్ల బీసీల్లో విశ్వాసం మరింత పెరిగిందని ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రం ఏర్పడినా మా బతుకులు మారలేదు

» న్యాయం చేయాలని సీఎంను కోరిన దండోరా

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, ఇపుడు తెలంగాణలోనూ మాదిగల బతుకులు మారలేదని, తమకు న్యాయం చేయాలని కోరుతూ మాదిగ హక్కుల దండోరా జాతీయ, రాష్ట్ర అధ్యక్షుడు దండు సురేందర్, కొంగరి శంకర్ ఆదివారం సీఎం రేవంత్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. మాదిగలకు ప్రత్యేక ఆత్మగౌరవ భవన నిర్మాణం, టికెట్ల కేటాయింపులో ప్రాధాన్యం, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, అన్ని ఎస్సీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయడం, సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునే మాదిగలకు బ్యాంక్ అకౌంట్‌కు సంబంధం లేకుండా రూ.10లక్షలు ఆర్థికసాయం చేయడంతో పాటు మూతపడిన లీడ్ క్యాప్‌ని వెంటనే పునఃప్రారంభించాలని ముఖ్యమంత్రిని కోరారు.

పిస్తా హౌస్‌కు జీహెచ్ఎంసీ నోటీసులు

» కేకులో ఫంగస్ ఉందన్న ఫిర్యాదుపై స్పందన

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉప్పల్‌లోని పిస్తా హౌస్‌కు జీహెచ్ఎంసీ అధికారులు నోటీసులిచ్చారు. అక్కడ తాను కొన్న బనానా కేకులో ఫంగస్ (బూజు) ఉందని ఓ నెటిజన్ ఫిర్యాదు చేశారు. స్పందించిన ఫుడ్‌సేఫ్టీ, ఇతర అధికారులు ఆదివారం ఉప్పల్ జాహిద్‌నగర్‌లోని పిస్తాహౌస్‌కు వెళ్లి పరిశీలించారు. నిర్వహణా లోపాలున్నట్లు గుర్తించారు. ప్లమ్, స్పాంజ్ కేక్, మిల్క్ బ్రెడ్‌ల నుంచి నమూనాలు సేకరించారు. వీటితోపాటు ఫంగస్ ఉన్న బనాన కేకును రాష్ట్ర ఫుడ్ లేబరేటరికి పంపారు. నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు.

40 మంది మహిళలకు లైంగిక వేధింపులు

(మొదటి పేజీ తరువాయి)

వార్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు నిర్ధారణ అయింది. దీంతో ఆ భవనంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. వార్‌రూమ్‌లో పనిచేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని కూడా గుర్తించారు. వారినుంచి వివరాలు సేకరించే ప్రక్రియ సాగుతోంది. నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలను యూనిట్‌గా ఏర్పాటు చేసుకుని నల్లగొండలోనే ట్యాపింగ్ సెంటర్ నిర్వహించారని, రెండు జిల్లాల ప్రతిపక్ష నాయకులు, వారి సన్నిహితుల ఫోన్లను ట్యాప్ చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. కాగా, ట్యాపింగ్‌లో కీలక నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు నల్లగొండ ఎస్పీగా పనిచేశారు. అప్పుడు ఏఎస్పీగా ఉన్న అధికారి తర్వాత ఎస్పీ అయ్యారు. ఆ పరిచయాలతో వివాదాస్పద కానిస్టేబుల్‌ను ట్యాపింగ్ టీమ్‌లో చేర్చుకున్నట్లు సమాచారం. టాస్క్‌ఫోర్స్, సీసీఎస్‌లలో పనిచేసిన ఇతడికి ట్యాపింగ్‌లో కీలక బాధ్యతలివ్వడంతో అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడ్డాడని చర్చ సాగుతోంది.

9 సిమ్‌లు.. బయటకు రానున్న బాధితులు

వివాదాస్పద కానిస్టేబుల్ మొత్తం తొమ్మిది సిమ్‌కార్డులను వినియోగించినట్లు సమాచారం. ఓవైపు రాజకీయ నేతలకు అవసరమైన ఫోన్లతో పాటు, మరోవైపు సొంత వ్యవహారాలకు కూడా ట్యాపింగ్‌ను అడ్డుపెట్టుకున్నట్లు తెలుస్తోంది. మహిళల ఫోన్లను ట్యాప్ చేసి వ్యక్తిగత సంభాషణలు విని లోబర్చుకునేవాడని సమాచారం. తాను కన్నేసిన మహిళలు, ఉద్యోగినులను వేధించాడని చెబుతున్నారు. నల్లగొండ జిల్లాలోని ఓ ఛోటా నాయకుడు అక్రమ వ్యవహారంలో పట్టుబడితే, దానిని అడ్డుపెట్టుకుని ఆయన భార్యను



సైతం బ్లాక్‌మెయిల్ చేశాడు. కాగా, ఇతడి బాధితుల్లో కొందరు త్వరలో బయటకు వచ్చి తమ గోడు వెళ్లబోసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. రియల్ వ్యాపారులను టార్గెట్ చేసి భారీగా వసూళ్లకు దిగడంలో వివాదాస్పద కానిస్టేబుల్‌ది కీలక పాత్రగా చెబుతున్నారు. అక్రమ దందాలు చేసే రైస్ మిల్లర్ల నుంచి నెలవారీ మామూళ్లు, పేకాట శిబిరాల నిర్వాహకుల నుంచి వసూళ్లు చేసేవాడనే ఆరోపణలున్నాయి. అన్నీతానై వ్యవహరిస్తూ నల్లగొండ జిల్లాలోని వాణిజ్య కేంద్రమైన పట్టణానికి చెందిన రౌడీషీటర్ ద్వారా ల్యాండ్ సెటిల్‌మెంట్‌కూ పాల్పడ్డాడు. కొంతమంది అధికారులను సైతం భయపెట్టినట్లు తెలిసింది. గుర్రంపోడ్ వద్ద మాజీ పోలీస్ బాస్ బినామీలకు దాదాపు తొమ్మిది ఎకరాల తోటను ఇప్పించడంలో కీలక పాత్ర పోషించినట్లు సమాచారం.

నాయకుల చుట్టూ బిగుస్తున్న ఉచ్చు!

ట్యాపింగ్ కేసులో అరెస్టయి కస్టడీలో విచారణ ఎదుర్కొంటున్న టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ (ఓఎస్‌డీ) రాధాకిషన్‌రావు వెస్ట్ జోన్ పోలీసులకు పూర్తి సహకారం అందిస్తున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ పెద్దల గుట్టును విప్పుతున్నట్లు సమాచారం. అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్‌రావు, ఇతర ఉన్నతాధికారులు చెప్పినట్లే చేశామని ఆయన ఒప్పుకోవడంతో కేసులో విస్తుపోయే అంశాలు బయటకొస్తున్నాయి. రాధాకిషన్‌రావు పోలీస్ కస్టడీ మరో 3 రోజులు మిగిలి ఉంది. ఆ తర్వాత కేసుతో ప్రమేయం ఉన్న పలువురు రాజకీయ నాయకుల చుట్టూ ఉచ్చు బిగుసుకోనున్నట్లు తెలిసింది. కాగా, ఎవరెవరు ఎలాంటి పనులు చేయించారు..? దానివల్ల ఎవరు లబ్ధి పొందారు..? తమ టీమ్‌కు ఇచ్చిన టాస్క్‌లు ఏంటి? సేకరించిన డేటాతో చేయించిన ఆపరేషన్స్ ఏమిటి? అందుకోసం ఎలాంటి కసరత్తు చేశారు..? ఇలా అనేక అంశాలపై పూర్తి సమాచారాన్ని రాధాకిషన్‌రావు వెల్లడిస్తున్నట్లు చెబుతున్నారు. వీటిని రికార్డు చేస్తున్న విచారణాధికారులు ఆయన చెప్పిన అధికారులు, నాయకుల పేర్లను లిస్టవుట్ చేస్తున్నట్లు సమాచారం. వారికి నోటీసులిచ్చి విడతల వారీగా విచారించనున్నారు. రాధాకిషన్‌రావు కూలకషంగా వెల్లడించిన వివరాలను రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్లతో పాటు నల్లగొండ జిల్లాకు ఒకొక్కరు నాయకత్వం వహించి పని పూర్తి చేశారని తెలిపారు. మరోవైపు ట్యాపింగ్ ఇటీవల చేసింది కాదని, కొంతకాలంగా ఎస్ఐబీ, ఇంటెలిజెన్స్‌లో కొందరు అధికారులు పథకం ప్రకారం ఈ కుట్ర పన్నారని ఇప్పటికే అరెస్టయిన అధికారులు విచారణలో చెప్పారు. ఇందులోభాగంగానే గత ప్రభుత్వ పెద్దలు ఒకే సామాజికవర్గానికి చెందిన ప్రభాకర్‌రావు, వేణుగోపాల్‌రావు, భుజంగరావు, ప్రణీత్‌రావు, రాధాకిషన్‌రావుతో పాటు.. తిరుపతన్న, ఇంకొందరు ఇన్‌స్పెక్టర్లను ఇంటెలిజెన్స్, ఎస్ఐబీలోకి తెచ్చినట్లు తేలింది.

ఆర్ అండ్ బీలో మరో 'ఎక్స్‌టెన్షన్' ఔట్ !

హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో పదవీ విరమణ పొంది.. మళ్లీ అదే పోస్టులో రీ అపాయిట్‌మెంట్ అయిన అధికారులను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కరిగా రిలీవ్ చేస్తోంది. ఇప్పటికే పలు శాఖల్లోని అధికారులను పంపగా.. తాజాగా రోడ్లు, భవనాల శాఖలో ఎక్స్‌టెన్షన్‌లో కొనసాగుతున్న మరో అధికారిని ఇంటికి పంపింది. యాదాద్రి భువనగిరి డివిజన్ ఇంచార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఉన్న యు.శంకరయ్యను ఆ పోస్టు నుంచి రిలీవ్ చేస్తూ ఆర్ అండ్ బీ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ స్థానంలో పూర్తి అదనపు బాధ్యతలతో (ఎఫ్ఏసీ) ఎం. వెంకటేశ్వరరెడ్డికి బాధ్యతలను అప్పగించింది. కాగా, రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పడిన కొద్ది రోజులకే ఆర్ అండ్ బీ శాఖలోని రోడ్స్ ఈఎన్సీ (వాస్తవానికి ఇది చీఫ్ ఇంజినీర్ పోస్టు) రవీందర్‌రావు, భవనాలు, నేషనల్ హైవేస్ ఇంజినీర్ ఇన్ చీఫ్ గణపతి రెడ్డి తమను వారి పదవుల నుంచి రిలీవ్ చేయాలని కోరుతూ ఆ శాఖ సెక్రటరీకి లేఖ రాశారు. అయితే అప్పుడే కొత్త ప్రభుత్వం ఏర్పడడం, శాఖకు కొత్తగా మంత్రి వచ్చిన నేపథ్యంలో వారి లేఖలపై ఉన్నతాధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అనంతరం ఇటీవల రహదారుల ఈఎన్సీ రవీందర్‌రావు స్థానంలో మరో అధికారిని నియమించింది. కాగా, గణపతిరెడ్డి రాజీనామాపై సర్కారు నిర్ణయం తెలియాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు రిటైరై అదే పదవిలో కొనసాగుతూ వచ్చిన రోడ్స్ సీఈ, మరో ఎస్ఈ స్థాయి అధికారితో పాటు, తాజాగా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌తో కలిపి మొత్తం ముగ్గురు అధికారులను రిలీవ్ చేసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం భవనాల ఈఎన్సీగా రిటైరైనా ఏడేళ్ల నుంచి అదే పోస్టులో ఎక్స్‌టెన్షన్‌లో కొనసాగుతున్న గణపతిరెడ్డిని ఎపుడు రిలీవ్ చేస్తారనే చర్చ మొదలైంది. బీఆర్ఎస్ సర్కారు హయాంలో నిర్మించిన సచివాలయం, అంబేడ్కర్ విగ్రహం, అమరుల స్తూపం నిర్మాణాల ఖర్చులపై స్పష్టత వచ్చాకే గణపతిరెడ్డిని రిలీవ్ చేసే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదాలు

» ఇద్దరి మృతి, నలుగురికి తీవ్ర అస్వస్థత

పరవాడ(అనకాపల్లి జిల్లా), ఏప్రిల్ 7: ఏపీలోని అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలోని విశాఖ ఫార్మాసిటీలో శనివారం అర్ధరాత్రి, ఆదివారం తెల్లవారుజామున వేర్వేరు ఫార్మా పరిశ్రమల్లో సంభవించిన ప్రమాదాల్లో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. నలుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆల్కలీ మెటల్స్ లిమిటెడ్ యూనిట్-3 పరిశ్రమలో పైపులైన్ వద్ద విఢైల్ నైట్రేట్ గ్యాస్ లీకైంది. ఈ ఘటనలో విధుల్లో ఉన్న సీహెచ్ రమణ (32) గ్యాస్ పీల్చి కుప్పకూలిపోయాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. నలుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కాగా, అపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్-6 పరిశ్రమలో శనివారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఓ కార్మికుడు మృతి చెందాడు. మరో ముగ్గురు గాయపడ్డారు.

జయాపజయాలను సమానంగా తీసుకోవాలి

» ఫిల్మ్ కట్స్ ఈవెంట్‌లో సినీ దర్శకుడు హను

హనుమకొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): యువత, విద్యార్థులు జయాపజయాలను సమానంగా తీసుకోవాలని టాలీవుడ్ దర్శకుడు హను రాఘవపూడి అన్నారు. వరంగల్ నిట్‌లో జరుగుతున్న స్ప్రింగ్ స్ప్రీ వేడుకల్లో భాగంగా చివరి రోజైన ఆదివారం నిర్వహించిన ఫిల్మ్ కట్స్ ఈవెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హను రాఘవపూడి మాట్లాడుతూ విజయాలు, వైఫల్యాలు ప్రతిరంగంలో ఉంటాయని, వాటిని పట్టించుకోకుండా లక్ష్యం వైపు సాగిపోవాలని సూచించారు. అలాగే సినీ హీరో నవదీప్ మరో ఈవెంట్‌లో పాల్గొని, విద్యార్థులతో మాట్లాడారు.

ఇదేందయ్యా.. ఇది..?

ఉద్యోగులకు రూ.2, 3 లక్షల సప్లిమెంటరీ బిల్లులకు దిక్కులేదు.. ఇద్దరు ఉన్నతాధికారులకు అడ్వాన్సుగా జీతమిచ్చేశారు!

» రెండేళ్లకు రూ.1.25 కోట్లు ఆగమేఘాల మీద విడుదల చేసేశారు

» పాత ప్రభుత్వ పెద్దల అనుమతితో చెల్లింపులు!!

హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రూ.2, 3 లక్షల చిన్న చిన్న మొత్తాలకు సంబంధించిన బిల్లులను రాష్ట్ర ఆర్థిక శాఖ ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచింది. ట్రెజరీ నుంచి టోకెన్ వచ్చిన బిల్లులకూ సొమ్ములు చెల్లించలేకపోతుంది. కానీ కాంట్రాక్టు పద్ధతిలో కొలువుల్లో చేరిన ఉన్నతాధికారులకు మాత్రం రెండేళ్ల జీతాలను ముందస్తుగా చెల్లించేసింది!! గత ప్రభుత్వ పెద్దల అనుమతితో ఆగమేఘాల మీద వారికి అడ్వాన్సుగా వేతనాలు చెల్లించేసింది.

భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచకు చెందిన ఓ టీచర్ 2022 ఆగస్టులో పదవీ విరమణ చేశారు. మొదటి వేతన సవరణ సంఘం(పీఆర్సీ) సిఫారసు ప్రకారం ఆ టీచర్‌కు నెలకు రూ.23,378 చొప్పున వ్యత్యాస సొమ్ము 11 నెలలకు మొత్తం రూ.3,23,158 చెల్లించాల్సి ఉంది. 2022 ఆగస్టులో ఈ బిల్లును చేసి పంపించగా.. ట్రెజరీ నుంచి టోకెన్ జనరేట్ అయింది. ఇప్పటివరకు ఆ సొమ్మును రాష్ట్ర ఆర్థిక శాఖ చెల్లించలేకపోయింది. 2023 ఏప్రిల్‌లో ఈ బిల్లును రీ-షెడ్యూలు చేయగా.. ఈ ఏడాది మార్చి 31తో గడువు మీరిపోయింది. ఈ చిన్న బిల్లును చెల్లించడానికి ఆర్థిక శాఖ మీనమేషాలు లెక్కిస్తోంది. కానీ ఇద్దరు ఉన్నతాధికారులకు మాత్రం రూ.1.25 కోట్ల వేతన సొమ్మును ఆర్థిక శాఖ అడ్వాన్సుగా చెల్లించేసింది. చిరుద్యోగుల పీఆర్సీ వేతన బకాయిలు, గ్రాట్యుటీ వ్యత్యాసం, బీమా, జీపీఎఫ్ పార్ట్ ఫైనల్, మెడికల్ రీ-యింబర్స్‌మెంట్ వంటి చిన్న బిల్లులకు సొమ్ము చెల్లించడానికి నిధులుండవుగానీ పెద్ద తలకాయలకు మాత్రం ఠంచనుగా.. అడ్వాన్సుగా చెల్లించడానికి నిధులుంటాయా? అని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.



30 వేల బిల్లులు పెండింగ్..

రాష్ట్రంలోని చాలామంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు సప్లిమెంటరీ బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రిటైరైన కొందరు ఉద్యోగులకు చెల్లించాల్సిన సొమ్ముల విషయంలోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది. కొన్ని బిల్లులు రెండు మూడేళ్లుగా క్లియర్ కావడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30 వేల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని సంఘాల నేతలు చెబుతున్నారు. ఇలాంటి బిల్లులను క్లియర్ చేయకుండా ఆర్థిక శాఖ తమకు కావాల్సిన వ్యక్తులకు మాత్రం వెంటనే బిల్లులను క్లియర్ చేస్తోందని ఆరోపిస్తున్నారు. ఐటీ శాఖ పరిధిలోని సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ)లో కాంట్రాక్టు పద్ధతిలో నియమితులైన డైరెక్టర్(ఐటీ) పీవీ రమణారావు, అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ ఎస్.కృష్ణారావు ఉన్నారు. వీరికి రెండేళ్ల వేతనాల సొమ్ము రూ.1,25,74,080 చెల్లించడానికి ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చింది. 2023 డిసెంబరు 18న ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అంతర్గత ఉత్తర్వుల (ఓఓఆర్‌టీ నంబరు 1467)ను జారీ చేశారు. పీవీ రమణారావుకు 2024 జనవరి నుంచి 2025 డిసెంబరు వరకు నెలకు రూ.2,50,000 చొప్పున రూ.60 లక్షలను, ఎస్.కృష్ణారావుకు అదే రెండేళ్ల కాలానికి నెలకు రూ.1,20,000 చొప్పున మొత్తం రూ.28,80,000 చెల్లించడానికి అనుమతి ఇచ్చింది. వీటితో పాటు ఇద్దరికీ కలిపి 20 శాతం సీజీజీ అడ్మినిస్ట్రేటివ్ చార్జీల కింద రూ.17,76,000, 18% జీఎస్టీ కింద రూ.19,18,08లను కూడా చెల్లించాలని ఆదేశించింది. ఇలా మొత్తం కలిపి రూ.1,25,74,080 చెల్లించడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసింది. ఈమేరకు సొమ్ము విడుదలైందని తెలిసింది. డిసెంబరు 7న రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది. అంతకంటే ముందే బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలతో ఆర్థిక శాఖ అనుమతి తీసుకుంది. ఉత్తర్వులను డిసెంబరు 18న జారీ చేసింది. కొత్త ప్రభుత్వ ప్రమేయం లేకుండా సొమ్ము విడుదలైపోయినట్లు సమాచారం. అడ్వాన్సుగా వేతనాలు చెల్లించాల్సిన అవసరం ఏంటన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఐపీఎస్‌లకు కాదు.. అయ్యో.. ఎస్‌లకే!

(మొదటి పేజీ తరువాయి)

లేకుండా పోయింది. కొందరు సీనియర్ ఐపీఎస్‌లకూ ఇదే అనుభవం ఎదురైంది. నేరుగా నియమితులైనవారిని అప్రాధాన్య పోస్టింగ్‌లకు పరిమితం చేసి నాన్ కేడర్ ఎస్పీలను జిల్లా పోలీస్ బాస్‌లుగా నియమించారు. ఈ నేపథ్యంలో ఒక దశలో అప్పటి ప్రభుత్వంలోని వారు చెప్పినవారిపై కేసు నమోదు చేయడం, ఇంకా ముందుకెళ్లి అరెస్ట్ చేయడం అనేదే పోలీసింగ్‌గా మారిపోయింది. ఈ తీరుపై విమర్శలు వచ్చినా.. ఎక్కడికక్కడ తొక్కిపెట్టారు.

ఓఎస్డీల చేతుల్లో కీలక విభాగాలు

మావోయిస్టులు, సంఘ విద్రోహ శక్తుల కదలికలపై నిఘా ఉంచే స్పెషల్ ఇన్వెస్టిగేషన్ బ్రాంచ్ (ఎస్ఐబీ), ముఖ్యమంత్రి సహా ప్రముఖుల భద్రతను పర్యవేక్షించే ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ (ఐఎస్‌డబ్ల్యూ), శాంతిభద్రతలను చూసే ఇంటెలిజెన్స్, ప్రాధాన్యత కలిగిన టాస్క్‌ఫోర్స్. ఇలా ఎక్కడికక్కడ ఓఎస్డీలను నియమించుకున్నారు గత పాలకులు. అప్పట్లో ఇంటెలిజెన్స్, ఎస్ఐబీలకు కొంతకాలం ఓఎస్డీగా ప్రభాకర్‌రావు ఒక్కరే బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత ఎస్ఐబీ చీఫ్‌గా వ్యవహరించారు. ఎంకే సింగ్ ఐఎస్‌డబ్ల్యూ చీఫ్‌గా



పదవీ విరమణ చేసినా, తర్వాత కూడా ఆయననే ఓఎస్డీగా కొనసాగించారు. ప్రముఖుల భద్రత ఓ రిటైర్డ్ అధికారి చేతిలో ఉండడం ఏమిటని పోలీస్ శాఖలో చర్చ జరిగినా ప్రభుత్వ నిర్ణయం కావడంతో చేసేదేమీ లేకపోయింది. ఇక ఇటీవల ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయిన టాస్క్‌ఫోర్స్ డీసీపీ (ఓఎస్డీ) రాధాకిషన్‌రావు విరమణ చేసినా ఏళ్ల తరబడి టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీగా కొనసాగించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో అత్యంత కీలకమైన మాదాపూర్ డీసీపీ పోస్టులో నాన్‌కేడర్ అధికారులు బాధ్యతలు నిర్వర్తించారు.

ఎస్పీగా నాన్ కేడర్‌కే ఓటు..

క్షేత్ర స్థాయిలో శాంతిభద్రతల పరిరక్షణ, కేసుల సత్వర దర్యాప్తులో జిల్లా ఎస్పీల పాత్ర అత్యంత కీలకమైనది. కానీ, బీఆర్ఎస్ పాలనలో.. పెద్దగా అనుభవం లేని నాన్‌కేడర్ ఎస్పీలను జిల్లా పోలీస్ బాస్‌లుగా నియమించారు. ఆదిలాబాద్‌లో ఉదయ్‌కుమార్, సంగారెడ్డిలో రమణకుమార్, మహబూబాబాద్‌లో చంద్రమోహన్, నారాయణపేటలో వెంకటేశ్వర్లు.. చెప్పుకొంటూ పోతే అనేక జిల్లాలకు నాన్‌కేడర్ ఎస్పీలే.

ఇక పోస్టింగ్స్ కోసం నాయకులను ప్రసన్నం చేసుకునేందుకు ఎస్పీలు ఎంతవరకైనా వెళ్లేవారు. సూర్యాపేట ఎస్పీగా చేసిన రాజేంద్రప్రసాద్ జిల్లా అప్పటి మంత్రి జగదీశ్‌రెడ్డిని సభా వేదికపైనే జయహో అంటూ కొనియాడారు. ఇది తీవ్ర విమర్శలకు దారితీసింది. కాగా, కొత్త జిల్లాల ఏర్పాటుతో ఐపీఎస్‌ల కొరత ఏర్పడిందని, నాన్‌కేడర్ ఎస్పీలకు బాధ్యతలు అప్పగించామని సర్దిచెప్పుకొనే ప్రయత్నం చేశారు. అయితే, ప్రతిగా డైరెక్ట్ రిక్రూటీ ఐపీఎస్‌ల్లో చాలామందిని అప్రాధాన్య పోస్టుల్లో ఉంచి గుర్తింపు లేకుండా చేశారని.. మరి దీనినేమంటారనే ప్రశ్నలు వచ్చాయి.

సర్కారు మారింది.. పోస్టింగ్స్ తీరూ మారింది

ఇటీవల ప్రభుత్వంతో పాటు పోలీసింగ్‌లోనూ మార్పు రావడంతో గత పోస్టింగ్స్ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. మరీ ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ కేసు నేపథ్యంలో.. పదవీ విరమణ చేసిన అధికారులకు కీలక బాధ్యతలు అప్పగిస్తే ఇలాగే జరుగుతందనే చర్చ జరుగుతోంది. జవాబుదారీ లేకుండా, బాధ్యతారహితంగా, చట్టం, పరిధి తెలియకుండా రాజకీయంగా వచ్చిన ఆదేశాలను అమలు చేయడం వల్ల ట్యాపింగ్ వ్యవహారం మొత్తం పోలీస్ వ్యవస్థకే మచ్చగా మారిందని అంటున్నారు. ఇక రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతోనే పోలీస్ పోస్టింగ్స్ తీరూ మారింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో దాదాపు అన్ని జిల్లాలకు నేరుగా నియమితులైనవారినే ఎస్పీలుగా నియమించారు. ఈ కోణంలోనే హైదరాబాద్‌లో కీలకమైన టాస్క్‌ఫోర్స్ బాధ్యతలను ఐపీఎస్ రేష్మి పెరుమాళ్‌కు అప్పగించారు. మాదాపూర్ డీసీపీగా డాక్టర్ వినీత్‌ను నియమించారు.

ఫోన్‌ట్యాపింగ్‌లో ఎంతటివారినైనా వదిలిపెట్టం

» నయీం కేసు దర్యాప్తు కొనసాగిస్తాం: మంత్రికోమటిరెడ్డి


బుల్లెట్ బైక్ నడుపుతున్న మంత్రి కోమటిరెడ్డి

అర్వపల్లి, ఏప్రిల్ 7: ఫోన్‌ట్యాపింగ్‌లో బాధ్యులైన ఎంతటి వారినైనా వదిలిపెట్టబోమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం అడివెంల గ్రామంలో ముత్యాలమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నయీం కేసు దర్యాప్తు కొనసాగిస్తామని చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. గత ప్రభుత్వం దక్షిణ తెలంగాణలోని ప్రాజెక్టులకు నిధులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. సూర్యాపేట జిల్లాలో మూసీవాగు ఇసుకను విక్రయించి ఆ సొమ్ముతో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి వేల కోట్ల రూపాయలతో ఫాంహౌజ్‌లు నిర్మించుకున్నారని ఆరోపించారు. లిక్కర్ కేసులో తీహాడ్ జైలులో ఉన్న తన బిడ్డ కవిత మాట్లాడని మాజీ సీఎం కేసీఆర్.. కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్ రావులు కరువు పేరుతో రైతులను రెచ్చగొడుతూ రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ 14 సీట్లకు పైగా గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు మండలంలోని జాజిరెడ్డిగూడెం నుంచి అడివెంల గ్రామం వరకు ర్యాలీగా బైక్‌పై కాంగ్రెస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని వెనక కూర్చొబెట్టుకుని వెళ్లారు. సుమారు 14 కిలోమీటర్లు ఎండలో మంత్రి స్వయంగా బుల్లెట్ నడిపారు.

బీజేపీవి విద్వేష రాజకీయాలు: వీహెచ్

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ విద్వేష రాజకీయాలు చేస్తోందని.. మతం పేరుతో అల్లర్లు సృష్టించి మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు కుట్రలకు పాల్పడుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ఆరోపించారు. ఆదివారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాముడి పేరుతో ఓట్లు కొల్లగొట్టాలని బీజేపీ చూస్తోందన్నారు. అయితే అందరి హృదయాల్లో ఆ రాముడు ఎప్పటినుంచో ఉన్నాడని గుర్తు చేశారు. అందుకే.. బీజేపీ రాముడి పేరుతో చేసిన రాజకీయాలను ప్రజలు విశ్వసించడం లేదని చెప్పారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పేదవాడి జీవితం కనిపించిందన్నారు. మ్యానిఫెస్టోనే కాంగ్రెస్ విజయాన్ని ఖాయం చేసిందని వ్యాఖ్యానించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీన వర్గాలు కాంగ్రెస్‌కు ఓటేసి రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని కోరారు.

20 లక్షల ఎకరాలు ఎండిపోవడం పచ్చి అబద్ధం

» రైతులను మా ప్రభుత్వం ఆదుకుంటుంది: జి.చిన్నారెడ్డి

రాంనగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 20 లక్షల ఎకరాలు ఎండిపోయాయని మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ పచ్చి అబద్ధాలు చెబుతున్నారని తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జీ.చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ విశ్రాంత వ్యవసాయ అధికారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సదస్సుకు హాజరైన చిన్నారెడ్డి మాట్లాడుతూ... లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రైతులు, ప్రజలను ప్రతిపక్షాలు తప్పుదారి పట్టిస్తున్నాయని ధ్వజమెత్తారు. రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. గత వానాకాలంలో తక్కువ వర్షపాతం నమోదు కావడం వల్ల సుమారు రెండు లక్షల ఎకరాల వరకు పంట ఎండిపోయిందని, కానీ 20 లక్షలకు పైగా నష్టం కలిగిందని ప్రతిపక్షాలు ప్రచారం చేస్తూ రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గ్రామాల అవసరాలను గుర్తించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారుల సంక్షేమ సంఘం చైర్మన్ బోమిరెడ్డి కృపాకర్ రెడ్డికి ఆత్మీయ సన్మానం జరిగింది.

పొంగులేటి తనయుడికి కస్టమ్స్ సమన్లు

» ఖరీదైన విదేశీ గడియారాలు తెప్పించినట్లు ఆరోపణ

» నిరాధార ఆరోపణలన్న పొంగులేటి హర్షరెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తనయుడు హర్షరెడ్డికి చెన్నై కస్టమ్స్ అధికారులు సమన్లు జారీ చేశారు. విదేశాల నుంచి ఖరీదైన గడియారాలను తెప్పించారని, ఇందు కోసం మధ్యవర్తులకు క్రిప్టో కరెన్సీ, హవాలా రూపంలో డబ్బు చెల్లించారనే ఆరోపణలతో ఈ సమన్లు జారీ చేసినట్లు, దీంతో ఈ నెల 27న విచారణకు హాజరవుతానని హర్షరెడ్డి సమాచారం పంపినట్లు తెలిసింది. అయితే ఈ ఆరోపణల్ని పొంగులేటి హర్షరెడ్డి ఖండించారు. ఈ వ్యవహారంతో తనకు సంబంధం లేదని, తనపై వస్తున్నవన్నీ నిరాధార ఆరోపణలు అని పీటీఐ వార్తా సంస్థతో ఆయన పేర్కొన్నారు. కాగా, హాంకాంగ్‌లో ఉండే భారతీయుడైన ముహమ్మద్ ఫహ్రిద్దీన్ ముబీన్.. ఫిబ్రవరి 5న సింగపూర్ నుంచి ఖరీదైన పటెక్ ఫిలిప్-5740, బ్రెగ్యూట్-2759 వాచీలను అక్రమంగా చెన్నైకి తీసుకువస్తుండగా చెన్నై కస్టమ్స్ అధికారులు గుర్తించి కేసు నమోదు చేశారు. అతని వద్ద పట్టుబడ్డ వాచీల ధర రూ.1.73 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. వీటిలో.. పటెక్ ఫిలిప్‌కి భారత్‌లో డీలర్లు లేరని, బ్రెగ్యూట్‌కు భారత మార్కెట్‌లో స్టాక్ లేదని పేర్కొన్నారు. హర్షరెడ్డి కోసమే నిందితుడు ఈ వాచీలను తీసుకువచ్చినట్లు భావిస్తున్నారు. అలోకం నవీన్ కుమార్ అనే వ్యక్తిని విచారించగా.. ముబీన్, హర్షరెడ్డికి తాను మధ్యవర్తిగా వ్యవహరించానని, వాచీల కొనుగోలుకుగాను హర్షరెడ్డి క్రిప్టోకరెన్సీ, హవాలా రూపంలో డబ్బు చెల్లించారని అతడు చెప్పినట్లు తెలిసింది.


జ్యోతి ప్రజ్వలన చేసి ఉగాది వేడుకలను ప్రారంభిస్తున్న గవర్నర్ కార్యదర్శి బుర్రా వెంకటేశం

రాష్ట్రపతి నిలయంలో ఉగాది వేడుకలు

» ఈ ఏడాది ప్రజల క్రోధంతో దేశానికి ప్రయోజనం

» పంచాంగ శ్రవణంలో వెల్లడి

తిరుమలగిరి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్, బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఆదివారం సాయంత్రం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్రపతి నిలయం అధికారిణి రజినీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ కార్యదర్శి బుర్రా వెంకటేశం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంహైదరాబాద్ వైస్ ఛాన్సలర్ టీ. కిషన్‌రావు, రెయిన్ వాటర్ ఫౌండర్ కల్పన రమేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా ప్రముఖ వేదాంతి చిర్రావూరి విజయ్ అనంత్ పంచాంగ శ్రవణం చేశారు. క్రోధి నామ సంవత్సరంలో ప్రజలకు కలిగే క్రోధం దేశ ప్రయోజనాలకు ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా బుర్రా వెంకటేశం మాట్లాడుతూ రాష్ట్రపతి నిలయం ప్రజలకు సాంస్కృతిక వారధిగా ఉండడం శుభపరిణామమన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

తెలంగాణ టు కడప మద్యం రవాణా

» పంచలింగాల చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న సెబ్ సిబ్బంది

» రూ.14.51 లక్షల సరుకు సీజ్.. ఇద్దరి అరెస్టు


కర్నూలు జిల్లా పంచలింగాల చెక్ పోస్టు వద్ద పట్టుకున్న మద్యం

కర్నూలు, ఏప్రిల్ 7(కర్నూలు): తెలంగాణ మద్యాన్ని భారీగా కడప జిల్లాకు తరలిస్తుండగా సెబ్ అధికారులు పట్టుకున్నారు. శనివారం రాత్రి కర్నూలు జిల్లా పంచలింగాల చెక్ పోస్టు వద్ద రూ.14.51 లక్షల మద్యంను సీజ్ చేశారు. ఆ వివరాలను కర్నూలు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవి కుమార్ ఆదివారం విలేకరులకు వెల్లడించారు. ఈ కేసులో కీలక వ్యక్తి రింగుల బాషాపై ఇప్పటికే కడప, కర్నూలు జిల్లాల్లో 104 కేసులు ఉన్నాయి. ఇవన్నీ ఎర్ర చందనం, మద్యం అక్రమ రవాణ కేసులే. తాజాగా తెలంగాణ మద్యం అక్రమ రవాణాకు సంబంధించి అతనిపై 105వ కేసు నమోదు చేశారు. కడప జిల్లా చాపాడు మండలం ఖాదర్‌పల్లికి చెందిన చింపర్తి రింగుల బాషా సహా మరికొందరు ముఠాగా ఏర్పడి అధికార వైసీపీ ముఖ్య నాయకుల అండదండలతో ఎర్ర చందనం అక్రమ రవాణా సాగిస్తున్నారు. ఎర్ర చందనంపై నిఘా పెరగడంతో కర్ణాటక, తెలంగాణ మద్యం అక్రమ రవాణాపై దృష్టి సారించారు. తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం జింకలపల్లి గ్రామంలోని శ్రీనివాస వైన్స్, వనపర్తిలోని ఎక్సైజ్ శాఖకు చెందిన ఐఎంఎల్ డిపో నుంచి నేరుగా కడప జిల్లాకు మద్యం తరలిస్తున్నారు. అశోక్ లైలాండ్ వాహనంలో వరి పొట్టు మధ్య 240 బాక్సుల (180 మిల్లీ లీటర్ల పరిమాణం కలిగిన 11,520 క్వార్టర్ సీసాలు) తెలంగాణ మద్యం తీసుకు వస్తుండగా కర్నూలు జిల్లా పంచలింగాల చెక్ పోస్టు వద్ద సెబ్ సిబ్బంది పట్టుకున్నారు. మద్యం, వాహనం సీజ్ చేసి, డ్రైవర్ పటాన్ సాగక్, క్లీనర్ షేక్ షఫీలను అరెస్టు చేశారు. వీరితో పాటు మద్యం అక్రమ రవాణాదారుడు రింగుల బాషా, వాహనం యజమాని కందనూరు హబీబుల్లాలపై కేసు నమోదు చేశారు.

బీఆర్‌ఎస్ పోటీయే కాదు

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మాట్లాడుతూ, "సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో ఓటర్లు సహజంగా అధికార పార్టీ పట్ల సానుకూల వైఖరితో ఉంటారు. దీనికితోడు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పట్ల నగర ప్రజల్లో సానుకూలత ఉంది. ఇక్కడి ప్రజలు వెంటనే స్పందించే కరెంటు కోత, నీటి కొరత వంటి సమస్యలూ లేవు. మరోవైపు అధికారం పోయాక బీఆర్ఎస్ పార్టీ నామమాత్రం అయిపోయింది. ఆ పార్టీ అసలు పోటీలోనే లేదు. మైనారిటీ ఓట్లూ కాంగ్రెస్ వైపే ఉన్నాయి. నాయకులంతా కష్టపడితే సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి కచ్చితంగా గెలుస్తాడు. అంతర్గత సమస్యలు ఏమైనా ఉంటే పక్కన పెట్టి సమిష్టిగా కష్టపడి దానం నాగేందర్ గెలుపునకు కృషి చేయండి" అని దిశానిర్దేశం చేశారు. సికింద్రాబాద్‌కు రెండుసార్లు ప్రాతినిధ్యం వహించిన బీజేపీ.. నగరానికి చేసిందేమీ లేదన్న అసంతృప్తి ఓటర్లలో ఉందని రేవంత్ అన్నారు. నగర సమస్యల పట్ల కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందించింది గానీ, కేంద్రం నుంచి నిధులు తెచ్చింది గానీ లేదని విమర్శించారు. ఈ విషయాన్ని ఓటర్లలోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈసారి మైనారిటీ ఓటర్లు కూడా కాంగ్రెస్ వైపే చూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాల పట్ల సానుకూలంగా ఉన్న ఓటర్లను పోలింగ్ బూత్‌కు తీసుకెళ్లేలా చర్యలు చేపట్టాలన్నారు. నియోజకవర్గాల వారీగా సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసి.. అభ్యర్థిని కార్యకర్తలకు పరిచయం చేసే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

ఉమ్మడి ఏపీలో సికింద్రాబాద్ కాంగ్రెస్‌దే..

ఉమ్మడి ఏపీలో ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎంపీలే ప్రాతినిధ్యం వహించిన విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. కష్టపడితే ఈ సీటును మళ్లీ దక్కించుకోవచ్చునన్నారు. సికింద్రాబాద్‌లో తాను రోడ్‌షోల్లో పాల్గొంటానని, దీనికి సంబంధించిన ప్రణాళికను రూపొందించాలని దానం నాగేందర్‌కు సూచించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు మంచి ఆదరణ లభిస్తోందని, నరేంద్రమోదీ ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉన్నందున సహజంగానే బీజేపీపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని పేర్కొన్నారు. ఇక వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని పార్టీ ఎమ్మెల్యేలకు అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజారిటీలు.. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో రెట్టింపు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి టార్గెట్ విధించారు. వరంగల్‌లో ఎన్నికల


సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ నేతలతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సన్నద్ధతపై ఆ నియోజకవర్గ ముఖ్య నేతలతో సీఎం సమీక్ష నిర్వహించారు. బూత్ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు సమన్వయ కమిటీలను తక్షణమే వేసుకోవాలని సూచించారు. నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి కార్యకర్తలకు పార్టీ అభ్యర్థిని పరిచయం చేయాలన్నారు. కష్టపడితే రాష్ట్రంలో పార్టీకి ఎక్కువ సీట్లు వస్తాయని, కేంద్రం నుంచి నిధులు, అనుమతులు సాధించుకోవడానికి ఎక్కువ సీట్లు గెలుచుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. వరంగల్ టికెట్ ఆశించి భంగపడ్డ నేతలనూ పిలిచి పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. ఈ మేరకు పలువురు నేతలతో రేవంత్ మాట్లాడారు. వారి భవిష్యత్తుకు తనదే భరోసా అని హామీ ఇచ్చారు. సికింద్రాబాద్‌పై సమీక్షలో పార్టీ అభ్యర్థి దానం నాగేందర్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అజరుద్దీన్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్ విజయారెడ్డి, పార్టీ నేత ఫిరోజ్‌ఖాన్, కోట నీలిమ తదితరులు పాల్గొనగా, వరంగల్‌పై సమీక్షలో మంత్రి కొండా సురేఖ, పార్టీ అభ్యర్థి కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కొడంగల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గానికి వెళ్లనున్నారు. నియోజకవర్గ స్థాయిలో ఓటర్లను కదిలించేందుకు మూడంచెల సమన్వయ కమిటీల వ్యవస్థను ఏర్పాటు చేయాలని పార్టీ నేతలకు ఇటీవల సూచించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా సీఎం స్వయంగా కొడంగల్‌కు వెళ్లి తన నియోజకవర్గంలో సమన్వయ కమిటీల ఏర్పాటుకు పూనుకుంటున్నారు. నియోజకవర్గంలోని మండల స్థాయి నాయకులతో సమావేశమై కమిటీల కూర్పుపై మాట్లాడనున్నారు. మధ్యాహ్నం వెళ్లి.. సాయంత్రానికి తిరిగి రానున్నారు.

కాంగ్రెస్‌లోకి సోమాజిగూడ కార్పొరేటర్

జీహెచ్‌ఎంసీ పరిధిలోని సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్ ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి దానం నాగేందర్, డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి సమక్షంలో కార్పొరేటర్ తోపాటు పలువురు నాయకులకు సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మా కార్యకర్తలు పోటెత్తే కెరటాలు

'మా పార్టీ కార్యకర్తలు పోటెత్తే కెరటాలు.. పోరాడే సైనికులు' అంటూ కాంగ్రెస్ శ్రేణులను సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. శనివారం తుక్కుగూడలో నిర్వహించిన జనజాతర సభకు వచ్చిన స్పందనపై 'ఎక్స్' వేదికగా ఆదివారం ఆయన ఆనందం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఓ మహాసముద్రం అంటూ ప్రారంభించిన సీఎం.. 'మా కార్యకర్తలు నీటి బిందువులు కాదు.. పేదల బంధువులు.. మా కార్యకర్తలు త్యాగశీలులు.. తెగించి కొట్లాడే వీరులు' అని అభివర్ణించారు. కాంగ్రెస్ కార్యకర్తలు జెండాలు మోసే బోయీలు మాత్రమే కాదు.. ఎజెండాలు నిర్ణయించే నాయకులని పేర్కొన్నారు. 'నిన్నటి తుక్కుగూడ గడ్డపై పోటెత్తిన కాంగ్రెస్ మహాసముద్రపు కెరటాలు చెప్పిన నిజమిది. చేసిన శబ్దమిది' అంటూ కార్యకర్తలు హర్షధ్వానాలు చేస్తున్న ఓ వీడియోను ఎక్స్‌లో పోస్టు చేశారు.

హస్తం గూటికి మరో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే

హైదరాబాద్, భద్రాచలం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌కు చెందిన మరో ఎమ్మెల్యే ఆ పార్టీని వీడారు. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో ఆయన హస్తం గూటికి చేరారు. తెల్లం వెంకట్రావు, ఆయన అనుచరులకు కాంగ్రెస్ కండువా కప్పిన సీఎం రేవంత్‌రెడ్డి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ తరఫున గెలిచిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరిన సంగతి తెలిసిందే. ఇప్పుడు తెల్లం చేరికతో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య మూడుకు చేరింది. బీఆర్ఎస్‌కు చెందిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మరణించారు. దీంతో శాసనసభలో బీఆర్ఎస్ బలం 35కు పడిపోయింది. అలాగే, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్‌కు భద్రాచలం సీటు మాత్రమే దక్కింది. ఆ స్థానం నుంచి గెలుపొందిన తెల్లం వెంకట్రావు కాంగ్రెస్‌లో చేరడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్‌కు ప్రాతినిధ్యం లేకుండా పోయింది. కాగా, మంత్రి పొంగులేటి అనుచరుడిగా పేరున్న తెల్లం వెంకట్రావు.. తొలుత ఆయనతో పాటు కాంగ్రెస్‌లో చేరారు. అయితే, భద్రాచలం టికెట్ సిటింగ్ ఎమ్మెల్యే పోదెం వీరయ్యకే ఇస్తామని కాంగ్రెస్ అధిష్ఠానం తేల్చి చెప్పడంతో వెంకట్రావు మళ్లీ బీఆర్ఎస్‌లో చేరి ఆ పార్టీ నుంచి టికెట్ దక్కించుకుని గెలుపొందారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారం చేపట్టిన తర్వాత తెల్లం వెంకట్రావు మంత్రి పొంగులేటితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పలుమార్లు కలిశారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే, తుక్కుగూడలో శనివారం జరిగిన కాంగ్రెస్ జనజాతర సభకు కూడా హాజరయ్యారు. చివరికి ఆదివారం అధికారికంగా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కాగా, కాంగ్రెస్‌లో చేరిన తెల్లం వెంకట్రావు శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తామని ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ చేరిన తెల్లం తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేతలు..

కామారెడ్డిజిల్లా బీబీపేట్ మండలానికి చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి సమక్షంలో వారంతా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం గాంధీభవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సురేశ్ శెట్కార్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా లాస్యనివేదిత

» ఖరారు చేసిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

» ఎల్లుండి వరంగల్ ఎంపీ అభ్యర్థి ఖరారు!



హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా లాస్యనివేదిత పేరును పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఖరారు చేశారు. ఇటీవలే రోడ్డు ప్రమాదంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మరణించడంతో.. ఆ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. లోక్‌సభ ఎన్నికలతో పాటు కంటోన్మెంట్ స్థానానికి ఉపఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ తరఫున లాస్యనందిత సోదరి లాస్య నివేదిత పేరును ఖరారు చేశారు. ఆదివారం ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌస్‌లో పార్టీ ముఖ్యనేతలతో సమావేశమైన కేసీఆర్.. కంటోన్మెంట్ అభ్యర్థి ఎంపికపై చర్చించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి లక్ష్మారెడ్డి, దివంగత ఎమ్మెల్యే లాస్యనందిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మరోవైపు.. వరంగల్ లోక్‌సభ స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపికపై కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు. ఈ స్థానం నుంచి ముందుగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె కావ్యను ప్రకటించగా.. ఇటీవలే ఆమె కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వరంగల్ అభ్యర్థిగా ఎవరిని పోటీలో నిలపాలన్నదానిపై ఆ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని పార్టీ ముఖ్యులతో కేసీఆర్ సమాలోచన చేసినట్లు తెలుస్తోంది. అభ్యర్థి పేరును ఉగాది మరుసటి రోజు బుధవారం ప్రకటిద్దామని ఒకరిద్దరు నేతలతో ఆయన చెప్పినట్లు తెలుస్తోంది. కాగా, భద్రాచలం అసెంబ్లీ సెగ్మెంట్ బీఆర్ఎస్ సమన్వయ కమిటీ సభ్యులుగా రాంప్రసాద్, తాండ్ర వెంకటరమణారావు, రామకృష్ణ, బోదిబోయిన బుచ్చయ్యతోపాటు మరో ఆరుగురిని నియమించినట్లు కేటీఆర్ పేర్కొన్నారు.

జేపీ నడ్డా సతీమణి కారు చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

ఢిల్లీలో దొంగతనం.. వారాణసీలో కారు స్వాధీనం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7 : బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సతీమణికి చెందిన కారు చోరీ కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. అంతేకాక, ఢిల్లీలో చోరీకి గురైన కారును వారాణసీలో గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. జేపీ నడ్డా భార్య మల్లికా నడ్డాకు చెందిన ఫార్చ్యూనర్ ఎస్‌యూవీ కారు గత నెల 19న ఢిల్లీలోని గోవిందపూరి ప్రాంతంలోని సర్వీస్ సెంటర్ నుంచి చోరీకి గురైంది. దీనిపై మల్లికా నడ్డా కారు డ్రైవర్ అదే రోజున స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఫరీదాబాద్ సమీపంలోని బాద్‌కల్ ప్రాంతానికి చెందిన షాహిద్, శివంగ త్రిపాఠి చోరీ చేసినట్టు గుర్తించారు. కారును నాగాలాండ్ తరలించే క్రమంలో వారాణసీ వద్ద పట్టుబడ్డారు.

మా ఎమ్మెల్యేను ఎలా చేర్చుకున్నారు?

(మొదటి పేజీ తరువాయి)



అప్పులపాలవుతున్నారని, తాగు నీటికి ప్రజలు తండ్లాడుతున్నారని, కాంగ్రెస్ మోసాలపై మహిళలు మండిపడుతున్నారని ధ్వజమెత్తారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీల పేరిట గారడీ చేసిన రాహుల్ గాంధీ ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల ముందు న్యాయ్ పేరిట నయా నాటకానికి తెరతీశారా? అని ప్రశ్నించారు. తెలంగాణకు తీరని అన్యాయం చేసి ఇప్పుడొచ్చి న్యాయ్ అంటే నమ్మేదెవరన్నారు. 'వాళ్లకు అన్నదాతల ఆర్తనాదాలు వినిపించడం లేదా? లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినా స్పందించరా? 200 మందికిపైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నా ఆదుకోరా? చేనేత రంగం సంక్షోభంలో కూరుకుపోయినా కనికరించరా? డిసెంబరు 8న చేస్తానన్న రుణమాఫీపై ఎందుకు మాట్లాడరు?' అని రాహుల్‌గాంధీపై కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు. దేశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఇంకా వెనుకబడి ఉన్నారంటే కారణం కాంగ్రెస్సేనని మండిపడ్డారు. కులగణన పేరిట కొత్త పల్లవి అందుకున్న కాంగ్రెస్‌కు ఓట్లు రాలవని, చేతి గుర్తుకు ఓటేస్తే చేతులెత్తేయడం ఖాయమని తెలంగాణ సమాజానికి అర్థమైపోయిందన్నారు. వంద రోజుల్లోనే హామీలను బొందపెట్టిన కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ ప్రజల చేతిలో గుణపాఠం ఖాయమని కేటీఆర్ పేర్కొన్నారు.

కాంగ్రెస్‌ది ద్వంద్వనీతి

ఒక పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు మరో పార్టీలోకి వెళితే.. వెంటనే వారిపై అనర్హత వేటు పడేలా చట్టసవరణ చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేను ఎలా చేర్చుకున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ రీతి.. నీతి ఇదేనా? అని నిలదీశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా ఆ పార్టీ విధానంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీది ద్వంద్వనీతి అని ఆక్షేపించారు. బీజేపీకి, కాంగ్రెస్‌కు తేడా ఏమిటని నిలదీశారు. పార్టీ ఫిరాయింపులపై రాహుల్‌గాంధీ ఎన్నో మాట్లాడారని, గెలిచే వరకు ఒక మాట.. గెలిచాక మరొకమాట అన్నట్లుగా కాంగ్రెస్.. సిగ్గు లేకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్యేను చేర్చుకుందని కేటీఆర్ విమర్శించారు.

మరో మోసానికి కాంగ్రెస్ సిద్ధం

అమలు చేయలేని హామీలతో అధికారంలోకి వచ్చి తెలంగాణ ప్రజలను నిలువునా మోసం చేసిన కాంగ్రెస్.. తుక్కుగూడ సభతో మరోసారి మోసం చేసేందుకు సిద్ధమైందని మాజీమంత్రి జగదీశ్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నీటి మూటలే అయ్యాయని విమర్శించారు. అధికారం చేపట్టిన వంద రోజుల్లో ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయకుండా.. రాష్ట్ర సంపదను దోచుకోవడంపై దృష్టిపెట్టారన్నారు. రోజుకు 18 గంటలు కష్టపడుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని, దోచుకోవడం కోసమే కష్టపడుతున్నారా? అని ప్రశ్నించారు. ఓవైపు పార్టీ ఫిరాయింపులకు వ్యతిరేకం అంటూనే మరోవైపు.. తమ పార్టీ ఎమ్మెల్యేను పక్కన కూర్చొబెట్టుకున్న కాంగ్రెస్ నేతల తీరును ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు.

బెయిల్ వచ్చేనా?.. జైలులోనేనా?

కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై నేడు కోర్టు తీర్పు.. రేపటితో ముగియనున్న జ్యుడీషియల్ కస్టడీ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టై తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై న్యాయస్థానం సోమవారం తీర్పు వెల్లడించనుంది. ఈడీ గత నెల 15న హైదరాబాద్‌లో కవితను అరెస్టు చేసిన విషయం తెలిసిందే..! 16న ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో హాజరు పరిచింది. తొలుత ఏడు రోజులు, రెండోసారి మూడురోజులు.. ఇలా మొత్తం 10 రోజులపాటు ఈడీ ఆమెను కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని విచారించింది. గత నెల 26న తిహాడ్ జైలుకు తరలించింది. తన కుమారుడికి 11వ తరగతి పరీక్షలున్నాయని, తల్లిగా తాను తన కుమారుడి పక్కనే ఉండాల్సిన అవసరం ఉందని, అందుకే మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరుతూ కవిత కోర్టును ఆశ్రయించారు. ఈ నెల 4న కవిత మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిగింది. వాదనలను విన్న న్యాయమూర్తి కావేరి భవేజా.. సోమవారానికి తీర్పును వాయిదా వేశారు. సాధారణ బెయిల్ పిటిషన్‌పై మాత్రం ఈ నెల 20న వాదనలు వింటామని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కవితకు మధ్యంతర బెయిల్ వస్తుందా? లేదా అనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. అదేవిధంగా.. కవిత జ్యుడీషియల్ కస్టడీ సైతం మంగళవారంతో ముగియనుంది. ఒకవేళ బెయిల్ దొరకక పోతే.. మంగళవారం కవితను మళ్లీ ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ముందు హాజరు పరుస్తారు. మధ్యంతర బెయిల్ పిటిషన్ తిరస్కరణకు గురైతే, సాధారణ బెయిల్ పిటిషన్ విచారణ 20న జరగనుండడంతో.. కవిత జ్యుడీషియల్ రిమాండ్‌ను పొడిగించే అవకాశాలున్నాయని న్యాయ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

సీబీఐ విచారణపై ఎల్లుండి వాదనలు

తిహాడ్ జైలులో ఉన్న కవితను విచారించేందుకు సీబీఐకి రౌస్ అవెన్యూ కోర్టు అనుమతి ఇచ్చింది. దీంతో శనివారం తిహాడ్ జైలులోనే సీబీఐ అధికారులు కవితను విచారించారు. మరోవైపు శనివారమే కవిత తరఫు న్యాయవాది న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సీబీఐ విచారణను రీకాల్ చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. సీబీఐ విచారణకు సంబంధించి తమకు ఎటువంటి సమాచారం లేదని, కనీసం ఆ పిటిషన్ కాపీ కూడా ఇవ్వలేదని, అందుకే స్టేటస్‌కో ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనికి న్యాయమూర్తి నిరాకరించారు. పిటిషన్‌పై సీబీఐ తరఫున కూడా వాదనలు విన్న తర్వాతే.. ఏ ఉత్తర్వులైనా ఇస్తామని స్పష్టంచేశారు. కవితను విచారించడానికి ఏ నిబంధనల ప్రకారం పిటిషన్ దాఖలు చేశారో స్పష్టంగా తెలియజేయాలని సీబీఐని ఆదేశించారు. దీనికి సీబీఐ మూడురోజుల సమయం కోరింది. తదుపరి విచారణను ఈ నెల 10న చేపడతామని న్యాయస్థానం తెలిపింది. ఈ నేపథ్యంలో వరుసగా.. సోమ, మంగళ, బుధవారాల్లో రౌస్ అవెన్యూ కోర్టు కవితకు సంబంధించిన కేసులను విచారించనుంది. అయితే.. కవితకు మధ్యంతర బెయిల్ దొరుకుతుందా? లేదా కస్టడీని పొడిగిస్తారా? సీబీఐ విచారణకు అనుమతి ఇస్తారా? అనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

పురుగు పట్టిన బియ్యం మాకొద్దు!

- రాష్ట్ర బియ్యాన్ని తిరస్కరించిన తమిళనాడు, కేరళ, కర్ణాటక
- 'ఖాప్రా' పురుగులు ఉన్నాయని ఎఫ్‌సీఐకి ఫిర్యాదు
- నిజామాబాద్ జిల్లాలోని గోదాముల్లో జోనల్ కమిటీ తనిఖీ
- ఆరుగురు మేనేజర్లు, 14 మంది టెక్నికల్ అసిస్టెంట్లపై చర్యలు

హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) తెలంగాణ నుంచి సేకరించిన పంపిన బియ్యాన్ని తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలు తిరస్కరించాయి. ప్రజల పీడీఎస్ అవసరాల కోసం ఎఫ్‌సీఐ ఆయా రాష్ట్రాలకు పంపిన బియ్యంలో 'ఖాప్రా' పురుగులు ఉండడమే ఇందుకు కారణం. గన్నీ సంచుల కొనల నుంచి లోపలికి సోకే ఈ ఖాప్రా పురుగులు బియ్యం నాణ్యతను దెబ్బతీస్తాయి. అయితే, తమకు వచ్చిన బియ్యంలో ఖాప్రా పురుగులు ఉన్నాయని తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలు చెన్నైలోని ఎఫ్‌సీఐ జోనల్ కార్యాలయానికి ఫిర్యాదు చేశాయి. దీనిపై విచారణ చేపట్టిన ఎఫ్‌సీఐ పురుగులు పట్టిన బియ్యాన్ని సేకరించినందుకు నిజామాబాద్ జిల్లాలో పనిచేస్తున్న ఆరుగురు మేనేజర్లు, 14 మంది టెక్నికల్ అసిస్టెంట్లపై శాఖాపరమైన చర్యలకు ఆదేశించింది. ఈ 20 మందిని నాన్ ప్రొక్యూర్మెంట్ విభాగానికి బదిలీ చేయాలని ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ రీజియన్ కార్యాలయంతో సంబంధం లేకుండా నేరుగా చెన్నై జోనల్ కార్యాలయం నుంచే ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో నిజామాబాద్, నల్లగొండ, ఖమ్మం, కరీంనగర్, వరంగల్ జిల్లాలతోపాటు హైదరాబాద్‌లోని తార్నాక గోదాముల నుంచి కేరళలోని త్రివేండ్రం, పాలక్కాడ్, తమిళనాడులోని చెన్నై, కోయంబత్తూర్, వెళ్లూర్, కర్ణాటకలోని షిమోగ ప్రాంతాలకు బియ్యం వెళ్లాయి. ఇలా వెళ్లిన బియ్యంలో 'ఖాప్రా' పురుగులు ఉన్నట్లు ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై స్పందించి పరీక్షలు చేయించిన ఎఫ్‌సీఐ జోనల్ అధికారులు బియ్యంలో 'ఖాప్రా' పురుగులు, లార్వా ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆ బియ్యం ఎక్కడి నుంచి వచ్చాయి? అనే అంశంపై ఆరా తీశారు. ఈ నేపథ్యంలో చెన్నై నుంచి ఇటీవల రాష్ట్రానికి వచ్చిన జోనల్ కమిటీ నిజామాబాద్ జిల్లాలోని సారంగాపూర్ ప్రాంతంలో ఉన్న సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదాముల్లో తనిఖీలు నిర్వహించింది. ఈ ఏడాది ఫిబ్రవరి 21, 28 తేదీల్లో సారంగాపూర్ గోదాముల నుంచి ఎఫ్‌సీఐకి పంపించిన బియ్యంలో ఖాప్రా లార్వా ఉన్నట్లు గుర్తించింది. ఆ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా నిజామాబాద్‌లోని ఎఫ్‌సీఐ క్వాలిటీ కంట్రోల్ విభాగానికి చెందిన మేనేజర్లు, టెక్నికల్ అసిస్టెంట్లపై చర్యల తీసుకున్నారు. అలాగే, పురుగులు ఉన్న బియ్యం ప్రొక్యూర్మెంట్ చేసిన కరీంనగర్, వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల అధికారులు, సిబ్బందిపైనా చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ రీజినల్ కార్యాలయానికి ఆదేశాలు వచ్చాయి. అయితే, ఒకేసారి 20 మంది బదిలీ అంటే సమస్యలు ఎదురవుతాయని, చర్యలు తీసుకోకుండా ఉపేక్షించాలని ఎఫ్‌సీఐ క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది అసోసియేషన్ హైదరాబాద్ రీజినల్ మేనేజర్‌ను కోరాయి. జోనల్ కార్యాలయం నుంచి ఆదేశాలు రావడంతో తానేమీ చేయలేనని రీజినల్ మేనేజర్ వారికి చెప్పినట్లు సమాచారం. కాగా, బియ్యం సరఫరా చేసిన మిల్లర్లు, ప్రొక్యూర్మెంట్‌ను పర్యవేక్షించిన పౌర సరఫరాల సంస్థ అధికారులు, ప్రొక్యూర్మెంట్ జనరల్ మేనేజర్, ఇతర సిబ్బందిపైనా చర్యలు తీసుకోవాలని ఎఫ్‌సీఐ సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు.

సంబంధం లేని కేసులో నన్ను ఇరికించారు

- కావాలనే హైదరాబాద్ సీపీ వేధిస్తున్నారు: శివానంద రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తనకు సంబంధం లేని కేసులో తనను ఇరికించారని, హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి కావాలనే తనను వేధిస్తున్నారని టీడీపీ నేత, వెసెల్లా గ్రూప్ ఎండీ, సీఈవో మంద్ర శివానంద రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటనను విడుదల చేశారు. హైదరాబాద్ శివారులోని బుద్వేల్ భూముల వివాదంలో 2022లో సీసీఎస్ పోలీసులు టీజే ప్రకాశ్, కె. గాంధీలపై నాలుగు కేసులు నమోదు చేసి, చార్జిషీట్ దాఖలు చేశారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత హైదరాబాద్ సీపీగా నియమితులైన కొత్తకోట శ్రీనివాసరెడ్డి, ఎఫ్ఐఆర్‌లో తన పేరు లేకపోయినా కావాలనే తనను ఈ కేసులో ఇరికించారని ఆరోపించారు. కేసు దర్యాప్తులో భాగంగా ఆరుగురు ఏసీపీల బృందం జనవరి 30న వెసెల్లా కార్యాలయంతోపాటు, భాగస్వాముల ఇళ్లు, కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించి, కంప్యూటర్లు, పత్రాలు స్వాధీనం చేసుకుందన్నారు. దీనిపై తాము హైకోర్టును ఆశ్రయించామని ఆయన తెలిపారు.

రంగనాయక సాగర్‌పై గోదావరి బోర్డు చైర్మన్ ఆరా

చిన్నకోడూరు, ఏప్రిల్ 7: సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ ప్రాజెక్టును ఆదివారం గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ (జీఆర్ఎంబీ)బోర్డు చైర్మన్ శివనందన్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా సొరంగ మార్గంలోని సర్జిపూల్ పంప్‌హౌస్, డెలివరీ సిస్టర్న్, బండ్, రిజర్వాయర్‌ను పరిశీలించారు. బోర్డు చైర్మన్ వెంట ఈఎన్‌సీ హరీరాం, ఎస్ఈ బస్వరాజ్, ఈఈ గోపాలకృష్ణ, అధికారులు ఉన్నారు.



శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవిదేవి ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకు న్నారు.జస్టిస్ టి.మాధవిదేవిని రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

విచారణకు ఎవరినైనా పిలుస్తాం

- వంద రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక
- జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి ప్రకటన
- యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్లు, ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోలుపై విచారణ

హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోలు ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్ల నిర్మాణంపై విచారణ ప్రారంభమయింది. విచారణ బాధ్యత చేపట్టిన జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి ఆదివారం బూర్గుల రామకృష్ణారావు భవన్‌లోని 7వ అంతస్తులో ఉన్న కమిషన్ కార్యాలయంలో ఈ ప్రక్రియను ప్రారంభించారు. దాదాపు రెండు గంటల పాటు అధికారులతో సమావేశమై. విచారణ విధివిధానాలతోపాటు ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోలు ఒప్పందానికి చెందిన పత్రాలు, యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణాలకు సంబంధించిన ఫైళ్లను తెప్పించుకొని అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోలు ఒప్పందంతోపాటు యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్ల నిర్మాణంలో భాగస్వాములైన వారినందరినీ విచారణకు పిలుస్తామన్నారు. అధికారులతోపాటు ప్రజాప్రతినిధులనూ పిలిచి ప్రశ్నిస్తామని తెలిపారు. ఈ మేరకు వచ్చే వారం ఆయా నిర్ణయాలకు బాధ్యులైన అధికారులు హాజరై, వివరాలు/అభిప్రాయాలు అందించాల్సిందిగా లేఖలు రాస్తామన్నారు. మూడు అంశాలపై విచారణ బాధ్యతను ప్రభుత్వం అప్పగించిందని, వంద రోజుల్లోపు విచారణ జరిపి, నివేదికను ప్రభుత్వానికి అందిస్తానని వెల్లడించారు. ఈ ఒప్పందాలపై తమ అభిప్రాయాలు తెలియజేయాలనుకునే వారితోనూ మాట్లాడతామని దానికన్నా ముందు దీనిపై అభిప్రాయాలు/సూచనలు/సలహాలను స్వీకరిస్తామని ప్రకటించారు.

కమిషన్‌కు సమాచారం ఇవ్వవచ్చు..

సాంకేతిక పరిజ్ఞానం ఉన్నవారు కూడా కమిషన్‌కు సమాచారం ఇవ్వవచ్చని జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి అన్నారు. రికార్డులను పరిశీలించిన అనంతరం అధికారులకు లేఖలు రాస్తామని, ఆయా నిర్ణయాల్లో ఎవరి పాత్ర ఏ మేరకు ఉందో తేలుస్తామని చెప్పారు. విచారణకు సంబంధించి ఆదివారం ఆయన దాదాపు రెండుగంటల పాటు ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ఎస్ఏఎం రిజ్వీ, ట్రాన్స్‌కో జేఎండీ సి.శ్రీనివాసరావుతో భేటీ అయ్యారు. ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్తు కొనుగోలు ఒప్పందానికి గల కారణాలేంటి.? ఈ ఒప్పందంతో ఎంత మేర నష్టం జరిగింది? వంటి వివరాలతోపాటు భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణంతో పాటు యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు సంబంధించి పలు వివరాలు తెలుసుకున్నారు.

తెలంగాణలో బీజేపీ నంబర్ 1..లేదా 2

అక్కడ ఆ పార్టీ పుంజుకుంటోంది.. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ మళ్లీ గెలవడం కష్టమే.. పీటీఐ ఇంటర్వ్యూలో ప్రశాంత్ కిశోర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీజేపీ పుంజుకుంటోందని ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ రాష్ట్రంలో గణనీయంగా ఓట్లు, సీట్లు సాధించి మొదటి లేదా రెండో స్థానంలో నిలిచే అవకాశం ఉందని ఆయన జోస్యం చెప్పారు. అలాగే.. ఏపీలో జగన్ మళ్లీ అధికారంలోకి రావడం కష్టమేనని ఆయన స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా నెలకొన్న సార్వత్రిక ఎన్నికల సందడి నేపథ్యంలో 'ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (పీటీఐ)' సంపాదకులకు ఆయన ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ఏప్రిల్ 19 నుంచి మొదలవుతున్న ఈ ఎన్నికల్లో బీజేపీ 300కి పైగా సీట్లు సాధిస్తుందని.. అయితే, ఆ పార్టీ పెట్టుకున్న 370 సీట్ల లక్ష్యాన్ని సాధించలేకపోవచ్చని పేర్కొన్నారు. బీజేపీ దూకుడుకు అడ్డుకట్ట వేసేందుకు విపక్షాలకు గతంలో పలు అవకాశాలు వచ్చినా ఉపయోగించుకోలేకపోయాయని వ్యాఖ్యానించారు. దేశంలోని 543 లోక్‌సభ స్థానాలకుగాను.. తూర్పు, దక్షిణాది రాష్ట్రాలైన పశ్చిమబెంగాల్, బిహార్, ఒడిశా, తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాల్లో 204 సీట్లున్న సంగతి తెలిసిందే. వీటిలో.. 2014లో బీజేపీ గెలుచుకున్న సీట్లు 29. ఆ తర్వాత 2019లో గెలుచుకున్నవి 47 సీట్లు. కానీ, ఈసారి ఆయా రాష్ట్రాల్లో బీజేపీ తన సీట్లను, ఓట్లశాతాన్ని గణనీయంగా పెంచుకుంటుందని పీకే అంచనా వేశారు. ముఖ్యంగా.. తెలంగాణలో మొదటి లేదా రెండో స్థానంలో నిలుస్తుందని, అది చాలా పెద్ద విషయమని పీకే తెలిపారు. అలాగే.. ఒడిశా, బెంగాల్‌లో కాషాయపార్టీ నంబర్‌వన్ స్థానంలో నిలుస్తుందన్నారు. తమిళనాడులో బీజేపీ ఓటు షేరు రెండంకెల శాతానికి చేరుతుందన్నారు. ఇక.. ఏపీలో ఈసారి జగన్ అధికారంలోకి రావడం చాలా కష్టమని పీకే అభిప్రాయపడ్డారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే నాయకుడిలా కాక.. ఓటర్లకు ఒక ప్రొవైడర్‌లా(ఇచ్చేవాడిలా) ఆయన వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. జగన్ తీరు గతకాలపు మోనార్కులను తలపిస్తోందన్నారు. భూపేశ్ బఘేల్ (ఛత్తీస్‌గఢ్ గత సీఎం) మాదిరిగా ప్రజలకు డబ్బు పంచడానికే జగన్ పరిమిత కావడంతో అభివృద్ధి స్తంభించిందన్నారు. 'ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన నాయకుడు.. ప్రజలకు డబ్బులివ్వడమే కాదు.. వారి ఆకాంక్షలనూ నెరవేర్చాలి. 'నేను రాజును.. మీకేం కావాలో నాకు తెలుసు. అది మీకు ఇస్తున్నా కాబట్టి నాకు ఓట్లేయండని అనుకుంటే కుదరదు. జగన్ తీరు ఇదే. 'నేను డబ్బులు పంచుతూ పోతుంటా.. మీకిదే మంచిది. రోడ్లు వేసినా వేయకున్నా.. రాజధాని ఉన్నా లేకపోయినా.. ఫ్యాక్టరీలు కట్టినా కట్టకున్నా.. నెలకు 2వేలు ఇస్తుంటా' అని భావిస్తున్నారని వెల్లడించారు. నగదు బదిలీ ద్వారా ప్రజలకు జగన్ డబ్బులు ఇచ్చారుగానీ.. ఉద్యోగాలు కల్పించడానికి, రాష్ట్రాభివృద్ధికి ఎలాంటి చర్యలూ తీసుకోలేదని విమర్శించారు.



తిరగాల్సింది ఒకచోటయితే..

బీజేపీకి బాగా పట్టున్న పశ్చిమ, ఉత్తరాది రాష్ట్రాల్లోని కనీసం 100 సీట్లలో ఆ పార్టీని విపక్షాలు.. మరీ ముఖ్యంగా కాంగ్రెస్ ఓడించగలిగితేనే కమలనాథులకు ఆ సెగ తాకుతుందని.. కానీ, అలా జరిగే అవకాశం లేదని పీకే తేల్చిచెప్పారు. మోదీ, అమిత్ షా వంటి బడా నేతలు తూర్పు, దక్షిణాది రాష్ట్రాల్లో తరచుగా పర్యటించడం వల్ల బీజేపీ ఆయా రాష్ట్రాల్లో తన ప్రాబల్యాన్ని గణనీయంగా పెంచుకుందని గుర్తుచేశారు. "గత ఐదేళ్లలో తమిళనాడులో మోదీ చేసిన పర్యటనల సంఖ్యను.. యుద్ధరంగంలాంటి రాష్ట్రాల్లో రాహుల్/సోనియా లేదా మరే ఇతర విపక్ష నేత చేసిన పర్యటనల సంఖ్యను లెక్కపెట్టండి! మీరు (రాహుల్/సోనియా) పోరాడాల్సింది యూపీ బిహార్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో. కానీ, మీరు పర్యటిస్తున్నది మణిపూర్, మేఘాలయ వంటి రాష్ట్రాల్లో. ఇలా అయితే మీరెలా గెలుస్తారు?" అని ప్రశాంత్ కిశోర్ నిలదీశారు. ఒక్క కేరళలో గెలిస్తే దేశమంతా గెలిచినట్టు కాదన్నారు. "మీరు యూపీ, బిహార్, మధ్యప్రదేశ్‌లో గెలవనప్పుడు.. ఒక్క వయనాడ్‌లో గెలవడం వల్ల ఉపయోగమేమీ ఉండదు. అమేఠీని వదులుకోవడం ఒక తప్పుడు సందేశాన్ని పంపుతుంది" అని పీకే వ్యాఖ్యానించారు. 2014లో మోదీ గుజరాత్‌తో పాటు.. వారాణసీ నుంచి కూడా పోటీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. "ఎందుకంటే.. హిందీ హార్ట్‌లాండ్ (యూపీ, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్, ఝార్ఖండ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, చండీగఢ్, ఢిల్లీ)ను గెలవకుండా, ఆ ప్రాంతంలో ఉనికిని బలంగా చాటుకోకుండా దేశాన్ని గెలవలేరు" అని స్పష్టం చేశారు. కనీసం 350 సీట్లలో బీజేపీకి వ్యతిరేకంగా ముఖాముఖి పోటీ చేయకపోతే కూటమికి అర్థం లేదన్నారు. బీజేపీని ఎదుర్కొనే నాయకత్వం, ఎజెండా కూటమికి లేవని.. అందుకే బీజేపీ పదేపదే గెలుస్తోందని విశ్లేషించారు. బీజేపీ మూడోసారి గెలిస్తే ఆ పార్టీ ఆధిపత్యం పెరిగిపోయే అవకాశం ఉందా అనే ప్రశ్నకు.. 1984లో అతిపెద్ద గెలుపు నమోదు చేశాకే కాంగ్రెస్ పతనం ప్రారంభమైందని, అప్పట్నుంచీ ఆ పార్టీ సొంతంగా అధికారంలోకి రాలేకపోయిందని గుర్తుచేశారు.

విపక్షాలు వాడుకోలేదు..

మోదీ నేతృత్వంలో బీజేపీ అప్రతిహతంగా దూసుకుపోతోందన్న వాదనను ఒక పెద్ద భ్రమగా ప్రశాంత్ కిశోర్ కొట్టిపారేశారు. 2014 తర్వాత.. అధికారపార్టీ వెనకబడ్డ సందర్భాల్లో విపక్షాలు, ప్రత్యేకించి కాంగ్రెస్ పార్టీ ఆ పరిస్థితిని సొమ్ము చేసుకోవడంలో విఫలమైనట్టు ఆయన పేర్కొన్నారు. 2015, 2016 సంవత్సరాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో.. అసోంలో తప్ప చాలా చోట్ల బీజేపీ ఓడిపోయిందని, ఆ తర్వాత ఆ పార్టీ పుంజుకోవడానికి ప్రతిపక్షాలే చాన్సిచ్చాయని గుర్తుచేశారు. నోట్ల రద్దు తర్వాత గుజరాత్‌లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ దాదాపు ఓడిపోయే స్థితికి వచ్చిందని, 2018లో పలు రాష్ట్రాల్లో ఓటమిపాలైందని.. వాటిని సొమ్ము చేసుకోకపోవడం ద్వారా 2019 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పెద్ద తప్పు చేసిందని విశ్లేషించారు. కొవిడ్ సమయంలో మోదీ పనితీరు బాగోలేదన్న అభిప్రాయం ఏర్పడి, పశ్చిమబెంగాల్‌లో బీజేపీ ఓడిపోయినా.. విపక్ష నేతలు ఆ అవకాశాన్నీ వాడుకోలేదని, తీరిగ్గా ఇళ్లల్లో కూర్చుని.. ప్రధాని మోదీ మళ్లీ రాజకీయంగా పుంజుకునేలా చేశారని విమర్శించారు. "పదే పదే క్యాచ్‌లు చేజార్చితే.. అవతల ఉన్న బ్యాటర్.. అదీ మంచి బ్యాటరైతే కచ్చితంగా సెంచరీ చేస్తాడు" అని క్రికెట్ పరిభాషలో చెప్పారు. మోదీ మూడోసారి గెలిచిన తర్వాత పెద్ద నిర్ణయాలు తీసుకుంటానని ప్రకటించారని.. ఆయనేమి చేస్తారో అన్న ఆసక్తి, ఆందోళన ఒక రాజకీయ పరిశీలకుడిగా తనకున్నాయని ప్రశాంత్ కిశోర్ చెప్పారు.

ఫలితాలు సాధించలేకపోతే..

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనుకున్న ఫలితాలు సాధించలేకపోతే.. రాహుల్ గాంధీ తప్పుకోవాల్సిందేనని పీకే సూచించారు. "పదేళ్లుగా విజయం సాధించకుండా ఒకే పనిచేస్తూ ఉంటే.. బ్రేక్ తీసుకోవడంలో తప్పేం లేదు" అని వ్యాఖ్యానించారు. ఫలితాలు రాకున్నా బాధ్యతలను ఇతరులకు అప్పగించకపోవడం అప్రజాస్వామికమని వ్యాఖ్యానించారు. గతంలో సోనియా పక్కన ఉండి.. పీవీకి బాధ్యతలు అప్పగించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పుకొన్న తర్వాత కూడా రాహుల్ గాంధీయే పరోక్షంగా పెత్తనం చలాయిస్తున్నారని చెప్పారు.



బీజేపీ గెలుపును ఎవరూ అడ్డుకోలేరు

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని మోదీ రోడ్ మ్యాప్ తయారు చేశారని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశానికి మోదీ వంటి నాయకుడు ఎంతో అవసరమని.. అలాంటి నాయకుడికి కులాలు, మతాలు, పార్టీలకతీతంగా మద్దతు ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడిపై ఉందన్నారు. తొమ్మిదిన్నర సంవత్సరాల్లో రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల బడ్జెట్ ఇచ్చి అభివృద్ధికి సహకరించారని తెలిపారు. జాతీయ రహదారులకు రూ.1.20 లక్షల కోట్లను ఖర్చు చేశారని చెప్పారు. దేశంలో అవినీతి నిర్మూలన జరిగిందన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించి ఆశీర్వదించాలని కిషన్‌రెడ్డి కోరారు.

శభాష్.. సమర్థంగా జవాబిచ్చారు

హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలతకు మోదీ ప్రశంసలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొంపెల్ల మాధవీలతను ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలతో ముంచెత్తారు. ఓ టీవీ ఇంటర్వ్యూలో ప్రశ్నలకు సమర్థంగా జవాబులిచ్చారంటూ ప్రోత్సాహం తెలిపారు. తన ప్రత్యర్థి అయిన ఎంఐఎం అధ్యక్షుడు లక్షన్నర ఓట్ల తేడాతో ఓడిపోతారని అంచనా వేయడంతో పాటు, బీజేపీలో టిక్కెట్ల కేటాయింపు ఎంత పారదర్శకంగా ఉంటుందో ఆమె చాలా తర్కంతో వివరించి చెప్పారు. మోదీని మహాయోగిగా అభివర్ణించారు. జవాబులు ఇచ్చిన తీరుకు ఎంతో సంతోషపడ్డ ప్రధాని మోదీ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. "మాధవీలతాజీ 'ఆప్ కీ అదాలత్' కార్యక్రమంలో మీరు చూపిన ప్రతిభ అద్భుతంగా ఉంది. మీరు పాయింట్లను చాలా స్పష్టంగా, తర్కంతో, ఎంతో ఇష్టంతో వివరించారు. మీకు నా అభినందనలు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని చూడాలి. చాలా ఆసక్తికర సమాచారం ఇందులో ఉంది" అని పేర్కొన్నారు.

శాస్త్రీయ నృత్యకళాకారిణి, వ్యాపారవేత్త అయిన మాధవీలత(49) హైదరాబాద్‌లో వరుసగా విజయాలు సాధిస్తున్న అసదుద్దీన్ ఒవైసీతో ఢీకొంటున్నారు. ధార్మిక ప్రవచన కర్తగా, హిందువుల సమస్యలపై పోరాడే ఉద్యమకారిణిగా ఆమెకు పేరుంది. ముమ్మారు తలాక్‌కు వ్యతిరేకంగా పోరాటం చేశారు. ఆమె భర్త విశ్వనాథ్ నెలకొల్పిన విరించి హాస్పిటల్‌కు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. బీజేపీ మొదటి విడతగా విడుదల చేసిన 195 మంది అభ్యర్థుల జాబితాలో ఆమె పేరు ఉండడం విశేషం. హైదరాబాద్‌లో బీజేపీ తరఫున పోటీ చేస్తున్న తొలి మహిళ కూడా ఆమే కావడం గమనార్హం.



బీజేపీలో అభ్యర్థుల ఎంపిక ఎంత శాస్త్రీయంగా ఉంటుందో మాధవీలత వివరిస్తూ "ఇప్పుడు నేను ప్రధాని మోదీతో భేటీ కాగలుగుతా. ఇది ఎంతో అదృష్టం. పార్టీ టిక్కెట్ రావడం వల్లనే ఇది సాధ్యమయింది. ఆయన కలియుగానికి చెందిన మహాయోగి. నన్ను చూడకుండానే, ఎలాంటి పరిచయం లేకుండానే టిక్కెట్ ఇచ్చారు. కేవలం నా సామాజిక సేవను చూసే నన్ను ఎంపిక చేశారు. నేనైతేనే ఓవైసీతో పోరాడగలనన్న ఉద్దేశంతో టికెట్ ఇచ్చారు. ఇంతకన్నా పారదర్శకమైన రాజకీయాలు ఒంకేముంటాయి?" అని ఆమె వ్యాఖ్యానించారు. గత 40 ఏళ్లుగా ఒవైసీ కుటుంబం చేతిలో ఉన్న హైదారాబాద్‌లో ఎలా విజయం సాధిస్తానో ఆమె చాలా తర్కంగా వివరించారు. ఇప్పటి వరకు వారు మోసపూరిత చర్యల ద్వారానే గెలుస్తూ వచ్చారని, ఈసారి మాత్రం లక్షన్నర ఓట్ల తేడాతో ఓడిపోతారని అన్నారు. "బోగస్ ఓట్లు ఉంటే 40 ఏళ్లు ఏమిటి 4000 సంవత్సరాల పాటు గెలవొచ్చు. ఏం చేస్తాం? మా దగ్గర బోగస్ ఓట్లు లేవు. ఒవైసీకి 6,20,000 బోగస్ ఓట్లు ఉన్నాయి. ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో ఒక ఓటరు కార్డు నెంబరు కొడితే ఆ పేరు రెండు చోట్ల కనిపిస్తుంది. ఒక్క చార్మినార్ ప్రాంతంలోనే 1,60,000 బోగస్ ఓట్లు ఉన్నాయి" అని వివరించారు. ఇంతవరకు ఒవైసీ తప్పుడు మార్గాల్లోనే గెలుస్తూ వస్తున్నారా అన్న ప్రశ్నకు మాధవీలత సమాధానం ఇస్తూ "కచ్చితంగా ఆ మాటే చెబుతాను. ఇందుకేమీ భయపడను" అని అన్నారు.

జగన్మోహన్‌రెడ్డి.. కుంభకర్ణుడు

ఆరు నెలల క్రితమే నిద్ర లేచాడు

- పాలనంతా అక్రమాలు, దౌర్జన్యాలు.. హత్యలు, దోపిడీలే
- జనం గెలిపించింది మర్డర్ చేయడానికేనా?
- సీఎం జగన్‌పై చెల్లెళ్లు షర్మిల, సునీత ధ్వజం

కడప, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): "ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కుంభకర్ణుడిలా నాలుగున్నర సంవత్సరాలు నిద్రపోయి ఎన్నికలకు ఆరు నెలల ముందు నిద్రలేచాడు. ఆయన పాలనంతా అక్రమాలు, దౌర్జన్యాలు. రాష్ట్రమంతా హత్యలు, దోపిడీలు, ఇసుక మాఫియా, మైనింగ్ మాఫియా.. ఎక్కడా అభివృద్ధి లేదు" అంటూ పీసీసీ అధ్యక్షురాలు, జగన్ సోదరి వైఎస్ షర్మిలారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా షర్మిల, వివేకానందరెడ్డి కుమార్తె సునీత కడప జిల్లా కమలాపురం నియోజకవర్గంలోని పెండ్లిమర్రి, వీరపునాయునిపల్లె, కమలాపురంలలో ఆదివారం బస్సుయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ.. "వైఎస్ఆర్ హయాంలో సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేశారు. జగన్ సీఎం అయ్యాక ప్రాజెక్టులకు దిక్కే లేదు. కడప స్టీలు ఫ్యాక్టరీ వైఎస్ కల. అది పూర్తయి ఉంటే ప్రత్యక్షంగా 25వేల మందికి, పరోక్షంగా మరో 20 వేల మందికి ఉద్యోగాలు వచ్చేవి. జగన్ సీఎం అయిన తర్వాత శంకుస్థాపనలు తప్పిస్తే స్టీలు ఫ్యాక్టరీ ముందుకు కదలలేదు. జగన్ పాలనంతా హత్యా రాజకీయాలు, దౌర్జన్యాలు, దోపిడీలకే పరిమితమైంది. జనం ఓట్లేసి గెలిపించింది దీనికేనా..? పెండ్లిమర్రి మండలంలోని యాదవాపురం గ్రామంలో భూమి కోసం ఎంపీ అవినాశ్‌రెడ్డి అనుచరులు శ్రీనివాసయాదవ్ అనే వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. ఇది పోలీసుల ప్రమేయంతో జరిగిందని ఆరోపణలు రావడంతో స్థానిక సీఐని, ఎస్ఐని సస్పెండ్ చేశారు. అయితే ఎవరిని దోషులుగా చూపుతున్నారో వారి పేర్లను కనీసం ఎఫ్ఐఆర్‌లో కూడా నమోదు చేయలేదు. ఎమ్మెల్యే, ఎంపీకి సన్నిహితులు కాబట్టి ఇప్పటికీ వారు యథేచ్ఛగా బయట తిరుగుతున్నారు. వివేకా హత్య జరిగి ఐదేళ్లయింది. హత్య చేసిన వారు బయట తిరుగుతున్నారు. అన్ని ఆధారాలున్నా చర్యలు లేవు. అవినాశ్‌రెడ్డి నిందితుడని సీబీఐ చెప్పింది. అటువంటి వ్యక్తికి మళ్లీ జగన్ టికెట్ ఇచ్చారు. హత్య చేసిన వారిని గెలిపించాలని చూస్తున్నారు. వివేకా స్వయాన జగన్‌కు బాబాయి. అయినా కనీస న్యాయం జరిగే పరిస్థితి కూడా లేదు. నిందితులు చట్టసభల్లోకి వెళ్లకూడదనే నేను ఎన్నికల్లో నిలబడ్డా. న్యాయం ఒకవైపు.. అధర్మం మరోవైపు.. వైఎస్ బిడ్డ ఓ వైపు, వివేకాను హత్య చేసిన నిందితులు మరోవైపు ఉన్నారు.. ఎవరిని గెలిపించాలో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి" అని షర్మిల కోరారు.



షర్మిలను చూస్తే వైఎస్ గుర్తొస్తారు: సునీత

షర్మిలను ఎంపీగా చూడాలన్నదే తన తండ్రి వివేకానందరెడ్డి కోరిక అని ఆయన కుమార్తె సునీత తెలిపారు. షర్మిలను చూస్తే వైఎస్ఆర్ గుర్తుకొస్తారని, ఆయన గుణగణాలన్నీ ఆమెలో ఉంటాయని తన తండ్రి అనేవారని తెలిపారు. పక్కా స్కెచ్‌తోనే వివేకాను హత్య చేశారని సునీత ఆరోపించారు. "వివేకా హత్య పర్సనల్ విషయమని అంటున్నారు. ఇదసలు పెద్ద విషయం కాదన్నట్లు సజ్జల రామక్రిష్ణారెడ్డి అర్థం లేకుండా మాట్లాడుతున్నారు. వివేకా హత్య గురించి ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి మాటలు విడ్డూరంగా ఉన్నాయి. ప్రజల ప్రయోజనాల కోసం పనిచేసేవాళ్లు కావాలంటే షర్మిలను ఎన్నుకోవాలి" అని సునీత కోరారు.

బీసీలకు బద్ధ శత్రువు కాంగ్రెస్

- పంచ న్యాయాల పేరుతో పంగ నామాలు: బీజేపీ ఎంపీ లక్ష్మణ్

హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బీసీలకు బద్ధ శత్రువు కాంగ్రెస్ పార్టీ అని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలు బీసీలను కించపరిచేలా ఉన్నాయని అన్నారు. చాయ్ అమ్మిన బీసీ ప్రధానిగా ఉంటే కాంగ్రెస్ ఓర్చుకోలేకపోతోందని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు సామాజిక న్యాయం గురించి మాట్లాడటమంటే.. దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ధ్వజమెత్తారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఓబీసీ మోర్చా సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడారు. అంబేడ్కర్‌ను ఓడించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని.. ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం ఆయన పేరును కాంగ్రెస్ వాడుకుంటోందని విమర్శించారు. కాంగ్రెస్ కార్యాలయంలో అంబేడ్కర్ ఫొటో కూడా ఉండదన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయలేని కాంగ్రెస్.. ప్రజలను మభ్యపెట్టడానికి మరో ఐదు గ్యారెంటీలను ప్రకటించిందని ఆరోపించారు. పంచ న్యాయాల పేరుతో ప్రజలకు పంగ నామాలు పెట్టడానికి తెరలేపిందని అన్నారు.

6 గ్యారెంటీలు ఆత్మలయ్యాయి: రాణి రుద్రమ

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలు కాకుండా ఆత్మలై తిరుగుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ విమర్శించారు. ఆ గ్యారెంటీలు ఎక్కడా కనిపించడం లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో బొంద పెట్టిన కాంగ్రెస్.. కొత్తగా ఐదు గ్యారెంటీలను ప్రకటించిందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా సగం లోక్‌సభ స్థానాల్లో కూడా పోటీ చేయని కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి రావడం సాధ్యమేనా? అని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ ప్రశ్నించారు.

ట్యాపింగ్ తొలి బాధితుడిని నేనే

- దాని వల్లే ఈ పరిస్థితిలో ఉన్నా
- మీట్ ద ప్రెస్‌లో ఈటల రాజేందర్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): 'ఫోన్ ట్యాపింగ్‌లో మొదటి బాధితుడిని నేనే. నా ఫోన్, నా కుటుంబసభ్యులు, డ్రైవర్, వంట మనుషుల నుంచి ప్రతి ఒక్కరి ఫోన్ ట్యాప్ చేశారు. దాని వల్లే నేను ఈ పరిస్థితిలో ఉన్నా' అని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. అమీర్‌పేటలోని ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన మీట్ ద ప్రెస్‌లో ఈటల మాట్లాడారు. కేసీఆర్ తన క్యాబినెట్ లోని 17 మంది మంత్రులను కూడా నమ్మలేదని.. వాళ్ల ఫోన్లు, భార్య భర్తల సంభాషణలు కూడా విన్నారని ఆరోపించారు. ట్యాపింగ్ వల్ల కాపురాలు కూలిపోయాయని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం గెలిచిన ఎమ్మెల్యేలను కాదని.. ఓడిన ఎమ్మెల్యేలతో ప్రారంభోత్సవాలు జరిపించిందని.. ఇప్పుడు ఈ ప్రభుత్వం కూడా అలాగే చేస్తోందని పేర్కొన్నారు. కేసీఆర్ పీడ విరగడ కావాలని ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేశారని.. అయితే వారు కూడా కేసీఆర్ పాలననే కొనసాగిస్తున్నారని చెప్పారు. రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల పాలు చేశారని చెబుతున్న కాంగ్రెస్.. ఆరు గ్యారెంటీలు ఎలా అమలు చేస్తుందని ప్రశ్నించారు. ధరణి సమస్యలు అలాగే ఉన్నాయని, కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందని.. వీటిపై సమగ్ర దృష్టి పెట్టి రైతులను ఆదుకోవాలన్నారు. జర్నలిస్టుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎవరినీ వరించని అదృష్టం రేవంత్‌ను వరించిందని తెలిపారు. మోదీని పెద్దన్న అని పిలిచిన ఆయన.. ఇప్పుడు విమర్శలు చేస్తున్నారని ఈటల అన్నారు.



17 సీట్లతో రాహుల్ ప్రధాని అవుతారా..?

రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని రేవంత్ చెప్పారని.. ఇప్పుడేమో తెలంగాణలో 17 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే రాహుల్ ప్రధాని అవుతారని.. అప్పుడు అమలు చేస్తామని అంటున్నారని పేర్కొన్నారు. దేశంలో కాంగ్రెస్‌కు 60 సీట్లు కూడా దాటవని చెప్పారు. రాష్ట్రంలో 17 సీట్లిస్తే రాహుల్ ప్రధాని ఎలా అవుతారని ప్రశ్నించారు. తెలంగాణలో బీజేపీ 12కుపైగా సీట్లలో గెలుస్తుందన్నారు. కొడంగల్‌లో రేవంత్‌ను ఓడించిన పట్నం నరేందర్‌రెడ్డి కుటుంబీకులనే ఆయన మల్కాజిగిరి బరిలో దింపారని చెప్పారు. రాజీవ్ గాంధీ ఫిరాయింపుల నిరోధక చట్టం తెచ్చారని.. రాహుల్ గాంధీ మరో అడుగు ముందుకేసి.. పార్టీ మారే వారు రాజీనామా చేయకుండా వస్తే వేటు వేస్తామని తాజాగా విడుదల చేసిన మేనిఫెస్టోలో చెప్పారని పేర్కొన్నారు. మరి కాంగ్రెస్‌లో చేరిన ఇతర పార్టీల వారు ఎంతమంది రాజీనామా చేశారని ప్రశ్నించారు. దేశం సురక్షితంగా, సుభిక్షంగా ఉండాలంటే మోదీ మరోసారి ప్రధాని కావాలని ఈటల అన్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** *on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor:* **K. Srinivas**. *Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86.* **Managing Director: Vemuri Radha Krishna,** *Founder: K.L.N.Prasad.*